


శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

# ముగ్గురు గురువుల గురుచరిత్ర







## 1. శ్రీనృసింహ సరస్వతి
## 2. శ్రీ మాణిక్య ప్రభువు
## 3. శ్రీ అక్కల్‌కోట మహారాజ్

రచన :
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.



**ముగ్గురు గురువుల గురుచరిత్ర**

మొదటి ప్రచురణ

ఫిబ్రవరి 2009

రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.

వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 040-23814379

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848515109



## ప్రార్థన

కం॥ శ్రీపాదగురుల గాథను
ఓపికతో చదివినారు ఉత్తములారా!
ఆపై శ్రీగురుగాథను
ఈపట్టున నేర్వుడయ్య! ఏకాగ్రతతో.

కం॥ శ్రీగురు చరితము వ్రాయగ
చేగొని ఇటు చుట్టినాను శ్రీకారమునే
నాగత జన్మల ఫలమిది
కాగల కార్యంబు దీర్పగలడాగురుడే.

కం॥ పలుకుచు తెలిసినదేనని
విలువగ ఈ 'గురుచరిత్ర' విడువకుడయ్యా!
తలువకుడు 'తప్పు' ఇదియని
సులభంబీ విధము గురుని సొంపుగ కొలువన్.



చం॥ గురు చరితంబునీపగిది క్రొత్తవిధంబున
జెప్పనెంచితిన్
నిరుపమ భక్తిచేత, గణనీయము ఈ కథ
మువ్వురైన ఈ
గురువుల గాథ నేర్వుడిక గూడదు జన్మము,
'దత్తమౌని' మీ
సరసన జేరి బ్రోచుమిము, సజ్జనులన్ ఘన
కీర్తినీయుచున్.

తే॥ తెలిపి 'శ్రీపాదవల్లభున్' తొలిగురువుగ,
గురు 'నృసింహ సరస్వతి' గూర్చి చెబుదు,
పిదప 'మాణిక్య ప్రభు' గాథ విశదపరచి,
వెనుక 'అక్కలు కోట' గురుని తెలిపెద.

కం॥ గురు చరిత చదివినంతనె
గురుతరమగు గురుని కరుణ కుదురును ఆపై
పరుగిడక మనసు స్థిరమగు
'హరి' దయయున్ కలుగు సుమ్మి! అదె సుకృతమౌ

సీ॥ మోదకరంబైన ముగ్గురు గురువుల
చరితంబు నీనాడె చదువురయ్య
'శ్రీనృసింహుల' యొక్క 'శ్రీగురుచరితమ్ము'
మొదటి భాగంబాయె ముక్తినీయ
'మాణిక్య ప్రభువుల' మహనీయ చరితంబు
రెండవ భాగమై లిఖితమయ్యె
'అక్కలుకోట మహారాజు' చరితంబు
మూడవ భాగమై ముదమునిచ్చె.

ఆ॥ 'శ్రీగురుచరితంబు' చెప్పెదనీరీతి
దత్తగురుని గొలిచి దయను బొంది
పద్యగద్య కృతిని బాగుగా చదువుడు
గురుని కృపను తమరు అరయగలరు.



# శ్రీ దత్తాత్రేయ స్తోత్రము

**జగద్గురు శ్రీమచ్ఛంకరాచార్య ప్రణీతమ్**

మూలాధారే వారిజపత్రే చతురస్రే
వంశం షం సం వర్ణ విశాలే సువిశాలే
రక్తం వర్ణం శ్రీగణనాథం భగవంతం
దత్తాత్రేయం శ్రీగురుమూర్తిం ప్రణతోస్మి

స్వాధిష్ఠానే షడ్దల పత్రే తనులింగే
బాలాంతావద్వర్ణ విశాలే సువిశాలే
పీతం వర్ణం వాకృతిరమణం దృమిణంతం
దత్తాత్రేయం శ్రీ గురుమూర్తిం ప్రణతోస్మి

నాభీపద్మే పత్రదశారే ఢఫ వర్ణే
లక్ష్మీకాంతం గరుడారూఢం నరవీరం
నీలం వర్ణం నిర్గుణ రూపం నిగమంతం
దత్తాత్రేయం శ్రీ గురుమూర్తిం ప్రణతోస్మి

హృత్పద్మాం తే ద్వాదశ పత్రే కఠవర్ణే
శంభుం శేషం హంస విశేషం సమయంతం
స్వర్గ స్థిత్యంతం కుర్వంతం గురుమూర్తిం
దత్తాత్రేయం శ్రీ గురుమూర్తిం ప్రణతోస్మి



కంఠస్థానే చక్రవిశుద్ధే కమలాంతే
చక్రాకారే షోడశపత్రే స్వర్ణవర్ణే
మాయాధీశం జీవశివాంతం శివశక్తిం
దత్తాత్రేయం శ్రీ గురుమూర్తిం ప్రణతోస్మి

ఆజ్ఞాచక్రే భృకుటి స్థానే ద్విదళాంతే
హం క్షం బీజం జ్ఞాననిధిం తం నిటలాక్షం
విద్యుద్వర్ణం జ్ఞాన మనంతం గురుమూర్తిం
దత్తాత్రేయం శ్రీ గురుమూర్తిం ప్రణతోస్మి

బ్రహ్మానందం బ్రహ్మముకుందం భగవంతం
బ్రహ్మజ్ఞానం సత్యమనంతం భగరూపం
పూర్ణ బ్రహ్మానందమయం తం గురుమూర్తిం
దత్తాత్రేయం శ్రీ గురుమూర్తిం ప్రణతోస్మి

శాంతాకారం శేషశయానం సురవంద్యం
కమలానాథం కోమలగాత్రం కమలాక్షం
చింతారత్నం చిద్ఘనమూర్తిం ద్విజరాజం
దత్తాత్రేయం శ్రీ గురుమూర్తిం ప్రణతోస్మి

శ్రీ దత్తశ్శరణం మమ

సేకరణ : డా॥ గొల్లా పిన్నిశారదా సుబ్రహ్మణ్య శాస్త్రి



# అంకితం

కం॥ అమరెను దత్తాత్రేయుడు
'గమి' తేజుడు రూపుదాల్చె 'గణపతి' గురులై
తమితో అంకితమిత్తును
అమలుడు ఈస్వామి సచ్చిదానందునకున్

పూజ్య గురువులు
శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారికి భక్తితో

# ముగ్గురు గురువుల గురుచరిత్ర

శ్రీదత్తాత్రేయస్వామి వారి గురించి తెలియని భక్తులు, అందులోనూ సాయిబాబా భక్తులు అసలు ఉండరు. నా పూర్వజన్మ సుకృతం వల్ల నేను దత్తాత్రేయ స్వామి వారి వజ్రకవచనం అనే స్తోత్రాన్ని పెద్దల ఆశీస్సులతోను సహకారంతోను తెలుగులోకి అనువదించాను. మంత్రయుక్తమైన ఆ దత్తకవచం విశేష మహిమగలది. సులభ శైలిలో రచించిన ఆ కవచం నాకు ఎనలేని తృప్తి మరియు ప్రోత్సాహమిచ్చి ఈ రచనకు అంకురార్పణ గావించింది.

శ్రీ గురుచరిత్రను చాలమంది భక్తులు ఈ వరకే చదివి ఉంటారు. కాని నాలాగా చాలా ఆలస్యంగా భగవన్మార్గంలో జొరబడ్డవారు ఎప్పుడూ ఉంటూనే ఉంటారు. అందుకని నాలాంటి వారికోసం శ్రీగురుచరిత్రను 'ముగ్గురు గురువుల గురుచరిత్ర' అనే పేరుతో మూడు భాగాలున్న పద్యగద్య రచనగా చేయాలని నా సంకల్పం. చాలా తేలిక గద్యమూ మరియు పద్యం



అక్కడక్కడా ఉన్నా అవి స్తోత్ర రూపంలోనో వర్ణన రూపంలోనో సంభాషణ రూపంలోనో ఉండటం వల్ల చాలా తేలికగా అర్ధమై పాఠకులను ఇబ్బంది పెట్టదని నా నమ్మకం.

విభిన్న రీతిలో రచింపబడిన ఈ గురుచరిత్ర పేరులోనే విలక్షణత్వం చోటు చేసుకున్నది. ముగ్గురు గురువుల (అంటే శ్రీనృసింహ సరస్వతి, శ్రీమాణిక్య ప్రభువు మరియు శ్రీ అక్కల్ కోట మహారాజ్‌ల) గురు చరిత్ర అంటే గొప్ప కథ అని అర్ధం. మూలం చెడకుండా కథలాగా ఆసక్తికరంగా శ్రీగురుచరిత్ర చెప్పాలనే నా ప్రయత్నం పాఠక రసహృదయాలను అలరిస్తుందని నా ఆశ.

ఈ గురు చరిత్రలో సాయిబాబా మరియు దత్తాత్రేయ స్వామివారి చరితలు వ్రాయక పోవడానికి ముఖ్య కారణం చర్విత చరణమవుతుందని మాత్రమే. **www.geetadeeksha.com** అనే నా వెబ్‌సైట్‌లో మీరు అవేగాక నా ఇతర రచనలు కూడా చదివి ఆనందిస్తారని నా ఆశ.



శ్రీగురుచరిత్ర శ్రీనృసింహ సరస్వతి స్వామివారి కథ మరియు వారి దివ్య మహిమలు తెలిపే చరిత్ర. గంధర్వపురం (గాణంగాపూర్) లో క్రీ.శ.1376 నుండి క్రీ.శ.1459 వరకు నివసించిన శ్రీ నృసింహ సరస్వతి కథను వారి ప్రియశిష్యుడైన సిద్ధయోగి ఒక అశ్వత్థవృక్షం (రావిచెట్టు) క్రింద కూర్చుని నామధారకుడను శ్రీగురు భక్తునికి వానిని కరుణించి వాని దారిద్ర్యమును నిర్మూలించి, వానికి సవిస్తరముగా శ్రీగురుని చరిత్ర నెరింగించుటయే అనాదిగా వస్తున్న విధానము.

రెండవ భాగం శ్రీమాణిక్య ప్రభువుల (క్రీ.శ.1816-1865) దివ్యచరిత్ర.

మూడవదైన శ్రీఅక్కల్‌కోట మహారాజ్ (క్రీ.శ. 1836-1876) గారి కథతో ఈ రచన ముగిస్తాను.

ఆ విధంగా ముగ్గురు గురువుల గురుచరిత్ర చదివి జన్మ చరితార్ధం చేసుకోండి.



## అవతారిక

సరస్వతీ గంగాధరులనే దత్తాత్రేయ స్వామి భక్తులు వారి దివ్యానుగ్రహంచేత మహాపవిత్రమైన 'శ్రీగురుచరిత్ర' అనే కావ్యం వ్రాశారు.

నానా కష్టాలననుభవిస్తూ తపించిపోతున్న 'నామధారకు'డనే భక్తుడు గాణ్‌గాపురంలో శ్రీగురుని దర్శించి స్వామీ నేనీకష్టాలు భరించలేను, నన్ను కడతేర్చండి శరణు, శరణు అని ప్రార్ధించి మూర్ఛిల్లాడు. శ్రీనృసింహ సరస్వతీ స్వామి శ్రీగురునిగా భక్తులకు కొంగుబంగారం అని అందరికీ తెలుసు. మూర్ఛిల్లిన నామధారకునికి కలలో ఒక దివ్యపురుషుడు సాక్షాత్కరించాడు. నామధారకుడు ఆనందాశ్రువులతో ఆ దివ్యపురుషుని పాదప్రక్షాళనజేసి ప్రార్ధించాడు.

కలనుంచి మేల్కొన్న నామధారకుడు నాలుగు దిక్కులూ గాలించాడు, ఆ పురుషునికోసం. ఒకచెట్టుక్రింద యోగముద్రలోనున్న ఒకమహాత్ముని చూచి అతనే తనకు

కలలో కనిపించిన వ్యక్తని గుర్తించి వారి కాళ్ళపైబడి తనననుగ్రహించమని వేడుకున్నాడు.

అప్పుడా యోగి **నాయనా! నాపేరు 'సిద్ధుడు'. నేను శ్రీదత్తాత్రేయ స్వామి అవతారమైన 'శ్రీనృసింహసరస్వతీ స్వామి' వారి శిష్య పరమాణువును. గంధర్వపుర (గాణ్‌గాపురం) నివాసియైన ఆ స్వామిలీలలు అద్భుతమైనవి.**

**భవసాగర తారకమైన ఆ శ్రీగురుచరిత్ర వారి శరణు పొందిన వారికి బోధించటమే నా ఈ సంకల్పం. నీవు శ్రీగురుని శరణుజొచ్చావు, కనుక నీకు నా దర్శనమయింది. శ్రద్ధగా విను** అని ఒక అశ్వత్థవృక్షంక్రింద కూర్చుని వినమృడైన శిష్యుడు నామధారకునికి ఈ గురుచరిత్ర తెలిపాడు.

ఆ కథనమంతా తన పురాకృత పుణ్య విశేషంచేత పద్యగద్య కావ్యంగా మూడు అంకములున్న **"ముగ్గురు గురువుల గురుచరిత్ర"**గా అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు తెలియచేస్తున్నాడు.



# 1. శ్రీనృసింహ సరస్వతి

పూర్వం 'కరంజా' అనే గ్రామం (అకోలా జిల్లా, మహారాష్ట్ర) 'మాధవ శర్మ' అనే వేదపండితునకు **'అంబా భవాని'** అను సౌందర్యవతి, సుగుణాల ప్రోవయిన కన్యనిచ్చి వైభవంగా వివాహం జరిపించారు, ఆమె తల్లిదండ్రులు. వారి అన్యోన్య దాంపత్య ఫలంగా భవాని గర్భవతై పదినెలల తర్వాత పండంటి బిడ్డను కన్నది. అది క్రీ.పూ 1376వ సంవత్సరము. ఆ బాలుడు పూర్వజన్మలో గురుశ్రీపాదవల్లభులే.

బాలునికి తల్లిదండ్రులు వైభవోపేతంగా నామకరణ మహోత్సవం జరిపించి 'నరహరి' అనే పేరు పెట్టారు. అతని దివ్యావతార లక్షణములు పుట్టుకతోనే తెలియవచ్చాయి.



**కం॥ 'కేరు'మని ఏడ్వడాయెను**
**పేరొందిన 'యోగి' వోలె వింతగు రీతిన్**
**నోరార 'ఓం' అనంచనె**
**"ఔరా!" ఆ పాపడింక ననదేదియున్.**

తల్లికి పాలులేవు. బిడ్డడిక ఎట్లా బ్రతుకుతాడని అంతా భయపడ్డారు. పిల్లవాడు ఏడ్వడు. పాలులేవు. కాని అద్భుతమేం జరిగిందంటే పాపాయి తల్లి స్తనములను తాకగానే పాలధార పెల్లుబికి వచ్చింది. అతను దివ్యపురుషుడని అందరూ భావించారు, కాని మూడేళ్ళు వచ్చినా అబ్బాయికి 'అమ్మ' అనే మాటకూడ రాలేదు.

తనహస్తంతో ముట్టుకుని, ఇనుపముక్కను సువర్ణం చేయగల ఆ మూడేళ్ళ పాపడు నోరార ఎందుకు పలకడు? ఎందుకు ఎప్పుడూ ధ్యానముద్రలో ఉన్నట్లు అర్ధనిమీలిత నేత్రాలతో వుంటాడో ఎవరూ ఊహించలేకపోతున్నారు. అలా రోజులు గడిచిపోతూ పిల్లవాడికి ఎనిమిదేండ్లు వచ్చాయి.



ఇక ఇలా లాభంలేదని నరహరి తన చిట్టిచిట్టి చేతులతో సైగలు చేస్తూ తనకు ఉపనయనం చేయమని అడిగాడు. ఒక్కగానొక్క కొడుకు కాబట్టి ఆ ముచ్చట కూడా తీర్చాడు తండ్రి. వటువును తొలిభిక్షకోసం తల్లి అంబా భవానివద్దకు తెచ్చారు. అప్పుడు ఎవ్వరూ కనీవినీ ఎరుగని ఒక అద్భుతం జరిగింది.

**తే॥ తొలుత 'భవతి భిక్షాందేహి' తోటి అతడు**
**మాట మొదలిడె అబ్బురపడగ జనులు**
**మూడు మారులు భిక్షతో మున్నెరుగని**
**మూడు వేదాలవల్లించె మొత్తమతడు.**

ఆనందంతో తల్లిదండ్రులకూ ఆశ్చర్యంతో ఇతరులకు నోటమాటరాలేదు.

మాటలే రాలేదనుకుంటే ఏకంగా వేదపండితుడైన పుత్రుని చూచి తలిదండ్రులు ఆనంద భాష్పాలు రాల్చారు.

వారి ఆనందం క్షణంలో ఆవిరైపోయింది. పిడుగులాంటి ఒక మాట అన్నాడు నరహరి.

**జననీ జనకులారా! దయచేసి నాకు సన్యసించుటకు అనుమతి నివ్వండి. తల్లి ఎట్లాగో తేరుకుని "నాయనా! నీవు మాకు ఒక్కగానొక్క కొడుకువు. నీతోనే మా వంశం అంతరించిపోవాలా? మాకు మా పెద్దలకు సద్గతులు లేవా? తల్లిదండ్రి ఋణం ఎంత బాగా తీర్చుకుంటున్నావు కుమారా? మూగవానిగానైనా మా కళ్ళెదుట ఉంటే నీ ముద్దు లొలుకు మోము జూచి ఆనందించేవారం గదా! ఇప్పుడు మాకు ఏడ్వాలో నవ్వాలో తెలియటం లేదు.** ఏడుస్తూ అన్నదా మాతృమూర్తి.

**"తల్లీ! ఎంత బేలలా మాట్లాడుతున్నావు? నా పుట్టుకకు కారణమే జ్ఞానబోధ చేయుట. నన్ను నా కర్తవ్య విముఖుని చేయుట న్యాయమా" అన్నాడు. "నీవు ఎన్ని చెప్పినా నీకు నానోటితో సన్యసించమని చెప్పలేను"** అన్నదాతల్లి.



ఇక ఇట్లాకాదని తను శ్రీపాదవల్లభుడననీ, దత్తాత్రేయాంశ సంభూతుడనని చెప్పాడు. తన జన్మకారణమే పలువురికి గురుకృప కలిగించటం కాబట్టి సంసార చక్రం తనకు వద్దని విన్నవించుకున్నాడు. కన్నీరు మున్నీరై ఆమె **"నాయనా నీవు దత్తాత్రేయుడవే అయినా తల్లిని ఏడ్పించుట ధర్మమేనా. ఎంతమంది వివాహితులు శిష్యులకు జ్ఞానబోధ చేయుటలేదు. నాకు నీతండ్రికి వేరే ఆధారమేమున్నది? నవమాసములు మోసి నిను కన్నదాని ఫలితం ఇదేనా నీముద్దుమాటలు వినే భాగ్యం కూడ నాకు కలగలేదే"** అని విలపించింది.

**మ॥ జననీ! అన్యులవోలె నేను అవనిన్ సంసార**
**చక్రంబునన్**
**కనుమూయన్ జనియించలేదు గురునై కల్పింతు**
**సన్ముక్తినిన్**
**జనులన్ యీ భవసాగరంపు దరినిన్ సాధింపగా**
**జేతునే**
**మును ఆ'శంకరు' తల్లిరీతి ఇకనన్ ముక్తుందు**
**గావింపవే**



**సరే! ఆ గురుదేవుల రీతిగా నేనూ నీకు మాట ఇస్తున్నాను. నేనెక్కడ ఉన్నా నన్ను తలుచుకోగానే నీ కనులముందు ప్రత్యక్షమవుతాను. అంతేకాదు నా మూలంగా పాపాయి పసిడి పలుకులు వినే అదృష్టం కోల్పోయారు కావున మీకు ఆ లోటు లేకుండా ఇద్దరు కుమారులు (కవలలు) అందాల భరిణ సుగుణాల ప్రోవు అయిన ఒక కుమార్తె కలిగి నీ కోరిక నెరవేరుతుంది. మీ వంశం వర్ధిల్లుతుంది.**

**ఇక సంతోషంతో అనుజ్ఞ ఇమ్మని** ఆమె అనుమతి గైకొని కాశీయాత్రకు వెడలిపోయాడు. గంగాతటి వద్ద అతను యోగాభ్యాసం చేస్తున్న విధానం గమనించి అక్కడున్న యోగులే ఆశ్చర్యంతో తలమునకలైనారు. బాలుడని చిన్న చూపు చూసిన అతడు దివ్య పురుషుడు అని గ్రహించి, అభినందించి సన్యాసదీక్ష నిప్పించారు. అక్కడ ఉన్న 'శ్రీకృష్ణ సరస్వతి' అనే ఒకవృద్ధుడైన గురుమూర్తి నరహరికి **శ్రీనృసింహ సరస్వతి** అని గురునామం ప్రసాదించి **నీకీర్తి ఆ చంద్రతారార్కం వర్ధిల్లుతుందని** దీవించాడు.



కాశీలోని మహాపండితులుకూడా అతని శిష్యులై పోయారు. వారితో చాలా తీర్థయాత్రలు చేస్తూ 'బదరికాశ్రమం' చేరారు శ్రీనృసింహ సరస్వతి.

గలగల పారే గోదావరీ నదిని చూచి నృసింహ సరస్వతి పులకించిపోయి సామాన్య మానవులను సైతం పునీతులను చేస్తున్న ఆ నదీమతల్లికి మనసారా నమస్సుమాంజలులర్పించారు. ఆ తరువాత అదేవిధంగా ఎన్నో దివ్యక్షేత్రాలు సందర్శిస్తూ చివరికి 'ప్రయోగ' చేరారు. అక్కడ ఎందరో ఉద్దండ పండితులను కలిసి తన తర్కజ్ఞాన ప్రతిభ చూపించి వారిని సమ్మోహితులను చేశారు. వారు ఆయన జ్ఞానార్ణవాన్ని తిలకించి అబ్బురపడి ఆయన శిష్య పరమాణువులయ్యారు. అచ్చట కొంత కాలం ఉండి ఎందరికో సన్యాసదీక్ష నిప్పించి పునీతుల జేసి దివ్యజ్ఞాన ప్రబోధ చేశారు.

తిరిగి శ్రీనృసింహ సరస్వతి తన స్వస్థలమైన 'కరంజియా' కి బయలుదేరారు. చాలా రోజుల తర్వాత కన్నకుమారుని పవిత్ర గురుమూర్తిగా చూచి తలిదండ్రులు

ఆనందాతిరేకంతో చేతులెత్తి నమస్కరించారు. గ్రామస్థులంతా మూకుమ్మడిగా పాదాక్రాంతులైనారు. వారందరినీ **సుఖీభవ** అని ఆశీర్వదించి వారి అభ్యర్థన మేరకు అందరి ఇండ్లలోనూ భిక్షగైకొనినారు. అదీ ఒక్కొక్క ఇంట ఒక్కొక్క రూపంలో. ఆ అద్భుతం చూచి పురవాసులు పులకించిపోయారు. ఆయననందరూ శ్రీగురుమూర్తి అని కీర్తించారు. అదే 'శ్రీగురు' గా రూపాంతరం చెంది జగద్విఖ్యాతమయ్యింది. తన పూర్వాశ్రమ తలిదండ్రులకు తన పూర్వజన్మ రూపమైన 'శ్రీపాదవల్లభుల' రూపం చూపించి తను దివ్యాత్ముడని ఏరూపం అన్నది ప్రధానం కాదని మరొక్క మారు నిరూపించారు. నశ్వరమైన శరీరం ఆత్మకు ఒక వలువ మాత్రమేనని గీతామృతం బోధించారు. "ఏ వంశంలోనైతే ఒక ఉత్తమ సన్యాసి అవతరిస్తాడో ఆ వంశంలో 42 తరముల వారు ఉద్ధరింపబడి పాపవిముక్తులవుతారు" అని అభయమిచ్చారు శ్రీగురులు. అప్పుడాయన సోదరి తనకూ సన్యాస దీక్ష నిప్పించమని కోరింది. శ్రీగురులు నవ్వుతూ సోదరికిలా చెప్పారు.



**కం॥ మతిగొని తపములు దీక్షలు**
**ప్రతి పురుషుడు చేయవలెను వలచిన ముక్తిన్**
**పతిసేవ చేయు పడతికి**
**అతివా! మోక్షమ్ము దక్కునతి సులభముగా.**

అప్పుడామె '**స్వామీ మీరు త్రికాలజ్ఞులు, నాకు** సంసార **జీవితం ఎలా ఉంటుందో తెలపండి'** అన్నది దానికి శ్రీగురులు **అమ్మా! భవిష్యత్తు తెలిసిన** మనిషి వ్యధ **చెందుతాడు. భగవానుడు** మనిషికిచ్చిన రెండు గొప్ప **వరములేవో తెలియునా?** రేపు ఏమి **జరుగుతుందో తెలియకపోవుట, మరియూ నేడు జరిగినది రేపు మరచిపోవుట. ఈ వరములు** లేని మనిషికి **దుఃఖమే మిగులును. మరి నీకు భవిష్యత్తు తెలుసుకోవాలన్న కోరిక** తగునా? **అయినా నీవు అభ్యర్థించావు** గనుక **చెబుతున్నాను.**

**నీవు నీ పూర్వజన్మలో అన్యోన్యంగా ఉన్న**



**దంపతులను విడదీసి తామసగుణముగలదానివై వారికి తగవులు పెట్టావు. కనుక ఈ జన్మలో నీ భర్తనిన్ను విడనాడి సన్యసిస్తాడు. ఆ జన్మలో నీవు కోపం ఆపుకోలేక ఒక ఆవును కొట్టి చంపావు. దాని ఫలితంగా నీవు ఈ జన్మలో కుష్ఠురోగివవుతావు"** అని చెప్పారు. దానికామె భయంతో ఏడుస్తూ శ్రీగురుల కాళ్ళపైబడి తనని రక్షించమని వేడుకున్నది.

దానికాయన **తల్లీ! కర్మఫలం అనుభవించక తప్పదు. అయినా, నీవు నా శరణు జొచ్చావు గనుక అది నీ వృద్ధాప్యంలో జరుగునట్లు అనుగ్రహిస్తున్నాను. ఇక నీకుష్ఠు రోగం సంగతి. నీకు రోగం రాగానే నన్ను ధ్యానించు. నీకు నేను దర్శనమిస్తాను. ఆ తరువాత నీవు ఆ రోగంతో దక్షిణ దిక్కున భీమానది అమరజానదీ సంగమించే గంధర్వపురంలో తీర్థస్నానం చెయ్యి నీ పాపవిముక్తురాలవు అవుతావని** చెప్పారు.



తరువాత శ్రీగురులు ఒకరోజు గోదావరిలో స్నానం చేస్తుండగా నదిలో మునిగి ఆత్మహత్య చేసుకోబోతున్న ఒక బ్రాహ్మణుని చూచి వారించారు. దానికతడు ఏడుస్తూ స్వామి కాళ్ళపైబడి తను వేదపండితుడననీ ఆత్మహత్య పాపమని తెలిసినా కడుపుశూలతో కలిగిన బాధను తట్టుకోలేక ఆ ప్రయత్నం చేశానని తమరు దివ్యపురుషులు గనుక నేను చేసిన పాపమేమిటో వివరించమని.....

సీ॥ పేదలకన్నంబు పెట్టక నిందించి
వెడలగొట్టితినేమొ పెడసరముగ
**అతిథులు అన్నంబు నార్తితో తినుచుండ**
**మట్టి తినుటకు నే పెట్టినానొ**
**తల్లిదండ్రులనునే తరిమేసినానేమొ**
**నమ్మువారల ముంచినానొయేమొ**
**బ్రాహ్మణోత్తములను పంపించినానేమొ**
**అవమాన పరచుచున్ అతిశయమున**

**అ॥ కొత్త దంపతులను కూడక జేస్తినో,**
**తరుణి నింటి నుండి తరిమినానొ,**
**ఏమి పాపమేను ఎరుగక చేస్తినో**
**'కడుపుశూల' ఆయె కంటకంబు**

**చివరికి నదిలోపడి ఆత్మహత్యా ప్రయత్నం చేసి శ్రీగురులైన మీకంటబడ్డాను** అన్నాడు.

**నాయనా! భయపడకు నీకు దివ్యౌషధం** ఇస్తాను అని సాయందేవుని పిలిచి ఆ వ్యక్తికి పెరుగన్నం పెట్టమన్నారు. కడుపు శూలతో బాధపడేవానికి పెరుగన్నం మందా?

కాని సాయందేవుడు ఆయన భార్య శ్రీగురుని పూజించి మృష్టాన్న భోజనం ఏర్పాటు చేశారు. శ్రీగురునితోపాటు కడుపుశూల రోగికూడా స్వామి ఆజ్ఞతో భోజనం చేశాడు. అంతే కడుపు నొప్పి మాయమయింది. అది శ్రీగురునిలీల.



పరమ గురువులు తలచుకుంటే మనబోటి భక్తుల కర్మఫలం తప్పించకపోయినా తగ్గించగలరు. శిక్ష నేడుగాక రేపటికి వాయిదా వేయగలరు. పరిహారమార్గాలు తెలుపగలరు. బాధ సంతోషంగా భరించే శక్తినీయగలరు. భక్తుల బాధ తమకి బదిలీ చేసుకోగలరు. వారు జీవన్ముక్తులు, చిరంజీవులు.

శ్రీనృసింహ సరస్వతి ఆ తరువాత గోదావరి జన్మ స్థలమైన నాసికా త్రయంబకం సందర్శించారు. ఆ దివ్య క్షేత్రంలో స్నానమాచరించి శుచియై ఆ ప్రాంతంలోగల జ్యోతిర్లింగ రూపుడై మహామహిమాన్వితుడైన పరమేశ్వరుని స్తుతించారు.

ఒకానొకప్పుడు గౌతమ మహర్షి తన ఆశ్రమ ప్రాంతంలో వరిపైరు నాటారు. ఏపుగా, పుష్కలంగా పెరిగిన ఆ పైరుని చూచి ఎదిగిన పుత్రుని చూచిన తండ్రి కన్నులు తళ తళ మెరిసినట్లు గౌతమమహర్షి కన్నులు కూడా మెరిశాయి.



ఈర్ష్య మనిషికున్న ఆరు అంతఃశత్రువులలో ఒకటి. బ్రహ్మజ్ఞానులైన మునీశ్వరులు కూడా దానికి లొంగక తప్పలేదు. వశిష్టునిపైన ఈర్ష్యచేత శ్రీరామచంద్రునికే గురువైన విశ్వామిత్రుడు ఎంత తపశ్శక్తి ధారపోసుకున్నాడో జగమెరిగిన సత్యమే. అదేవిధంగా గౌతముని తోటి మునులు ఈర్ష్య చెంది ఒక ఆవును పైరుపైకి వదలి పైరు మేయునట్లు చేశారు. ఆగ్రహోదగ్రుడైన గౌతముడు ఒక బడితె (కఱ్ఱ) తో ఆవుని కొట్టాడు. అది మరణించి మహర్షికి గోహత్యాపాతకం చుట్టుకుంది. మహామునులు కూడా ఈ పాపంలో తమకూ భాగముందని క్షమార్పణ కోరి ఆ పాప పరిహారార్థం శివుని జటాజూటం నుంచి ఆకాశగంగను తెప్పించి ఆ గోహత్య జరిగిన ప్రాంతంపై ప్రవహింప చేస్తె గోమాతకు ఉత్తమలోకాలు దొరికి దానివల్ల గోహత్యా పాపం నుంచి విముక్తి కలుగుతుందని చెప్పారు.

గౌతముడు పరమేశ్వరుని గూర్చి వేయి సంవత్సరాలు ఘోర తపస్సు చేసి శంకరుని దివ్యదర్శనం పొంది గంగను



ప్రసాదించమని కోరాడు. తన జటాజూటం నుండి ఒక సన్నని పాయను విడదీసి ఆకాశ గంగధారను దక్షిణావర్తానికి పంపాడు ఆ దక్షిణామూర్తి. గౌతమమహర్షి చేత ఆవిర్భవింపబడిన గోహత్యాపాతకాన్ని సహితం నివారించగల ఆ దివ్య నదియే గోదావరి. దానినే గౌతమి అంటారు. అటువంటి దివ్య నదిలో స్నానమాచరించారు శ్రీగురులు.

గౌతమీ నదీతీరంలోనే 'మాధవారణ్యుడు' అని పేరుగల ఒక గొప్ప నరసింహస్వామి భక్తుడుండేవాడు. ప్రహ్లాదవరదుడైన నరసింహుని తప్ప మరేదైవమునూ 'ఎన్నడు' తలవడు అతగాడు. ఒకరోజు స్వప్నంలో నరసింహ్వామి నృసింహ సరస్వతిగా అతనికి గోచరించాడు. ఎవరీ గురుమూర్తి? ఎక్కడుంటాడు? ఓ నరసింహదేవా! నేనా మునీశ్వరునెలా చూడగలను అని వేడుకున్నాడతను. సారూప్యముగా శ్రీగురులు అతని ముందు నిలిచారు. దివ్య జ్ఞానబోధ పొందిన మాధవారణ్యుడు ధన్యాత్ముడై మోక్షం పొందాడు.

ఇంతకు ముందు సాయందేవుడనే శ్రీగురుని ప్రస్తావన వచ్చింది. ఇప్పుడా సాయందేవుని గాథను విందాము. శ్రీనృసింహ సరస్వతిని సాయందేవుడు తన గురుదేవుడు అని నమ్మాడు. అతను ఒక తురుష్కరాజు కొలువులో పనిచేసేవాడు.

**చం॥ పనివడి ఆ తురుష్కపతి పంతము బూనుచు వత్సరంబునన్**
**తన పరివారమందుగల దాస్యుల అన్యమతస్తులన్ పగన్**
**తునుమును ఒక్కనొక్కనిగ, ధూర్తుని ఆపనశక్తులై జనుల్**
**విను తమదైవమెవ్వడని వేదన జెందిరి దిక్కు తెల్వకన్**

పడుతుందేమో అని భయపడ్డ పిడుగు పడనే బడ్డట్లు కొత్వాలు రేపు నీవంతు, సిద్ధంగా ఉండు అని



సాయందేవునికి కబురుపంపాడు. భయంతో గజగజా వణికిపోయాడు సాయందేవుడు. ఆర్తితో నృసింహ సరస్వతి స్వామిని తలుచుకున్నాడు.

సాకారంగా వానిముందు నిలిచి అభయ ప్రదానం చేశారు శ్రీగురుడు. నీవు ఆ రాజుదగ్గరకుపో. భయంలేదు, నేనున్నానని చెప్పారు. సింహం గుహలో దూరే లేడిపిల్లలా రాజుగారి దగ్గరకు వెళ్ళాడు. అప్పటికే నిప్పులు చెరుగుతున్నాడు ఆ యవనరాజు. అయితే ఇంతలో అతనిని మైకం కమ్మి పడిపోయాడు. అతనికి ఒక భయంకరమైన స్వప్నానుభవం కలిగింది.

ఆ కలలో అతని శత్రురాజు అతనిని బంధించి ఒక అంపముతో అతని తలను పరపరా కోస్తున్నట్లు భయంకరమైన బాధతో తను అరుస్తూ ఏడుస్తున్నట్లు కనిపించింది. విచిత్రమేమంటే తననలా నరుకుతున్న వ్యక్తి వేరెవరో కాదు తన సింహాసనంపై కూర్చుని ఆజ్ఞలిస్తున్న సాయందేవుడే. భయంతో గజగజలాడుతూ కళ్ళు



తెరిచాడతను. ఎదురుగా వినమ్ర గంభీరుడై నిలుచున్న సాయందేవుడు కనబడ్డాడు.

తనని మన్నించమని కోరి, సాష్టాంగదండ ప్రమాణం చేసి అర్ఘ్య పాద్యాలతో పూజించి నూతన వస్త్ర, సువర్ణాభరణాలతో సత్కరించాడు ఆ తురుష్కప్రభువు. ఆ తరువాత సాయందేవుడు శ్రీగురుని దర్శించి జరిగింది వివరించి వారి శరణాగత వత్సలతను ఎంతో కొనియాడాడు.

శ్రీగురులు అతనితో **"నాయనా! మేము తీర్థయాత్రలకు పోయి మరొక్క పదియారు సంవత్సరాలకు ఇక్కడికే వస్తాము. అప్పటిదాకా నీవు నీకుటుంబ సభ్యులతో సంసార జీవిత మకరందాన్ని అనుభవించు. మేము తిరిగి వచ్చేదాకా మమ్ము పూజిస్తూ ఉండు. మనం తిరిగి కలుసుకున్నాక నీవలన కావలసిన ఒక ఘన కార్యముంది. నీకు శుభం జరుగుతుంది** అని ఆశీర్వదించారు.

శ్రీనరసింహ సరస్వతి గృహస్థులకు గృహస్థ



ధర్మములు, సన్యాసులకు సన్యాస దీక్షా ధర్మములు చక్కగా బోధించేవారు. తీర్థయాత్రలు చేయుచున్న సమయంలో ఒక శిష్యుడు తీర్థయాత్రలు చేయుటవలన ఉపయోగ మేమని అడిగాడు. దానికి శ్రీగురులు సమాధానమిస్తూ **నాయనా! తీర్థయాత్రలు చేసినవారికి యజ్ఞఫలము దక్కుతుంది. కలియుగంలో అతి తక్కువ కష్టంతో అత్యధిక ఫలితం దక్కే మార్గం తీర్థయాత్రలు చేయుట మాత్రమే. కలియుగంలో జరిగే ఎన్నో దుష్ప్రభావాలను తుదముట్టించే శక్తి తీర్థయాత్రలకున్నది. కామితములను తీర్చగల శక్తి తీర్థయాత్రలకుంది. కలియుగంలో జనుల కోరికలకి అంతు ఉండదు.**

**పూర్వం దుర్మార్గులైన రాజులను ఇరువదిన్నొక మార్లు భూమండలాన్ని వెతికి సంహరించాడు పరశురాముడు. తన తండ్రి జమదగ్ని ఆజ్ఞ శిరసావహించి, క్షణకాలం గంధర్వ దంపతుల శృంగారం చూసి చలించిన భార్యపై కోపించి ఆమెను వధించమన్న తండ్రికి ఎదురుమాట చెప్పక తల్లి తల తన ఆయుధం పరశువుతో** ఖండించాడతడు. తన

ఆజ్ఞ శిరసావహించినందుకు ఏంవరం కావాలో కోరుకోమంటే

ఆ॥ సాధువైన నాదు జననిని మన్నించి
మరల బ్రతుకునట్లు వరమునిమ్ము
మాతృహత్యవలన పాపంబునంటక
జేయుమయ్యతండ్రి! శీఘ్రగతిని.

పుత్రుని మాతృప్రేమకు సంతసించి జమదగ్ని రేణుకను మరల బ్రతికించాడు.

అటువంటి జమదగ్నిని కార్తవీర్యార్జునుడు సంహరించినప్పుడు, పుత్రుడు పరశురాముడు రేణుకను తల్లిరోదిస్తున్న కారణం అడిగితే, ఆమె ఇరవైన్నొక్కమార్లు తన రొమ్ము బాదుకుంటూ కుమారా నేనన్యాయమైపోయానని ఏడ్చింది. అందుకనే భార్గవరాముడు తానే పరశురాముడై రాజుల్ని సంహరించాడు. ఇరవైన్నొక్కసార్లు మారణహోమం చేశాడు. అట్లా జయించిన భూమండలంలోని రాజ్యాలను



బ్రాహ్మణులకు దానం చేశాడు. చివరికేం జరిగిందో తెలుసా? తమకు దానం దక్కని బ్రాహ్మణులు ఆయనను వేదించనారంభించారు.

మేమూ బ్రాహ్మణులమే మాకెందుకు దానం ఇవ్వరు? ఏమిటీ ఆశ్రిత పక్షపాతం? ఏమిటీ అన్యాయం అని ఆయనను వేదించారు. శ్రీమన్నారాయణుని అవతారమైన ఆ భార్గవరాముడే సాగరగర్భంలో మునిగిపోయి ఎవ్వరికంటికీ కనిపించకుండా పోయాడు. సర్వశక్తిమంతుడైన ఆయనే అందరి కోరికలూ తీర్చలేకపోయాడు. పూర్వజన్మ కర్మవలన సుఖ దుఃఖాలు కలుగుతాయి. అంతేకాదు మానవులకు భక్తి వైరాగ్యాలు కూడా గతజన్మ సుకృతంవల్లనే కలుగుతాయి. అటువంటి వారికే దివ్య పురుషుల వరాలు లభిస్తాయి.

తీర్థయాత్రలు చేసినవారికి ఆ దివ్యక్షేత్ర దర్శన ఫలితంగా మంచి జన్మ లభించి భక్తి వైరాగ్యాలు కలిగి ముక్తి పొందే భాగ్యం కలుగుతుంది.



నాయనలారా! నేను 'వైద్యనాథ్'లో అంతర్ముఖుడనై గోప్యంగా ఉంటాను. మీరు తీర్థయాత్ర కొనసాగించండి. మీరు చివరికి శ్రీశైల క్షేత్రం దర్శిస్తున్నప్పుడు నేను మీకు ప్రత్యక్షమవుతాను. గంగ, యమున, నర్మద, గోదావరి, కృష్ణవంటి నదులలో స్నానం చేసి మీరు పునీతులవుతారు. ఆ విధంగా శిష్యులు తీర్థయాత్రలకు వెళ్ళగా శ్రీగురులు వైద్యనాథ్‌లో కొంతకాలమున్నారు.

శ్రీగురులు వైద్యనాథ్‌లో వుండగా తన గురువుపై ఆగ్రహించి రుసరుస వెడలిపోతున్న ఒక కుర్రవానిని చూచి ఆతని కోపానికి కారణమేమని అడిగారు. ఏం చెప్పమంటారు స్వామీ! నా గురువు ఒక విచిత్రవ్యక్తి. ఆయనకి తోచదు చెబితే వినడు. నేనిక ఆయన శిష్యరికం చేయలేను అన్నాడు. నవ్వుతూ శ్రీగురువిలా అన్నారు.

కం॥ గురువుల భావము తెలియక
గురునిందలు చేయరాదు క్రోధముతోడన్
గురుభక్తిలేని వానికి
'గురుతరమగు' విద్యరాదు కుశలము కలుగన్.



నాయనా! కారణం ఏదయినా గురునాజ్ఞను ధిక్కరించ తగదు. ఒక్కొక్కప్పుడు గురువులు నిన్ను పరీక్షించుటకే అర్థంలేని ఆదేశాలిస్తుంటారు. వారినర్థం చేసుకోవటం కష్టం. అచంచలమైన విశ్వాసం కలవారికే గురుకృప కలుగుతుంది.

పూర్వం దౌమ్యమహర్షి వద్ద విద్యనేర్వడానికి ముగ్గురు శిష్యులు చేరారు. అరణ్యుడు, వైద్యుడు, ఉపమన్యుడను ఆ ముగ్గురూ తమ గురువుని భక్తి శ్రద్ధలతో కొలుస్తూ విద్యనేరుస్తున్నారు. విద్యాభ్యాసం పూర్తి కావచ్చింది. వారిలో ఒకనికి బ్రహ్మజ్ఞానం బోధించాలని సంకల్పించాడు దౌమ్యుడు.

అరణ్యుని పిలిచి 'నాయనా! మన పొలం ఏపుగా పెరిగింది. దానిపక్కనే ఉన్న చెరువు నిండిపోయి ఊటుగా వున్నది. ఈరోజు పొలానికి కావలి ఉండు' అని అడిగాడు. కావలి ఉన్నాడు అరణ్యుడు. అర్ధరాత్రి చెరువుకి గండిపడి నీళ్ళు పొలంలోకి రాబోతున్నాయి. సమయంలేదు.

రాత్రివేళ సహాయం దొరికేలోపే వచ్చేనష్టం ముంచుతుంది. ఇంకేమీ ఆలోచించక ఆ గండికి అడ్డంగా పడుకున్నాడు. చలికి గడగడా వణుకుతూ రాత్రంతా గురునామ స్మరణతో గడిపి నీరసించినా తన పట్టువదలలేదు. దౌమ్యుడు ఆనందించి చేయవలసిన పనులు చేసి గండి పూడ్పించాడు.

వేరొక రోజు దౌమ్య మహర్షి తన రెండవ శిష్యుడైన వైద్యుని పిలిచి 'నాయనా పొలం విస్తారంగా పండింది. ఈ పంటను కోసి, కళ్ళంలో నూర్పించి ధాన్యం ఇంటికి చేర్చు అన్నాడు (చేర్పించు అనలేదు). గురువు మాట శిరోధార్యంగా వైద్యుడు స్వయంగా పంటకోసి, నూర్చి బస్తాల్లోకి ఎత్తాడు. ధాన్యం గురువుగారింటికి తీసుకువెళ్ళటానికి బండి దొరికింది కానీ దాన్నిలాగే ఎద్దుగానీ దున్నపోతుగాని లభ్యంకాలేదు. అచంచల గురుభక్తిగల వైద్యుడు ఆ బండికి తనే దాని 'కాడి' మెడకు కట్టుకుని ఇంటికి తీసుకువచ్చాడు. శిష్యుని ఓర్పు చూచిన దౌమ్యుడు పరమానంద భరితుడైనాడు.



ఇక ఆఖరివాడు చిన్నవాడవటం వల్ల గురువు వాడికి ఆవులను కాచే పని ఒప్పగించాడు. ఇంటికి వచ్చే సమయం లేక భిక్షాటనతో జీవించాడు ఉపమన్యుడు. వానిని చూచి గురువు ఆ భిక్ష తన ఆవులను కాస్తున్న సమయంలో లభించింది గనుక తనకే చెందాలని అన్నాడు. ఆ విధంగా భిక్షకూడా గురువుకే సమర్పించి, దూడత్రాగి వదిలేసిన గుక్కెడు ఆవుపాలు తాగి జీవించ సాగాడు ఉపమన్యుడు. గురుడు ఇంకొక పేచీ పెట్టాడు. దూడకు చెందాల్సిన పాలు తాగరాదని నిషేధించాడు గురువు.

ఆకలికి తాళలేక జిల్లేడు పాలు త్రాగుదామని ప్రయత్నించి కళ్ళు పోగొట్టుకొని ఆవుని ఇంటికి చేర్చే ప్రయత్నంలో ముళ్ళకంప ఉన్నగోతిలో పడిపోయి గురుదేవా! నన్ను మన్నించండి మీపని సక్రమంగా చేయలేకపోయాను అని రోదించాడు.



**చం॥ కరిగిన గుండెతో కనులు కారెను ధారగ ధౌమ్య**
**మౌనికిన్**
**పెరిగెను ప్రీతి ఆ వెనుక పిల్చెను అశ్విని దేవ**
**వైద్యులన్**
**వరముగ కోరి, శిష్యునకు ప్రాప్తిల జేసెను అక్షి**
**యుగ్మమున్**
**విరివిగ శిష్యునిన్ పొగడి ప్రేమగ వానిని**
**కౌగలించెతాన్.**

**అదీ గురువుపై శిష్యుడు చూపవలసిన గౌరవం నమ్మకం. అట్టివారికే గురుకృప కలుగుతుంది.**

శ్రీగురుల మాటలు విని తనెంత అల్పుడో తెలుసుకుని తనకు మరణమే శరణమని విలపించాడు ఆ కుర్రవాడు. శ్రీగురులు అతనినోదార్చి జ్ఞానోదయం కలిగించి అతనిని తిరిగి ఆతని గురువువద్దకే పంపివేశారు.

శ్రీనృసింహ సరస్వతి వైద్యనాథ్ సమీపంలో వున్న 'భిల్లవీడు' అనే గ్రామం సందర్శించారు. అక్కడ భువనేశ్వరి



మాత ఆలయాన్ని దర్శించి అమ్మవారిని భక్తితో అర్చించారు. శ్రీగురులు ఆ సమీపంలోనే గల ఒక మేడివృక్షం క్రింద 108 దినములు గడిపారు. తనను సందర్శించటానికి వచ్చే అసంఖ్యాక భక్తులకు ఆశీస్సులనందచేసేవారు. ఎందరికో వేదన తొలగించి రక్షించారు. అటువంటి అదృష్టవంతులలో కరవీరపురానికి చెందిన అనాథ బాలుడొకడున్నాడు.

పుట్టుకతోనే తల్లిదండ్రులను పోగొట్టుకున్న ఆ పిల్లవాడి తండ్రి గొప్ప వేదపండితుడు. ఆ పండితునికి తెలిసిన పెద్ద మనుష్యులు ఆ చిన్నారికి సహాయం చేయకబోగా తండ్రి కడుపున చెడబుట్టాడని నిందించారు. క్రూరమైన ఈ స్వార్థ ప్రపంచంలో బ్రతక లేక చనిపోదామని నిశ్చయించుకుని కడసారి భువనేశ్వరీ దేవిని దర్శించుకుందామని అమ్మవారి ఆలయం చేరాడు. ఆ చచ్చేదేదో అమ్మవారి పాదాలవద్ద చనిపోతే నయమని ఉపవాస దీక్షలో అమ్మ పాదాలదగ్గరే గడిపాడు. ఆ గుడి పూజారి కొందరు భక్తులకు చెప్పిన కవికాళిదాసు కథ

గుర్తుకు వచ్చింది.

అవును, తనూ అమ్మవారిని మెప్పించి విద్యావంతుడవ్వాలి. నీరు త్రాగటం కూడ మానివేశాడు. శవంలా తయారయ్యాడు కానీ భువనేశ్వరి దయరాలేదు. ఇక విసిగిపోయి 'అమ్మా నీవు బీజాక్షరాలు వ్రాసి నాకు విద్యనివ్వలేదు. ఇక నాకీ నాలుకెందుకని అమ్మవారి దగ్గర ఉన్న కత్తితో తన నాలుకను కోసి వేసుకుని అమ్మపాదాలవద్ద ఉంచాడు. అయినా లాభంలేదు.

చివరికి తన తలనే నరికివేసుకోబోయి నీరసించి పడిపోయాడు. ఆ బాలునికి అప్పుడు స్వప్న సాక్షాత్కారం అయింది. అమ్మవారు అతనితో **నాయనా పెన్నిధిలాంటి ఒక గురుమూర్తి కృష్ణానది అద్దరిన ఒక మేడి వృక్షంక్రింద ఉన్నారు. వెళ్ళి ఆయన శరణుపొందు** అని చెప్పింది.

ఉలిక్కిపడి నిద్రనుంచి లేచిన ఆ కుర్రవాడు ఉత్సాహం పుంజుకుని నదినిదాటి, వెతికి, మేడివృక్షంక్రింద శ్రీగురుని దర్శించి ఆయన కాళ్ళపై బడి కన్నీటితో ఆయన కాళ్ళు కడిగాడు. శ్రీగురుని హృదయం కరిగిపోయింది.



**ఆ॥ కరుణతోటి వాని కనికరించిరి పూని**
**శ్రీగురుండు వానిచెంతజేరి**
**నాల్క తిరిగి అతికి నయమొసంగుటె గాక**
**జ్ఞాని జేసినారు చదువునిచ్చి**

ఆ తరువాత నృసింహ సరస్వతి 'నరసింహ వాడి' అనే క్షేత్రానికి వెళ్ళి అక్కడ పన్నెండు సంవత్సరాలు నివసించారు. అది పంచ నదుల సంగమ క్షేత్రం. భద్ర, శివ, కుంభ, భోగవతి, సరస్వతి అనే అయిదు నదులు కలుస్తాయి. కృష్ణానదిలో అదే అమరాపురం. అక్కడ అమరేశ్వర స్వామి 64 మంది యోగినులతో వెలసి భక్తజన సంరక్షణ చేస్తున్నారు.

అక్కడనుండి శ్రీగురువు ప్రతిదినం భిక్షాటనకు అమరపురం వెళ్ళేవారు. అక్కడ దుర్భర దారిద్ర్యం అనుభవిస్తున్న బ్రాహ్మణ దంపతుల జంట ఒకటుంది.



వారి దారిద్ర్యానికి తోడు వారికి ఇద్దరు బిడ్డలున్నారు. భిక్ష దొరకనప్పుడు ఆ పేద బ్రాహ్మణులు అక్కడ వున్న తుమ్మచెట్టు కాయలే ఆహారంగా తినేవారు.

వారిని పరీక్షించటానికి శ్రీగురులు వారింటి ముందు నిలిచి **'భవతి భిక్షాందేహి'** అన్నారు. అతిథిని సాదరంగా లోనికి ఆహ్వానించారు ఆ దంపతులు. అది భోజన వేళ. తమకోసం పెట్టుకున్న ఆ తుమ్మకాయల్నే శ్రీగురునికి భక్తితో సమర్పించారు వారు. వాటినే ఆప్యాయంగా తిని **'ఇష్టకామ్యార్థ సిద్ధిరస్తు'** అని ఆశీర్వదించి వెళ్ళిపోయారు శ్రీగురులు. వెళ్ళిపోతూ ఈ తమ్మిచెట్టే మీ దారిద్ర్యం తీరుస్తుంది అంటూ దాన్ని ఒక్క గుంజుతో నేలమట్టం చేసి మరీవెళ్ళారాయన. ఆ గుంజుడుకు...

**కం॥ ఫెళఫెళ విరిగిన తరువును**
**కళవళ పడి చింతనొంది గాంచెను సతియున్**
**కళలేని మోము గలదై**
**భళి! ఆ 'దారిద్ర్యలక్షి' పగబూనెనొకో!**



అయ్యో ఉన్న ఒక్కజీవనాధారం పోయిందే అతిది దేవుడనుకుంటే ఆ దేవుడు నోటివద్ద తిండిలాగేశాడే అని విచారిస్తూ, సరే చెట్టుని మళ్ళీ పాతుదామని మట్టిని పెళ్ళగించారు. వారి కళ్ళు నమ్మలేనట్లు మూత బిగించి ఉన్న ఒక పాత్ర కనిపించింది ఆ గోతిలో. ఆ పాత్ర మూత తీసి చూస్తే తళతళ మెరుస్తున్న బంగారు కణికలు కనిపించాయి. అది శ్రీగురువు అందించిన లక్ష్మీకటాక్షం అని నమ్మి వేలవందనాలు చేసి శ్రీగురుని ప్రత్యేకంగా కలిసి ధన్యులయ్యారు.

శ్రీగురులు మేడివృక్షఛాయ తన నివాసంగా చేసి కొనుటకు ఇంకొక కారణమున్నది. తొల్లి హిరణ్యకశిపుని నరసింహస్వామి పొట్ట చీల్చి సంహరించి ప్రహ్లాదుని కాపాడినపుడు ఆ రాక్షసునికి గల బ్రహ్మవరం చేత ఒక చిక్కువచ్చింది. రాక్షసుని రక్తం ఒకబొట్టుకూడా నేల చిమ్మరాదు గనుక ఆ రక్తం గోళ్ళలోనే ఇరుక్కుపోయి ఆ స్వామికి విపరీతమైన బాధ కలిగించింది. అప్పుడు లక్ష్మీదేవి తన సమీపాన గల మేడిచెట్టులోని మేడిపండ్ల

రసాన్ని స్వామి గోళ్ళకు పూసి బాధకు ఉపశమనం కలిగించింది. అప్పుడు స్వామి అది తనకు చేసిన ఉపకారానికి మెచ్చి దానికి విష బాధా నివారణా గుణమును ప్రసాదించి దానికి పాపపరిహార లక్షణం కూడా ప్రసాదించారు. అట్టి విశిష్టగుణోపేతమైన మేడివృక్ష ఛాయలో శ్రీగురులు కూర్చునేవారు.

అమరాపురంలోని 64 మంది యోగినులు ప్రతిరోజూ శ్రీగురుని దినచర్య గమనించమని ఒక బ్రాహ్మణుని నియోగించారు. కాని అంతమంది యోగినులను చూచి భయపడి ఆ బాపడు పారిపోయాడు.

అయితే ఒకరోజు ఒక రజకుడు ఆ మేడివృక్షం దగ్గర ఉన్న నదిరెండుగా చీలి దారి ఇస్తె, ఆదారిగుండా 64మంది యోగినులు నదిదాటి సరిగ్గా మిట్టమధ్యాహ్నం వేళ శ్రీగురుని వెంటబెట్టుకుని తమతో తీసుకుని వెళ్ళటం కళ్ళారా చూశాడు. ఇంకా ఏమవుతుందో చూడాలని వాడు దాగియున్నాడు. వాడిని గమనించిన శ్రీగురుడు చిరునవ్వు నవ్వారు. వాడు భయపడి స్వామి కాళ్ళపైపడి తనని



క్షమించమని కోరాడు. స్వామి వాడిని క్షమించి సకలైశ్వర్యములు కలగాలని వానినాశీర్వదించారు. అప్పటినుండి వాడు నిత్యమూ తన భార్యతోపాటు స్వామిని పూజించేవాడు. శ్రీగురుడంటే వాడికి విపరీతమైన భక్తియేకాక చనువుకూడా ఏర్పడింది. స్వామి తనను 64 మంది యోగినుల గూర్చి ఎవ్వరికీ చెప్పరాదని అది దేవరహస్యమని చెప్పడంవల్ల వాడు మరింత జాగ్రత్తగా ఉండేవాడు.

**వాడొకరోజున 'స్వామీ! తమరు కాశీక్షేత్రం దర్శించారా** అని అడిగాడు". స్వామి **"అవునురా నేను కాశీవిశ్వనాధుని ఎన్నోసార్లు దర్శించాను. నాతో వస్తావా నీకూ దర్శనం చేయిస్తాను"** అన్నారు. **"ఎట్లా స్వామీ నేను రజకుణ్ణి"** అన్నాడు వాడు. శ్రీగురుడు మందహాసం చేస్తూ ఇలా అన్నారు.



**చం॥ శివుడు జగాలకన్నిటికి శ్రేయము గూర్చెడి**
**శంకరుండు, మా**
**ధవుని ప్రియుండు, పార్వతికి తాను యొసంగెను**
**అర్ధ దేహమున్**
**సవినయ భక్తి తత్పరుల జాతి మతంబుల**
**అడ్డురాదు, ఆ**
**భవుని, త్రిశూలి జూచుటకు వచ్చిన తోడ్కొని**
**పోదు కాశికిన్.**

ఆమాట అంటూనే వాణ్ణి తనని గట్టిగా పట్టుకొని కళ్ళుగట్టిగా మూసుకోమన్నారు. అట్లా చేసిన వాడికి తను ఎగిరిపోతున్నట్లనిపించింది. కళ్ళు తెరిచే సరికి కాశీ నగరంలో వున్నారు. విశ్వనాధుని దర్శనం చేయించి వాడిని తిరిగి గాణ్గాపురం చేర్చారు. తమయాత్రకి గుర్తుగా గాణ్గాపురంలో కాశీ అన్నపూర్ణా మాతను ప్రతిష్టించి ఆ ప్రాంతాల్లో దుర్భిక్షమన్నది లేకుండా చేశారు.



అయితే శ్రీగురుని ఆజ్ఞప్రకారం స్వామి అక్కడ ఉన్నంతవరకూ రజకుడు ఆ విషయం గోప్యంగా ఉంచాల్సి వచ్చింది. ఆ తరువాత ఆసంగతి తెలిసి ఆ ప్రాంతాల్లోని శ్రీగురు భక్తులు తాము స్వామికి సన్నిహితులమనుకునే వారు తెగబాధ పడిపోయారు. అందుకే మనపెద్దలు **"చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా!"** అన్నారు.

"శిరోలా" అనే గ్రామంలో గంగాధరుడు, శాంతాదేవి అనే బ్రాహ్మణ దంపతులుండేవారు. సద్వర్తనులు, దైవభక్తిగల ఆ దంపతులకు ఐదుగురు కుమారులు జన్మించినా ఒక్కడూ బ్రతికి బట్టకట్టలేదు. ఎంతమంది దేవతల నారాధించినా ఫలితం సున్నా అయింది. రోజులు గడుస్తున్న కొద్దీ వారిలో ధైర్యం సన్నగిల్లింది. కాని ఈశ్వర శరణాగతిని మాత్రం వారు వదలలేదు.

ఒకరోజు గంగాధరుని కలలో ఒక దివ్య పురుషుడు సాక్షాత్కరించి **"నాయనా! నీవు నీపూర్వజన్మలో ఒక పేద బ్రాహ్మణుని ధనం కాజేసి వాని ఆత్మహత్యకు కారణమయ్యావు. వాడు బ్రహ్మ రాక్షసుడై నీబిడ్డల**

**ఆయువునర్థాంతరంగా తుదముట్టిస్తున్నాడు. నీవు ప్రస్తుతం 'నర్సాచాడీ' లో మేడిచెట్టు క్రింద కూర్చుని భక్తులను కాపాడుతున్న శ్రీగురుడనే యోగి శరణు పొందు"** అని చెప్పాడు.

ఆ ప్రకారమే అమితభక్తి శ్రద్ధలతో ఆ దంపతులు శ్రీగురుని పాదుకలను నిత్యమూ పూజించేవారు. ఆయన ఆ బ్రహ్మరాక్షసుని గద్దించి **నీకు సద్గతులు లభించేట్లు ఆ దంపతుల చేత చేయిస్తాను. వారు పశ్చాత్తాప పడేలా చేస్తాను. నీవు వారిపై ఆగ్రహం వదిలిపెట్టు** అన్నారు. ఆతడంగీకరించినమీద శ్రీగురులు ఆ దంపతులకీ విషయం తెలిపి తామే కొడుకూ కోడలై శాస్త్ర విహితంగా ఆ బ్రహ్మరాక్షసునికి ఉత్తరక్రియలు చేసి సద్గతులిప్పించారు. ఆ విధంగా శ్రీగురుని కృపవల్ల వారి సమస్య తీరిన మీద శ్రీగురులు శాంతాదేవి స్వప్నంలో కనిపించి ఆమెకు రెండు పండ్లు ఇచ్చి, **ఇవి తిను నీకు ఇద్దరు పుత్రులు పుడతారు** అని ఆశీర్వదించారు. ఆవిధంగా ఆమె ఇద్దరు పిల్లల తల్లి అయింది.



పెద్దకుమారునికి ఉపనయనం వైభవంగా చేశారు. కాని ఒకరోజు రాత్రి ఆపిల్లవాడు హఠాత్తుగా మరణించాడు. వారు **అయ్యో! అవతారపురుషులు శ్రీగురులిచ్చిన బిడ్డకీ అకాల మృత్యువేమిటి? ఇక మాకు దిక్కెవరు?** అని కన్నీరు మున్నీరుగా రోదించారు. ఆ సమయంలో ఒక బ్రహ్మచారి అక్కడకు వచ్చి వారినోదార్చి తత్త్వోపదేశం చేశాడు. దానికి శాంతాదేవి **నాయనా! శ్రీగురు వరప్రసాదికే ఇలా జరిగితే ఇక శిశువుల ప్రాణాలకి రక్ష ఎవరు? ఆ శ్రీగురులే నాతప్పు ఏమిటో చెప్పాలి. అందాకా నేను ఈ బిడ్డ శవాన్ని ఇలాగే ఉంచుతాను. ఆమరణ నిరాహారదీక్ష చేస్తాను** అని పట్టు పట్టింది.

చీకటి పడుతోంది. ఇక జాగుచేయకండి అని తోటి బ్రాహ్మణులు నచ్చజెప్పినా ఆమె ససేమిరా అన్నది. ఇకవారు విసిగిపోయి మీ కర్మకు మీరు చావండి అని తిట్టి వెడలిపోయారు. ఆ దంపతులు ఆబాలుని శవాన్ని శ్రీగురు పాదుకల వద్ద ఉంచి శ్రీగురుని ధ్యానిస్తూనే



ఉన్నారు. చీకటి పడింది. దూరంగా నక్కలకూతలు వినపడుతున్నాయి.

**కం।। ఇకపై జరుగునదేమో**
**సకలము ఊహించి 'శాంత' చచ్చెదనంచున్**
**చకచక గురుపాదాలకు**
**వికటమ్ముగ తలను బాది విడె స్పృహనంతన్**

అప్పుడామెకు ఒక స్వప్న సాక్షాత్కారమయింది. ఒంటినిండ విభూతి రేఖలతో జటాజూటధారియైన ఒక దివ్యపురుషుడామెకు కనిపించి **"రోదించకు నీబిడ్డ బ్రతుకుతాడు"** అని చెప్పి అదృశ్యమయ్యాడు. మేల్కొనిన ఆమెకు సజీవుడైన తన బిడ్డ కనిపించాడు. ఆ దంపతులు ఆనందంతో వానిని కౌగలించి ముద్దాడి అప్పటికప్పుడు నదిలో స్నానమాచరించి శ్రీగురుని పాదుకలకు సాష్టాంగ నమస్కారంచేసి కీర్తించారు.



ఊరిలోని వారందరూ ఆ వింత సంఘటనకు అబ్బురపడి శ్రీగురుని మహా మహిమాన్వితుడని వేనోళ్ళ పొగిడారు.

వట్టిపోయిన గేదె కథ వింటే శ్రీగురుల మహాత్మ్యం ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. గాణుగాపురం దగ్గర ఉన్న భీమ, అమరజా నదుల సంగమంలో శ్రీగురులు నిత్యం స్నానం చేస్తుండేవారు. ఆ ఊరిలో ఒక పేద బ్రాహ్మణుడుండేవాడు. అతని భార్య అతనికి తగిన ఇల్లాలు. వినయ సౌశీల్యములు గల ఆమెతో అతను గృహస్థ ధర్మం పాటిస్తూ, ఉన్నంతలో తృప్తిగా జీవించేవాడు. వారి ఆస్థి అంటూ ఉన్నది ఒక గేదె మాత్రమే. అదికూడా వట్టిపోయింది. ఎన్నడూ చుక్కపాలు అదివ్వగా ఎవరూ చూడలేదు. ఆ గృహస్థు దానిని అద్దెకిచ్చి ఆ ఆదాయంతో చాలీ చాలని తిండి తినేవాడు. చివరికి అతనికి భిక్షాటనయే గతి అయ్యింది. అన్ని కష్టాలు అనుభవిస్తూ కూడ అతను భగవంతునిపై విశ్వాసం కోల్పోలేదు. విచిత్రంగా ఆతనికి ఒకరోజు గుప్పెడు భిక్షకూడ లభించలేదు. ఆరోజు గేదెను

ఎవ్వరూ అద్దెకు తీసుకెళ్ళలేదు. అతను ఇంటికి వెళ్ళుటకు కూడా మనస్కరించక ఒకచెట్టుక్రింద కూర్చుని చింతిస్తున్నాడు.

అదే సమయంలో శ్రీగురులు ఆ ఇంటికి వెళ్ళి **'భవతి భిక్షాందేహి!'** అన్నారు. ఇంటి ఇల్లాలు కళవళ పడింది. అతిథిని వట్టి చేత్తో ఎలా పంపడం? చివరికి ఎలాగో ధైర్యంచేసి **'స్వామీ! వారు ఇంకా ఇంటికి రాలేదు కాసేపు దయచేసి తాళండి"** అన్నది. ఎంతసేపైనా గృహస్థు రాలేదు.

**"అమ్మా! నాకు ఆకలి అధికంగా ఉన్నది వేగిరమే తినటానికి ఏదన్నాపెట్టు"** అన్నారు. **"ప్రస్తుతం ఇంట్లో మీ ఆకలి తీర్చేదేదీలేదు స్వామీ!"** అన్నదామె దాదాపుగా ఏడుస్తూ. **'అదేమిటి ఆ గేదె ఉందిగా కాసిని పాలు తీసి ఇవ్వు తల్లీ'** అన్నారు శ్రీగురులు. **'అది వట్టిది స్వామీ!'** అందామె. **"సరే విచారించకు. ఒక కుండ తీసుకుని దాని దగ్గరకు వెళ్ళి శ్రీగురులు చెపుతున్నారు ఇకనుంచీ పాలివ్వాలి" అని చెప్పు** అన్నారు. అలాగే చేసిందామె.



అప్పుడు కనీవినీ ఎరుగని ఒక అద్భుతం జరిగింది. పుట్టినదాదిగా చుక్కపాలివ్వని ఆ గేదె ఆ కుండెడి పాలు ఇచ్చింది. ఆమె సంభ్రమాశ్చర్యాలతో ఆయనకి పాలు వేడిచేసి ఇచ్చి కాళ్ళపై పడి **'స్వామీ! మాకు బ్రతుకునిచ్చారు'** అంది. ఇంటికి వచ్చిన బ్రాహ్మణుడు సంగతి తెలిసి శ్రీపాదులకు మనస్సులోనే శతకోటి వందనాలర్పించాడు.

మరునాడు ఆ గ్రామాధికారి అవసరమొచ్చి గేదెకోసం కబురుపెడితే, ఆమె తమ గేదె చక్కగా కుండెడు పాలిస్తోందని ఇక దానికి బరువులు మోసే అగత్యం లేదని చెప్పింది. సంగతి విని ఆ ఊరి పెద్దలంతా వచ్చి పాలిస్తున్న గేదెను చూచి ఆ అద్భుతాన్ని సుసాధ్యం చేసిన శ్రీగురుని మహిమను కొనియాడారు.

ఆయన నివాసం మేడి వృక్షం క్రింద అని తెలిసి పరుగు పరుగున ఆయన దగ్గరకు వెళ్ళి సాష్టాంగ వందనం చేసి తమ గాణ్‌గాపురంలో ఆయనకు చక్కటి ఆశ్రమం కట్టిస్తామని ఆ ఊరిలోనే ఉండి తమబోటి భక్తులను కాపాడమని ప్రార్థించారు.



ఆయన తన అంగీకారం తెలిపాక సర్వలాంఛనాలతో వారిని తీసుకువెళ్ళి చక్కని మఠాన్ని నిర్మించి స్వామికర్పించారు. ఎంతో ప్రసిద్ధిచెందిన శ్రీగురుని మఠం తమ గాణ్‌గాపురములో ఉండడం తమ అదృష్టమని భావిస్తారు ఆ ఊరి ప్రజలు. మఠం నుంచి ప్రతిదినం స్వామిని పల్లకిలో సంగమానికి తీసుకువెళ్ళి స్నానానంతరం తిరిగి మఠానికి తెస్తారు ఆ ప్రజలు.

**కం॥ నడయాడు దైవ మీయన**
**అడిగిన వరమీయు 'వేల్పు' అని శ్రీగురునిన్**
**అడుగులకు మడుగులొత్తుచు**
**గుడి కట్టిరి గుండియలలొ కొల్చుచు ప్రజలున్.**

ఆ విధంగా శ్రీగురులు గాణ్‌గాపురంలో స్థిరనివాసి అయి ఆ ఊరి ప్రజలకే కాక ఆ ప్రాంతంలో వారికి శ్రీనృసింహ సరస్వతి అనే దైవం అయ్యారు.



'కుమసి' అనే గ్రామంలో గురువు ద్వారా నేర్చిన మూడు వేదాలలోనూ ఉద్దండపండితుడైన బ్రాహ్మణుడు గాణ్‌గాపురం దగ్గర ఉండేవాడు. ఆయన శ్రీనరసింహ స్వామి భక్తుడు. స్వామి ఆయనతో మాటాడతాడని ప్రతీతి. శ్రీగురుని మహిమలు, ప్రజలలో ఆయనపై పెరుగుతున్న భక్తి ఆతనికి కంటకింపయింది.

వీలయినప్పుడల్లా శ్రీగురునిపై నోరు పారేసుకునేవాడు. ఒకరోజు శ్రీగురులు పల్లకీలో నదికి స్నానానికి పోతూ కనిపించారు. ఆయన వైభవం త్రివిక్రమ భారతిలో అసూయరేపి అతని ఏకాగ్రత చెరిచింది. ఆరోజు అతనికి నరసింహ స్వామి హృదయ దర్శనం ఇవ్వలేదు. అతను కలవరపడ్డాడు. ఇంకొక వింత జరిగింది. తన హృదయంలో అతనిని నరసింహస్వామి బదులు శ్రీగురులు కనిపించారు. నదిలో స్నానం చేస్తున్న ఆయన చిరునవ్వుతో తనకే ఎందుకు కనబడుతున్నారో అతనికర్థం కాలేదు. ఇంతలో ఇంకో అద్భుతం జరిగింది. అక్కడ స్నానం చేస్తున్న శ్రీగురుని శిష్యులందరూ ఆ త్రివిక్రమ భారతికి

శ్రీగురునిలాగే కనిపించారు. అంతమంది శ్రీగురులను ఒకేసారి ఒకేచోట చూచిన అతని తల తిరిగిపోయింది. ఏమిటీ వింత! అతను శ్రీగురుని మహిమ గుర్తించి మనస్ఫూర్తిగా ఆయన పాదాక్రాంతుడయ్యాడు. తనని క్షమించమని కోరాడు. అప్పుడు శ్రీగురులు **"నాయనా! నీవే రూపంలో ఉన్న దేవుని కొలిచినా ఆ పూజ చివరికి నాకే చెందుతుంది. ఎందుకంటే పరమశివుడే మనందరిలోనూ ఆత్మరూపియై ఉన్నాడు. అందుకే నీకు అందరూ నాలాగే కనిపించారు. నీవు ఎవరినన్నా ద్వేషిస్తే నీకు మిగిలేది పాపమే. ఎందుకంటే నీవు శివుణ్ణే ద్వేషిస్తున్నావు కనుక.** ఈ విధంగా జ్ఞానబోధ చేశారు శ్రీగురులు. ఇక అతను శ్రీగురుని శిష్యుడై ఆయన నారాధించాడు.

బీదరులో ఆ కాలంలో ఒక యవనరాజు ఉండేవాడు. అతని పోషణలో ఇద్దరు సంస్కృత పండితులుండేవారు. వారు చాలామంది వేదపండితులను తమతర్కంతో వాదించి ఓడించి విర్రవీగేవారు. చివరికి వారి



అహంకారం ఏస్థాయికి వెళ్ళిందంటే ఎవరిని తాము ఓడించినా తమకు జయపత్రిక నివ్వాలని పట్టుబట్టేవారు. కుమసీ నగరంలో త్రివిక్రమ భారతిని గెలవాలని వారు అక్కడికి వచ్చారు.

సాధు వర్తనుడైన భారతి వారి గర్వాన్ని చూచి **'నాయనా! జయాపజయాలు అశాశ్వతములు మరియూ దైవాధీనములు. ఎవరికైనా గర్వం మానసిక సౌందర్యాన్ని హరింప చేస్తుంది. మీరు దిట్టలైన పండితులే వెళ్ళిరండి"** అన్నాడు.

దానికి వారు **'అది నువ్వుచెప్పేదేమిటి? అందుకే మాకు జయపత్రిక ఇవ్వు చాలు'** అన్నారు. **మీరు అది మా శ్రీగురువుల వద్ద తీసుకోవాలి'** అన్నాడు త్రివిక్రమ భారతి. ముగ్గురూ గాణ్గాపురం బయలుదేరారు. భారతి నడిచి వస్తుంటే వారు పల్లకీ ఎక్కారు. ఆ విధంగా శ్రీగురుని చేరారు. ఆ ముగ్గురను చూస్తూనే విషయం ఆకళింపు చేసుకున్నారు శ్రీనృసింహ సరస్వతి. తన మృదు మధుర వాణితో ఇలా అన్నారు...



**ఉ॥ వేదములెల్ల నేర్చితిని వేత్తను యంచని దుర్మదాంధులై**
**వాదమునందు గెల్వగలవాడెవడంచని విర్రవీగితే**
**రాదుర ముక్తి, సజ్జనుల లబ్ధి నశించును, శత్రులెక్కుడై**
**చేదుగ మారు ఆవెనుక జీవితమంతయు దుష్ట బుద్ధితో**

**తాటి చెట్టెక్కిన వాని తల తన్నేవాడు కూడా ఉంటాడని గుర్తుంచుకోండి"** అని మెత్తగా చీవాట్లు పెట్టారు. అయినా ఆ ఇద్దరు అహంకారులకు జ్ఞానోదయం కలుగలేదు. మాకు జయపత్రిక ఇచ్చుకోండి అనే పాట మానలేదు.

**"నాయనలార! అపారమైన వేదరాశినుండి బ్రహ్మ ఒకసారి భరద్వాజమునికి ఒక దోసిలితో పట్టి ఇది నేర్చుకో అని ఇస్తే ఆయన ఇంకా నేర్చుకుంటూనే ఉన్నాడు. నేటికి ఈ భారతావనిలో ఆ భరద్వాజుడిచ్చినదెంత? దాంట్లో ఈ కలియుగపు బ్రాహ్మణులు నేర్చినదెంత? దాంట్లో మీవంటివారు నేర్చినదెంత? అహంకారం మానండి"** అని చెప్పారు. అప్పటికీ వారు మారలేదు.



ఆ శాంతమూర్తి ఇంకా ఇలా అన్నారు. **"కలియుగంలో వేదం జ్ఞానంకోసం కాక ధనార్జనకే నేర్చే దురవస్థ వస్తుంది అని ముందే గ్రహించాడేమో వ్యాస భగవానుడు తనకి తెలిసిన ఆకొద్దిపాటి వేదాన్ని తనశిష్యులలో ఋగ్వేదమని జైమినికి, యజుర్వేదమని వైశంపాయనునికి, సామవేదమని జైమినికి, అధర్వణ వేదమని సామంతునికి నేర్పాడు. కాలక్రమేణా అది మౌఖికం (నోటితో పలికేది) కనుక నేటికి అందులో వేయివంతు కూడా మిగలలేదు. భక్తి తత్పరతలున్నవానికి మాత్రమే కొన్ని జన్మల తరువాత వేద విద్యలో జ్ఞానం అర్థమవుతుంది. లేక మీలాగ అహంకరించటం సదాశివుని చిత్తరువును చూచి నాకు శంకరుడు కనిపించాడనుకునే వెర్రితనం వంటిది"** అప్పటికీ ఆ ఇద్దరూ మనసు మార్చుకోలేదు.

అప్పుడు శ్రీగురులు ఆ దారిన పోతున్న ఒక వెట్టి వానిని పిలిచి, తన శిష్యునిచే నేలపై కర్రతో ఏడు గీతలు గీయించి **"నాయనా! ఈ ఏడు గీతలలో ఒక దానిపై నిలబడి కళ్ళు మూసుకుని నీవెవ్వరివో చెప్పు** అని అతనిపై

విభూతి చల్లారు. అతనట్లా చేసి **స్వామీ! నేను సమీపారణ్యంలో నివసించే కిరాతకుడను** అన్నాడు. రెండవ దానిపై నిలబడి నేను వేటాడే భిల్లుడను అన్నాడు. మూడవ దానిపై **తన బేస్తవాడినని,** నాల్గవదానిపై **శూద్రుడనని,** ఐదవదానిపై **సోమదత్త వైశ్యుడనని,** ఆరవదానిపై **గోవర్ధన క్షత్రియుడనని,** ఏడవదానిపై **వేదము నేర్చిన బ్రాహ్మణుడననీ** చెప్పాడు. అంత శ్రీగురులు **"నాయనా! ఈ ఏడుజన్మలలో నీ ఆత్మ తన శరీరాన్ని మాత్రమే మార్చుకున్నది. కానీ నీ అహంకారం నిన్న వేదపండితునినుంచి కిరాతకుని చేసింది. అదే నీవు నీ అహంకారాన్ని త్యజించి వుంటే ఈ ఏడు జన్మలలో వేదపండితుని నుంచి ముని, మహాముని... అనే పై అంతస్తుకెళ్ళే మెట్లు ఎక్కుతూ ఈ "పరమపద సోపాన పటములో మెల్లిగా సత్యలోకం (బ్రహ్మ ఉండేలోకం) దాటి కైవల్యం పొందేవాడివి"** అన్నారు.

ఆ మాటలు విని ఆ ఇద్దరు పండితులు పశ్చాత్తాపంతో శ్రీగురుని కాళ్ళపైబడి క్షమించమన్నారు.



దానికాయన **"నాయనలారా, నేను క్షమించాను కనుక మీకింకా ఈజన్మలో మీరు చేయబోయే పాపం నుండి మీకు ముక్తి కలిగిస్తాను. అయితే జరిగిపోయిన మీపాపానికి మీరు పన్నెండేళ్ళు బ్రహ్మరాక్షసులై ఉండవలసి వస్తుంది అని** వారిపై మంత్రజలం చల్లారు. ఆవేద పండితులు కట్టెవిరిగి పడినట్లు నేలపైపడి తనువు చాలించినారు.

అదిచూచి వెట్టివాడు ఆయన కాళ్ళపై బడ్డాడు. **నాయనా! ఈపవిత్ర సంగమంలో స్నానంచేస్తూ దైవధ్యానంలో గడుపమన్నారు.** కానివాడు వెంటనే ఆ జన్మ అంతం కావాలి అని పట్టుపట్టాడు. అది చూచి, ఆ వెట్టివాని భార్య పరుగుపరుగున అక్కడికి వచ్చి **"స్వామీ! ఏమిటీతని వెర్రి. నాగతేమిటి?"** అని మొత్తుకుంది.

అప్పుడు శ్రీగురులు తన శిష్యునితో చెప్పి ఆ వెట్టివానిని స్నానం చేయించి తనంతకుముందు చల్లిన విభూతి కడిగించారు. దానితో వానికి గతజన్మ స్మృతిపోయి మామూలు మనిషి అయ్యాడు.



ఆ విధంగా శ్రీగురుని అద్భుత లీల తిలకించి అక్కడి వారంతా ఆయన పాదదాసులయ్యారు. ఒకరోజు శ్రీగురులు నామదేవుడనే కృతయుగం నాటి మునీశ్వరుని గురించి ఇలా చెప్పారు. నామదేవుడు లోకానికి సదాశివుడు కూడా నిత్యమూ శరీరమంతా ధరించే విభూతియొక్క విభూతి (మహిమ) నిలా విశదీకరించారు. ఒకసారి ఒక బ్రహ్మరాక్షసుడు నామదేవుని పట్టుకునేందుకు ప్రయత్నించాడు. నామదేవుని శరీరానికున్న విభూతి అతనికి అంటుకుని పాపవిముక్తుడయ్యాడు. అతనికి గతజన్మల స్మృతి కలిగింది.

అతనొకప్పుడు దుర్జయుడనే రాజు. బ్రాహ్మణ హంతకుడు, వ్యభిచారి, అహంకారి, ధనమదాంధుడు, త్రాగుబోతు, దుర్వ్యసన లోలుడు. ఆ పాపాల ఫలితంగా నూరు సంవత్సరాలు పిశాచత్వం అనుభవించి ఇప్పుడు బ్రహ్మరాక్షసత్వం వచ్చింది. ఎన్నడో చేసుకున్న పుణ్యంవలన ఈనాడు నామదేవుని విభూతి దయవలన పాపవిముక్తుడై స్వర్గప్రాప్తి కలిగింది.



నామదేవుడు తనకు తెలిసిన ఒక ద్రవిడ బ్రాహ్మణుని కథ చెప్పాడు. దుర్వ్యసనాలపాలైన ఆ బ్రాహ్మణుడు ఒకరోజు కల్లు విపరీతంగా త్రాగి స్పృహలేక పడిపోయాడు. అతనిని ఒక కుక్క చూచి శవమనుకొని తినడానికి వచ్చింది. అప్పుడు దానికెక్కడో అంటిన శివాలయంలోని విభూతి అతని తలపై రాలింది. ఆ తరువాత అతను మరణించాడు. అయితే అతన్ని కొనిపోవటానికి వచ్చింది యమదూతలు కాదు, పరమశివుని శివగణములు వచ్చాయి. అతనికి కైలాస ప్రాప్తి దక్కింది.

పూర్వం 'మాహూర్' అనే గ్రామంలో గోపీనాథుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అన్యోన్యమైన భార్యతో అతను సుఖంగా ఉండేవాడు. ఆదంపతులు దత్తాత్రేయ స్వామి ఆరాధకులు. ఆ స్వామి దయవలన అతనికి పుత్రుడు కలిగాడు. వానికి కూడా దత్తాత్రేయుడనే నామకరణం చేసి చాలా గారాబంగా పెంచారు. యుక్తవయస్సు రాగానే అతనికి సావిత్రి అనే కన్యనిచ్చి వివాహం చేశారు.

దురదృష్టవశాత్తు దత్తునికి క్షయవ్యాధి సోకింది. ఎంతమంది వైద్యులను సంప్రదించినా వ్యాధి నెమ్మళించలేదు. ఇకమందులవల్ల లాభంలేదని శ్రీగురుపాదమే శరణని దత్తుని గాణ్గాపురం తీసుకొని వెళుతుండగా దత్తుడు మరణించాడు. సావిత్రి కన్నీరు మున్నీరుగా రోదించింది. అంతలో అక్కడికి ఒక యోగి వచ్చాడు. మెడలో రుద్రాక్షమాలలు, చేతిలో త్రిశూలము వంటిమీద విభూతి రేఖలుగల ఆయోగి అపర రుద్రునివలె ఉన్నాడు. ఆయన్ని చూస్తూనే ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ తన భర్తను తిరిగి బ్రతికించమని ప్రార్థించింది. ఆయోగి నిర్వేదనంతో ఇలా అన్నాడు.

**ఉ॥ కంటిమె ఎన్నడేని భువి, కాలుని దివ్య సభాస్థలిన్ గనన్**
**మింటికి నేగి ఒక్కపరి పిమ్మట జీవములొందు వారలన్**
**ఒంటరినైతినంచిటుల ఓలలనా! నువు ఏడ్వ రాదు మీ**
**జంటకు తీరె కాలమని సైపుము దుర్విధి దాట రానిదౌ.**



అని అనునయంతో ఓదార్చారు. సతీ ధర్మాలనెన్నింటినో బోధించారు. అయినా ఆమె దుఃఖం ఆగలేదు. నీకు నీ గురుకృపకలుగుతుంది. శ్రీపాదుల పాదతీర్థం వీనిపై చల్లండి అని ఆ సిద్ధుడు తనదారిన వెడలిపోయాడు.

ఆమె పతితో సహగమనం చేయుటకు నిశ్చయించుకుని సంగమానికి వెళ్ళి నదిలో తలనిండా స్నానం చేసి, పట్టుబట్టలు ధరించి, ఆభరణాలు, రుద్రాక్షలు, గాజులు, నుదుట బొట్టు ధరించి ఒక కాగడా పట్టుకుని శ్రీగురుని దర్శించటానికి బయలుదేరింది.

సంగమంలో ఆసమయంలో శ్రీగురులు ప్రశాంతంగా, ప్రసన్నంగా ఉన్నారు. సావిత్రి ఆతరువాత శ్రీగురునికి పాదాభివందనం చేసింది. వారు ఆమెని "తల్లీ! నీకు ఎనిమిది మంది పుత్రులు కలుగుతారు అని ఆశీర్వదించారు.

అక్కడ ఉన్నవారు **స్వామి ఈమె భర్త శవం ఇంకా చితిపైనే ఉన్నది. ఆమె సహగమనానికి నిశ్చయించుకొని కడసారి మీకు నమస్కరిద్దామనుకుని వచ్చింది. మీరు ఇలా ఆశీర్వదించారేమిటి?** అని **ప్రశ్నించారు.**



దానికాయన "విచారించకండి ఆమె భర్త దేహాన్ని నాదగ్గరకు తేండి" అన్నారు. వారలాగే చేశారు. అప్పుడు శ్రీగురులు తన శిష్యులతో తన దివ్యపాద తీర్థాన్ని ఆ శవంపై చల్లమన్నారు. ఆ తరువాత ఆశవాన్ని తీక్షణంగా చూస్తూ **"నీవు సావిత్రికి జీవితాంతం తోడు ఉంటానని వాగ్దానం చేశావు. లే!"** అని గంభీరంగా అన్నారు.

అంతే ఏదో నిద్రలోనుంచి లేచినట్లు ఆ దత్తుడు లేచి కూర్చున్నాడు. అందరూ ఆనందాతిరేకంతో జయజయధ్వానాలు పలికారు. ఆ దంపతులిద్దరూ శ్రీపాదులకు పాదాభివందనం చేశారు. వారు మళ్ళీ మంగళ స్నానాలనాచరించి నూతన వస్త్రములను ధరించి శ్రీగురుని పూజించి బ్రాహ్మణులకు షోడశదానాలు చేశారు. అనంతరం సావిత్రి **"శ్రీగురు ప్రభూ! నాకు ఒక రుద్రాక్ష ధారియైన సిద్ధుడు కనిపించి వేదాంతం బోధించి నాపట్టుదలకు సంతోషించి మీవద్దకు నా భర్త దేహాన్ని తీసుకువెళ్ళమని సలహా ఇచ్చారు. ఆ మహాత్ముడెవరు?"** అని అడిగింది. దానికాయన **"అమ్మా! అది నేనే. రుద్రాక్ష ధారణ వల్ల ఎన్నో మేళ్ళు జరుగుతాయి.**



**ఈ రుద్రాక్షల మహిమవల్ల చనిపోయి పునర్జీవితులైన ఇద్దరు మిత్రుల కథ చెబుతాను వినండి. పూర్వం కాశ్మీర దేశాన్ని భద్రసేన మహారాజు జనరంజకంగా పరిపాలించేవాడు. ఆతని మంత్రి సుధర్ముడు. వారిద్దరి భార్యలూ ఒకే సమయంలో ప్రసవించి ఇద్దరు మగబిడ్డలను కన్నారు. ఆశ్చర్యమేమంటే ఆ పసికూనలు కలిసి ఉన్నప్పుడు కేరింతలు కొట్టి ఆడుకునేవారు. కానీ వారిని విడదీయగానే గుక్కపట్టి ఏడ్చేవారు. ఈ వింత వారికర్థం కాలేదు.**

**ఒకరోజు పరాశర మహర్షి (వ్యాసమహర్షి తండ్రి) ఆ రాజుని సందర్శించాడు. అతిథి సత్కారాలనంతరం రాజూ మంత్రీ ఆ ఋషితో ఆ పిల్లల విషయం ప్రస్తావించారు. దానికాఋషి వారిద్దరిదీ పూర్వజన్మ బంధం. ఆ వింత కథ వినండి. ఒక వేశ్య పరమశివ భక్తురాలు. ఎవరో మహాపురుషుడు చేసిన బోధనవల్ల ఆమెకు రుద్రాక్షల మహిమపై గురి కుదిరింది. తను నిత్యమూ శివపూజ తరువాత రుద్రాక్షలు ధరించుటయే**

గాక తన పెంపుడు కోతికి కోడికి కూడా చిన్న చిన్న రుద్రాక్షమాలలు చేయించి అలంకరించేది.

ఒకరోజు శివభక్తుడైన వైశ్యుడు ఆమె వద్దకు వచ్చి ఆమెవద్ద మూడు దినములుంటాననీ కానీ తనవద్దనున్న అమూల్యమైన మహదేవుని ప్రాణలింగానికి నిత్యపూజ మానుట నిషిద్ధమని చెప్పాడు. దానికామె స్వామీ నేనూ శివారాధకురాలనే నావద్ద శివపూజకే అంతరాయం రాదు అని ఒప్పించింది. అయితే...

ఆ॥ అర్ధరాత్రివేళ అగ్నిప్రమాదమై
ఇల్లుకాలిపోయి 'ఇంతి' మిగిలె
వైశ్యుడంతమయ్యె ప్రాణలింగము, కోతి,
కోడితోటి కలిసి బూడిదయ్యె.

ఆమె కన్నీరు మున్నీరయింది. ఈమూడు రోజులూ ఈయనే నాభర్త. నాపతి మాట నిలుపలేక ఆయన ప్రాణంగా చూసుకునే లింగం బూడిదయ్యింది. ఆయనా



మరణించాడు. నా ప్రాణప్రదమైన కోతి కోడి కూడా బూడిదయ్యాయి. ఇక నేను జీవించి ప్రయోజనమేమని ఆ వైశ్యునితో సహా అగ్నిలో ప్రాణత్యాగం చేస్తాను అని అగ్నిలో దూకింది. అప్పుడు వైశ్యుని రూపంలో వచ్చిన పరమశివుడు ఆమెకు సాయుజ్యం ప్రసాదించాడు. మీకు ఉత్తమ జన్మకలుగుతుందని ఆ కోతిని, కోడిని దీవించాడు.

ఓరాజా! వారే ఒకే సమయంలో మీ ఇద్దరికీ పుత్రులుగా జన్మించారు. అయితే దురదృష్టమేమంటే వారి ఆయుర్దాయం ఇంకా ఎనిమిది దినములు మాత్రమే ఉన్నది, అన్నాడు. అంత మంత్రీ రాజూ కలవళ పడి ఋషి కాళ్ళపైబడి గత్యంతరం చెప్పి తమబిడ్డలకు ప్రాణభిక్ష పెట్టమని వేడుకున్నారు. అంత పరాశర మహర్షి రాజా! వేదపండితులను పిలిపించి మహారుద్రాభిషేకం చేయించు. వందకలశాలు ప్రతిష్ట చేయించి రుద్రాధ్యాయాన్ని మృత్యుంజయుని ప్రీతికై వేదపండితులతో పారాయణం చేయించు. పిల్లలిద్దరికీ విభూతీ రుద్రాక్షలు అలంకరింపచేసి శివస్తోత్రం చేయించు నేను ఎనిమిదవ రోజు వస్తాను అని వెడలిపోయాడు.



పరాశరుడు చెప్పినట్లే ఎనిమిదవ రోజున పిల్లలు ఇద్దరూ నేలకొరిగి మరణించారు. అప్పుడు పరాశరుడు ప్రత్యక్షమై అభిషేక జలాన్ని మంత్రించి ఆ ఇద్దరిపై చల్లారు. వారు నిద్రనుండి లేచినట్లు పునర్జీవితులు అయినారు. అప్పుడే అక్కడకు విచ్చేసిన నారదమహర్షి కూడా పరాశరునితో కలిసి ఆ పిల్లల్ని ఆశీర్వదించారు. కనుక రుద్రాక్ష ధారణ విభూతి ధారణ మృత్యుంజయ జపం తప్పకుండా అపమృత్యువును అనగా అకాల మృత్యువును నివారిస్తాయి. ఓ సావిత్రీ దత్తులారా! నా మాటలు సత్యం అని చెప్పారు శ్రీగురువులు.

అప్పుడు సావిత్రి శ్రీగురునితో **'స్వామీ! మున్నెవరన్నా చనిపోయిన వారిని మరల బ్రతికించుకున్నారా'** అని అడిగింది. శ్రీగురువిలా చెప్పారు. పూర్వం దైత్యుల గురువైన శుక్రాచార్యుని కుమార్తె దేవయాని అనే ఆమె ఆ పనిచేసింది. బ్రహస్పతి దేవతలకు గురువు. అతని కుమారుని పేరు 'కచుడు'. అతను శుక్రాచార్యుని శిష్యునిగా చేరి భక్తితో సేవించి గురుప్రేమకు



పాత్రుడైనాడు. చాలా అందగాడైన కచుడు తనతండ్రికీ ఇష్టుడని తెలిసి ఆమె కచుని ప్రేమించింది.

ఇది గిట్టని దైత్యులు ఎవరికీ తెలియకుండా కచుని చంపివేశారు. కన్నీరు కాల్వలై పారునట్లు ఏడుస్తున్న కూతురుని చూడలేక తనకొక్కడికే తెలిసిన మృతసంజీవని అనే మంత్రంతో అతనిని తిరిగి బ్రతికించాడు శుక్రాచార్యుడు. ఆ రాక్షసులు మళ్ళీ కచుని సంహరించి కాల్చి బూడిద చేసి శుక్రాచార్యుడు నిత్యమూ సేవించే 'సురాపానం' (కల్లు) లో కలిపి ఆయన చేతే తాగించారు.

మళ్ళీ కథ మొదటికే వచ్చింది. ఏడుస్తున్న కూతురుని చూడలేక దివ్యదృష్టితో పరికించి 'కచుడు' బూడిద రూపంలో తన పొట్టలోనే ఉన్నాడు, అతనిని బ్రతికిస్తే తను మరణిస్తాడని చెప్పాడు శుక్రాచార్యుడు. దేవయాని చాలా మొండిది. ఆరు నూరైనా కచుణ్ణి బ్రతికించకపోతే తను మరణిస్తానని పట్టు పట్టింది. చేయునది లేక శుక్రాచార్యుడు కడుపులో ఉన్న కచునికి వినపడేట్లు మంత్రం పెద్దగా చదివాడు. పునర్జీవితుడైన కచుడు తన

గురుని పొట్ట చీల్చుకుని బయటకు వచ్చి తిరిగి గురువుని బ్రతికించాడు. రెండుసార్లు వినటంవల్ల దేవయానికీ ఆ మంత్రం వచ్చింది. దాంతో ఆ మంత్ర మహిమ నశించి ఎవ్వరికీ ఉపయోగపడకుండా పోయింది. తన శ్రమ విఫలమైనదని ఆక్రోశించి శుక్రాచార్యుడు ఇట్లా శాపమిచ్చాడు.

**కం॥ ముదితలకు మంత్ర సిద్ధులు**
**కుదరవు నా శాపమిద్ధి, క్రొవ్విదు రీతిన్**
**ముదమార 'కల్లు' త్రాగుచు**
**చెదరిన భూసురుల మంత్రసిద్ధి నశించున్.**

అందుకే స్త్రీలకు మంత్రోపదేశం తగదు. అందుకే వారికోసం వ్రతములు, పూజలూ, నోములూ, కీర్తనలూ వెలిశాయి. వారికి ఆ తేలిక పద్ధతులతో సైతం ముక్తి లభిస్తుంది. కల్లుత్రాగే బ్రాహ్మణుడు ఎన్ని మంత్రాలు చదివినా వారి నోరు నొప్పేగాని ఫలితం పెద్ద గుండుసున్నా. ఇది సత్యం.



స్త్రీలు తమ సుమంగళితనం కాపాడుకోవటానికి సోమవార వ్రతం అని ఒక దివ్యమైన వ్రతాన్ని ఆచరించదగును. పూర్వం సీమంతిని అనే అందాల భరిణ చిత్రవర్మ కుమార్తెగా పుట్టింది. జ్యోతిష్కులు ఆమెకు పతి వియోగం కలుగుతుందని కొందరు, ఆమెకు వైధవ్యం లేదని కొందరు వాదులాడుకున్నారు.

ఏది ఏమయినా పతివియోగం ఉందని, యాజ్ఞవల్క్య మహాముని ఆమెచేత సోమవారవ్రతమను ఒక గొప్ప వ్రతం చేయించారు. సీమంతినికి 14 సంవత్సరాల వయస్సు వచ్చింది. ఇంద్రసేనమహారాజు కుమారుడైన చంద్రాంగుడినికి ఆమె ఎంతో నచ్చి వివాహం చేసుకున్నాడు.

ఆమెకు పతివియోగం బ్రహ్మ లిఖితం కావున ఇద్దరు నాగకన్యలు అతన్ని సర్పదష్టుడిని చేసి పాతాళ లోకం తీసుకెళ్ళారు. అతన్ని పునర్జీవితుడైనా జరిగినది మరిచిపోయి నాగకన్యల సాంగత్యంలో కాలం గడిపాడు.



తను భర్తని ఎడబాసినా తన భర్త బ్రతికే వున్నాడని ఆమె **నేను పునిస్త్రీగానే ఉంటాను లేదా నా భర్త శవం చూపితే సహగమనం చేస్తానన్నది.** గొప్పపండితులు కూడా ఆ సమస్య తీర్చలేకపోయారు. చివరికి ఒక ఏడాది వేచి చూడమన్నారు. ఆమె సోమవార వ్రతదీక్ష కొనసాగించింది.

నాగలోకాధిపతి తక్షకుడు ఒకరోజు చంద్రాంగుడి గురించి తెలుసుకుని అతనిపై జాలిపడి అతని జ్ఞాపక శక్తి ప్రసాదించి పొరపాటు నాగకన్యలది కనుక అతను కావలెనంటే నాగలోకంలో ఉండవచ్చునని లేదా భార్యవద్దకు పోవచ్చన్నాడు. దానికతడు **నాగకన్యల ప్రేమ కోసం స్వార్థంతో నా భార్యకు తల్లిదండ్రులకు అన్యాయం చేయలేనన్నాడు.**

తక్షకుడు అతను వెళ్ళిపోవటానికంగీకరించి అవసరమొస్తే తనని తలుచుకుంటే అతని పూర్వరూపం తిరిగి ఇచ్చేస్తానని దివ్యరూపంతో పంపించాడు.

సోమవార వ్రత దీక్షతో ఆమె ఇంకా తననే ప్రేమిస్తున్నదని అతను గ్రహించి సంతోషించాడు. ఆ



తరువాత తన అసలు రూపంతో తన దాయాదులకు కనబడి 'తనతండ్రిని విడిపించి తన రాజ్యం తిరిగి ఇయ్యకపోతే వారినంతం చేస్తానని బెదిరించాడు. వారు తమ తప్పు అంగీకరించి అతని తండ్రికి రాజ్యం తిరిగి ఇచ్చివేసి క్షమార్పణ కోరారు.

ఆ తరువాత అతను పట్టాభిషిక్తుడై భార్యను ప్రేమగా కలిసి సోమవార దివ్య వ్రత ప్రభావం సత్యమని నిరూపించాడు.

ఆ విధంగా దత్తుడు సావిత్రి సోమవార వ్రత మహత్యం శ్రీగురుని ద్వారా తెలుసుకొని ధన్యులైనారు. గాణ్గాపురంలో సావిత్రి ప్రతి సంవత్సరం సోమవార వ్రతం ఆచరిస్తూ పుత్ర సంతానంతో భర్తతోనూ సుఖంగా ఉన్నది.

ఆ రోజుల్లో గాణ్గాపురంలో ఒక పేద బ్రాహ్మణు డుండేవాడు. సదా బ్రహ్మ భావములో ఉండే అతను భిక్షాటన వృత్తిగా జీవించేవాడు. అతను గొప్ప శ్రీగురు

భక్తుడు. కాని అతని భార్య మాత్రం అతనికి పూర్తిగా విరుద్ధం. 'పెద్ద' వారితో కలుపుగోరుగా ఉంటూ తనూ ఒక ఉన్నత కుటుంబీకురాల నన్నట్లు ప్రవర్తించేది. పెద్దవారింట్లో సమారాధనలకు క్రమం తప్పక పోతుండేది. తృప్తిగా తిని దక్షిణ కూడా తెచ్చుకునేది. భర్తను కూడా తనలా జీవించమని బాధించేది.

వారిద్దరూ శ్రీగురుని భక్తులవటం చేత ఆయనతో తమ బాధ మొరపెట్టుకున్నారు. శ్రీగురునితో భర్త ఇలా అన్నాడు.

**ఆ।। పరుల ఇంట జేరి పనిచి 'మెక్కెడి' వారు**
**తమరి పుణ్యమంత ధారబోసి**
**పరుల కిత్తురయ్య వారి సద్గతులన్ని**
**భూసురులకు 'తిండి' ముఖ్యమౌనె?**

నేను అందుకే అట్లాంటి సంతర్పణలకు వెళ్ళనన్నాడు.



దానికి శ్రీగురులు **'నాయనా! నీవు తిన్న ఇంటి వారిని' అన్నదాతా సుఖీభవ!' అని ఆశీర్వదించి అంతకు మునుపు భోజనం చేసె ముందూ, చేసిన తర్వాత గోవింద నామస్మరణ చేస్తే నీవన్న ఆ పాపం పోతుంది. ఈసారి ఆమెతో నువ్వు సంతర్పణకు వెళ్ళు** అని పురమాయించారు.

ఆ సంతర్పణలో ఒక కుక్క వంటకాలను మూతితో తాకినా వాటిని పారవేయక తమకే వడ్డించబోవడం ఆమె స్వయంగా చూచి 'ఛీ! ఎంత లోకువ అయిపోయాం!' అనుకుని మరెన్నడూ అటువంటి పెద్దవారి సంతర్పణలకు వెళ్ళలేదు.

పై కథలో ఆ స్త్రీవంటి మనస్తత్వంగల పురుషులూ చాలమంది ఉన్నారు. భాస్కర శర్మ అనే శ్రీగురుల భక్తుడొక్కడు అటువంటి వాడే. ఎప్పుడూ శ్రీగురుల మఠంలో సుష్టుగా భోంచేసేవాడు. మనిషి మాత్రం స్వతహాగా మంచివాడు. సమయం దొరికినప్పుడల్లా శ్రీగురుల పాదసేవ చేస్తుండేవాడు.



అతని తిండిని చూచి ఇతర భక్తులు హేళన చేస్తుండేవారు. **'ఏమోయీ నీవు స్వామికెపుడు సంతర్పణ చేస్తావు? ఓహో వెయ్యిమంది అయితే గానీ చెయ్యవా' అని ఆటపట్టించేవారు. ఒకరోజు స్వామి కలుగజేసుకుని 'భాస్కర శర్మా! రేపు మా అందరికీ భిక్ష మీ ఇంట ఉంటుందని'** శాసించారు. అతని గుండెల్లో రాయి పడింది.

అయినా ఆరోజు భిక్షలో వచ్చిందే స్వామికిస్తా ననుకుని భిక్షటనకు వెళ్ళాడు. కేవలం ముగ్గురు మాత్రమే తినగలిగే సరకులు దొరికాయి. ఆ సాయంత్రం శ్రీగురుని దగ్గరకు వచ్చి **స్వామీ రేపు మీ అందరికీ భోజనం ఎలా పెట్టగలను** అని రోదించాడు. కరుణా సముద్రులైన శ్రీగురులు అతన్ని ఓదార్చి తను ధరించే శాలువా అతనికిచ్చి **'నాయనా! నీవంట నీవు చేశాక ఆ పదార్థాలపై ఈ శాలువా కప్పు. ఎట్టి పరిస్థితుల్లోనూ శాలువా వాటిమీంచి తీయకు** అన్నారు.

మరునాడు బ్రాహ్మణులంతా కూడబలుక్కుని వెయ్యిమంది వచ్చి కూర్చున్నారు. **'ఏమోయి భాస్కర శర్మా!**



**లడ్డు నాకు రెండేసి కావాలి, గారెలు నాలుగు కావాలి, పీనాసి తనం చేసి సగం కడుపుకే పెడితే ఆ పాపం నీకే"** అంటూ చలోక్తులు వేశారు.

శ్రీగురులు అనుజ్ఞ ఇవ్వగానే వడ్డన ప్రారంభమైంది. శాలువా, తీయకుండానే లడ్లుకావాలి అన్నాడు 'భాస్కర శర్మ' లడ్లు గిన్నె బయటకు వచ్చింది. ఇలా కోరినవారికి కోరింది వడ్డించాడు. భుక్తాయాసంతో వారి పొట్టలు పగిలిపోతాయా అన్నట్లు తిని వెళ్ళిపోయారు.

అనంతరం శ్రీగురుని కాళ్ళపైబడి కన్నీటితో కాళ్ళు కడిగాడు భాస్కరుడు. ఆనాటినుంచి తను ఆర్జించిన తిండి మాత్రమే తింటూ స్వామిని నిత్యమూ కొలిచి తరించాడు.

అచంచలమైన విశ్వాసం శ్రీగురువుపైగల సోమనాధుడు గంగాదేవి దంపతులు గాణ్గాపురంలో నివసించేవారు. ఆమె గొప్ప పతివ్రత. నిత్యము శ్రీగురుల దర్శనం చేసుకుని ఆయనకు భక్తితో హారతిచ్చేది. ఆమె వయస్సు పైబడిన స్త్రీ. సంతానలేమి ఆమెకు జీవితం నరక ప్రాయం చేసింది.

ఒకనాడు శ్రీగురులు ఆమెని చూచి నవ్వుతూ **'తల్లీ! నీ కోరిక నెరవేరుతుంది. సంగమం దగ్గిర వున్న రావిచెట్టుని పూజించు"** అన్నాడు. ఆమె రెండు రోజులు గడిచాక మూడవరోజు ఆమెకు దివ్య స్వప్నం వచ్చింది. ఆ తరువాత ఆమె శ్రీగురుని దర్శించి వారికి ఏడుసార్లు ప్రదక్షిణం చేసి నమస్కరించింది. వారామెకు రెండు ఫలములనిచ్చి ఆశీర్వదించారు. వారు చెప్పినట్లు ఆమె బ్రాహ్మణులకు సంతర్పణ చేసి వారికి దానాలిచ్చి వారందరి ఆశీర్వాదం పొందింది.

అనంతం ఒక మహాద్భుతం ఆమె జీవితంలో మొదలయింది. ఆమెకు తిరిగి ఋతుచక్రం మొదలయింది. ఆనందంతో ఆమె ఉబ్బి తబ్బిబ్బై పోయింది. ఊరివారంతా ఆశ్చర్యంతో తలమునకలయేట్లు ఆమె గర్భం ధరించి సీమంతం కూడా జరిపించుకొన్నది.

నవమాసాల తరువాత ఆమె పూబంతి వంటి ఆడపిల్లను కన్నది. ఆ పాపని శ్రీగురుల పాదపద్మములపై ఉంచిందామె. శ్రీగురులు ఆ పాపని ఆశీర్వదించారు.



మహాద్భుతంగా ఆ తరువాత గంగాదేవికి చందమామ వంటి ఒక మగబిడ్డ కలిగాడు. శ్రీగురువు కృప ఉంటే అసాధ్యాలన్నీ సుసాధ్యాలవుతాయి.

శ్రీగురులు చేసిన మహాద్భుతాలలో ఒకటి కుష్ఠు వ్యాధిగ్రస్తుని రోగం ఏమందూ మాకూ లేకుండా నయం చేయటం మందుకంటే రోగం నయం చేసేది రోగి నమ్మకమే అని చెప్తారు శ్రీగురులు.

**ఉ॥**

**నమ్మకమన్నదొక్కటి అనాదిగ వైద్యులు వాడుచున్నదౌ**
**తిమ్మని బెమ్మజేయగల దీటగు ఔషధరాజమయ్య, ఏ**
**సొమ్ములు ఖర్చుకావు అతి సూక్ష్మము శ్రేష్ఠము శక్తివంతమౌ**
**ఇమ్మహి శ్రీగురున్ కొలిచి ఈప్సితమందుము వైద్యులేటికిన్**

ఒకనాడు నరహరి అనే కుష్ఠురోగి శ్రీగురుని వద్దకు వచ్చి ఆయన నాశ్రయించాడు. ఆ రోగి కన్నీటితో శ్రీగురుని పాద పద్మములపై పడ్డాడు. **"స్వామీ! అవమానాలతో నాపై**



**నాకే అసహ్యంతో బ్రతుకుతున్నాను. నన్ను కరుణించండి"** అన్నాడు.

దానికి శ్రీగురులు **"నాయనా విచారించకు. నేనిచ్చే ఈ కొమ్మని నీఇంటి దగ్గిర పాతిపెట్టి భక్తితో నీళ్ళు పోస్తుండు. అది చిగురు వేయగానే నీవ్యాధి మటుమాయమవుతుంది"** అన్నారు. అంటూ ఒక మేడి కొమ్మను అతనికిచ్చారు. ఆ కొమ్మ పూర్తిగా ఎండిపోయివుంది.

అయినా అతను శ్రీగురునిపై నమ్మకంతో **మీ ఆజ్ఞ శిరసావహిస్తాను స్వామి!** అని ఆయనకు పాదాభివందనం చేసి వెడలిపోయాడు. స్వామి చెప్పినట్లు చేస్తున్న అతనిది "పిచ్చి పని" అని కొంతమంది నవ్వుకున్నారు. అయినా అతను గురువుపై నమ్మకం వదలలేదు. ఆ కుష్ఠురోగి గురించి సమాచార విషయమై ప్రశ్నించిన కొందరు శిష్యులకు శ్రీనృసింహులు ఈ గాథ నెరింగించారు.

పూర్వం ధనంజయుడనే రాకుమారుడు ఒక మహారణ్యానికి వేటకోసం వెళ్ళాడు. అక్కడ కనుపించిన



ఒక శివలింగానికి తను చంపిన సింహం యొక్క చితాభస్మంతో పూజచేయుట గమనించి అట్లు చేయుటకు కారణం అడిగాడు అక్కడ ఉన్న ఒక భిల్లుడు. అది తన వ్రతమని చెప్పాడు రాజు.

ఆ భిల్లుడు కూడా కృతనిశ్చయుడై నాటినుండి తనూ చితా భస్మంతో శివార్చన చేయటం మొదలు పెట్టాడు. ఇదిలా వుండగా పరమశివుడు అతని దీక్షను పరీక్షించాలని అతనికి ఒకరోజు చిట్టెలుక కూడా దొరకకుండా చేశాడు. అతనికి తీరని దుఃఖం వచ్చింది. **'శంకరా! నాకు చితాభస్మం దొరకకుండా చేశావు. పోనీలే నాగుడిసె ఉంది కదా! దాన్ని తగులబెట్టి ఆ చితాభస్మంతో నిన్ను పూజిస్తాను** అని తను అన్నంత పనీ చేశాడు. అయితే ఆ ఆవేశంలో అతని భార్య గుడిసెలో నిద్రపోతున్నదనే విషయం మరచిపోయాడు.

అచంచలమైన అతని కఠోర దీక్షకు పరమేశ్వరుడు సంతోషించి ఆ భిల్లునికి కోరిన వరాలనొసగుటయే గాక అతని భార్యను కూడ బ్రతికించాడు.

**కనుక అచంచల విశ్వాసంతో చేసె భగవన్నివేదనకు తప్పక సత్ఫలితం ఉంటుంది** అన్నారు శ్రీగురులు.

ఆ తరువాత ఆయన నరహరి దగ్గరకు వెళ్ళి **'నాయనా! నీచెట్టుకు ఈ నీళ్ళు పొయ్యి అని నీరు సంగమంలోంచి తెప్పించి తన కమండలంతో పోయమని** అన్నారు. నరహరి అట్లాగే చేశాడు. అందరూ సంభ్రమాశ్చర్యాలతో చూస్తుండగా పాతిన ఆ ఎండు కొమ్మ చిగిర్చి పుష్పించింది. తక్షణం నరహరి కుష్ఠువ్యాధి కూడా మటుమాయ మయింది. అటువంటిది శ్రీగురుల దివ్యమహిమ.

నరహరి వాడిన ఔషధం ఏముంది? అతనికి ఏ వైద్యం జరిగింది? కేవలం గురుకృప లభించింది. సిద్ధయోగులు భూమిపై అవతరించి ఎన్నో దివ్య మహిమలు చూపి ప్రజల్ని ఆకర్షిస్తారు. దేనికి? వారి మఠాలు, ఆశ్రమాలు నిర్మించుకుని వైభోగంతో బ్రతకటానికి కాదు. ఎక్కువమంది ప్రజల్ని సన్మార్గుల్ని చేస్తే వారు వారి వంతు కృషితో ధర్మాన్ని నిలబెడతారు. గిట్టని వారికి అది భోగంలా కనిపిస్తుంది. అదంతే "యద్భావం తద్భవతి". ఏ రంగు



గాజు ముక్కలోంచి చూస్తే ఆ రంగు కనిపిస్తుంది.

గాణ్‌గాపురంలో శ్రీగురులు చేసిన మహాద్భుతాలు మహిమలు ఇన్ని అని చెప్పుట సాధ్యంకాదు. వారి లీలలు నలుమూలలకు విస్తరించి ఎంతోమంది శిష్యులు ఆయనను కొలిచారు. వారందరిలో సాయందేవుడు ముఖ్యుడు. శ్రీగురుని దివ్యమహిమ అనన్య సాధ్యమని గుర్తించి అతను వారి దాసానుదాసుడై ప్రియశిష్యుడయ్యాడు.

ఒకసారి శ్రీగురుని వారి మఠంలో దర్శించి ఆయనకు సాష్టాంగ వందనం చేసిన సాయందేవునితో శ్రీగురులు శిరస్సుపై తన అమృత హస్తముంచి దీవించి ఏం కావాలో కోరుకోమన్నారు.

అతనికి కంఠం రుద్ధమయింది. అశ్రువులు జల జలారాలుతున్నాయి. పెదవులు వణుకుతున్నాయి. నోటమాట రావడం లేదు. మనస్సు మూగపోయింది. పీడకల నుంచిలేచిన బిడ్డ తన తల్లిని చుట్టుకున్నట్లు ఆయన పాదాలని చుట్టుకుని ఇలా అన్నాడు.



**చం॥**

**విడువను మీదు పాదముల వేదన లెన్నియు నన్ను**
**జుట్టినన్**
**కొడుకును తండ్రివోలె నను కూరిమి సత్కృప**
**జూడుమయ్య! నే**
**నడుగను భోగభాగ్యములు అన్నియు వ్యర్థమె**
**నాకవేటికిన్**
**నుడువుము 'ధర్మమార్గమును' నూతన జీవిత**
**మిమ్ము 'శిష్యుగా'**

అప్పుడు శ్రీగురులు చిరునవ్వుతో **అయితే నీవు ఒంటరిగా నాతోపాటు సంగమానికి రా. స్నానం చేద్దువుగాని** అన్నారు. అప్పుడు ఆకాశం మేఘావృతమై పెనుగాలులు వీయడం మొదలయింది. చిమ్మ చీకటిగా ఉంది **"నాయనా! చీకటిగావుంది. వెనుదిరిగి చూడకుండా ఒక కాగడా తీసుకురా"** అన్నారు. సంధ్యావందనం చేసుకుంటున్న



ఆయనపై వర్షం వస్తె తడుస్తారని తన కండువా కప్పి కాగడాకోసం బయలుదేరాడతను. కాగడా తెస్తున్నాడు. ఇంతలో చినుకులు పడుతున్నాయి. కానీ తన తలపై పడడంలేదు. కారణమేమిటా అని చూచాడతను ఓరగా. తన వెనక ఐదు తలల శేషుడు పడగవిప్పి గొడుగులా పట్టి వస్తున్నట్లు గ్రహించాడు. భయంతో గుండె గుభేలుమంది సాయందేవునికి. "ఓం గురుభ్యోం నమః" అని జపించుకుంటూ ముందుకు నడిచాడు.

సంగమం దగ్గరకు రాగానే పవిత్రమైన వేద ఘోష వినబడింది. శ్రీగురులు ఒకచెట్టు క్రింద కూర్చుని ఉన్నారు. తన వెనుక ఉన్న దివ్య శేషుడు ముందుకు వచ్చి ఆయనకు వినయంగా తలవంచి మ్రొక్కి మాయమయింది. సాయందేవుడు శ్రీగురునికి సాష్టాంగ వందన మాచరించాడు.

ఒకప్పుడు పరమేశ్వరుడు పార్వతీదేవికి గురుభక్తి ఎలా వుండాలో ఈ విధంగా తెలిపాడు. బ్రహ్మ మానసపుత్రుడైన త్వష్ట అనే వాడు ప్రజాపతి అయ్యాడు. అతని కథ

అద్భుతమైనది. అతను ఒక గురువువద్ద జేరి విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు అతనిని పరీక్షింతమనిగురుడు **నాయనా! నీ గురుపత్ని, పుత్రుడు, పుత్రికల కోరిక నా కోరిక తరువాత తీర్చెదవు గాని, ముందు నాకు నా గృహం తుఫానుకు చెడిపోయినందు వలన గాలికి ఎండకూ అగ్నికీ పాడవని గృహం నిర్మించి** ఇవ్వమన్నాడు. అదే సమయంలో గురుపత్ని తనకు **కత్తిరించకుండాను చించకుండాను, కుట్టకుండాను, తయారు చేసిన కంచుకం (రవిక) కావాలని అన్నది.** అదే సమయంలో గురు పుత్రిక వచ్చి **దంతంతో చేసిన ఒంటి స్తంభం మేడ బొమ్మరిల్లు కావాలని అది క్రిందపడవేసినా పగులకూడదు అన్నది. గురుపుత్రుడు 'ఓ త్వష్టా! నాకు మనస్సులో తలుచుకొని ఎక్కడకు వెళ్ళాలంటే అక్కడకు క్షణంలో తీసుకువెళ్ళే పాదరక్షలు కావాలని"** అన్నాడు.

ఈ కోర్కెలు మానవ మాత్రులచే సాధ్యం కావని గురువు అనుమతి తీసుకొని నమస్కరించి గురునామజపం చేస్తూ పోతుండగా దారిలో ఒక యోగీశ్వరుడు



కనిపించాడు. త్వష్ట ఆయోగి కాళ్ళపైబడి తనని అనుగ్రహించమన్నాడు. ఆయోగి **"నాయనా! సర్వుల కోరికలు తీర్చగల శక్తిమంతుడు ఆ కాశీవిశ్వేశ్వరుడొక్కడే. నాతోవస్తే ఆ స్వామి దర్శనం చేయిస్తానన్నాడు.** అంగీకరించిన త్వష్టకు కాశీలోగల దివ్యక్షేత్రాల నన్నీ చూపించి విశ్వనాధుని ఆలయం వద్ద ఆయోగి అదృశ్యమయ్యాడు. ఆ స్వామి లింగాన్ని చూచి

**ఉ॥ విశ్వము సృష్టి జేసితివి వింతగు ప్రాణుల జన్మ నిచ్చుచున్**
**విశ్వముగాచు నాధుడవు భీకరమౌతమ ఫాలనేత్రమున్**
**విశ్వము అంతమొందుటకు విప్పెదవయ్యరొ విశ్వనాథ! యీ**
**విశ్వమునందు జ్ఞానమిదు విశ్వగురుండును నీవె ఓప్రభూ!**

అని స్తుతించాడు. ఆ స్తోత్రానికి పరమానంద భరితుడైన



పరమేశ్వరుడు నీ **గురుకుటుంబం కోరినవన్నీ వాళ్ళకిస్తున్నాను** అన్నాడు. వాటిని చూచి ఆ గురువు **నాయనా! నీవు విశ్వకర్మవని ప్రఖ్యాతి చెందిన దేవ శిల్పివవుతావు** అని ఆశీర్వదించాడు. విశ్వకర్మ విశ్వ విఖ్యాతుడై ఇంద్రుని వజ్రాయుధాన్ని, కుబేరుని అలకాపురిని రావణుని లంకా నగరాన్ని నిర్మించి జగద్విఖ్యాతి గన్నాడు.

శ్రీగురువు చిరునవ్వుతో **"నాయా సాయందేవా! కాశీ క్షేత్రం దర్శించాలను కొంటున్నావా"** అన్నారు. అతడు **"గురుదేవా! మీరెక్కడ ఉంటే అదేనా కాశి. మీరే నాకు పరమ శివుడు"** అన్నాడు.

అప్పుడాయన **"నాయనా! ఇక నీవు ఆ తురుష్క రాజు కొలువు మానేసి నాదగ్గిరే వుండు నీకు నీ భార్యాబిడ్డలకు శుభం కలుగుతుంది"** అన్నారు. సాయందేవుడు గురు ఆజ్ఞ పాటించాడు.

ఒక అనంత చతుర్దశినాడు శ్రీగురులు సాయందేవునికి



అనంత పద్మనాభస్వామి వారి వ్రతం చేయమని దాని వైశిష్ట్యం ఇలా చెప్పారు.

**ద్వాపరయుగంలో పాండవులు దుర్యోధనుని కుతంత్రం వల్ల రాజ్యం కోల్పోయి అవమానాల పాలై శ్రీకృష్ణుని సలహాతో అనంత పద్మనాభస్వామి వ్రతం చేసి శత్రు సంహారంతో అనంత వైభవాన్ని రాజ్యాన్నీ పొందారు.**

పూర్వం సుమంతుడను వాని భార్య ఒక అందాల బాలికను ప్రసవించి చనిపోయింది. పెద్దల ప్రోద్బలంతో అతను పునర్వివాహం చేసుకున్నాడు. ఆతని కుమార్తె సుశీలను అతని రెండవ భార్య వేధించేది. భగవత్కృప వల్ల సుశీలకు కౌండిన్యుడనే బ్రాహ్మణ యువకునితో వివాహం జరిగింది.

వారు అన్యోన్యమైన జంట. వివాహం తరువాత కౌండిన్యుడు భార్యతో సహా తమ నగరానికి బయలుదేరారు. మార్గమధ్యంలో అనంత పద్మనాభ వ్రతం చేస్తున్న ముగ్గురు పుణ్యస్త్రీలు ఆమెకు వాయనం ఇచ్చి

ఆమె చేతికి 'తోరం' కట్టారు. ఇది ఆమె భర్త నిద్రిస్తుండగా జరుగుట వలన అతడెరుంగడు. అతడు నిద్రలేచిన తరువాత వారు ప్రయాణం కొనసాగించి ఒక రాజ్యం చేరారు. రాజవీధిలో ఒక భద్రగజం అతని మెడలో పుష్పమాల వేసింది. ఆ విధంగా అతడు ఆ రాజ్యానికే రాజైనాడు. అది అనంత పద్మనాభుని దయయే.

అయితే వినాశకాలే విపరీత బుద్ధి అని కౌండిన్యుడు తన భార్య చేతికున్న తోరం తనకి 'ఇబ్బందిగా ఉందని త్రెంచి అవతల పారేశాడు. ఆపైన స్వామికి ఆగ్రహం వచ్చి సర్వనాశనమై అతను దౌర్భాగ్యుడైనాడు.

తనచేతి తోరం పోయాకే ఈ విపత్తి వచ్చిందని ఆమె **నాథా! మీరు స్వామికి అపచారం చేశారని** చెప్పింది. వెంటనే అతడు తప్పు తెలుసుకొని స్వామిని నిరాహారియై దీక్షతో పూజించాడు. చివరికి స్వామి కరుణించి ఒక సాధువుగా వచ్చి అతనితో అనంత పద్మనాభ వ్రతం చేయించాడు. ఆ స్వామి దయవల్ల అతను పోగొట్టుకున్న వన్నీ తిరిగి పొందాడు.



ఒకప్పుడు గాణ్‌గాపురంలో తంతకుడు అనే పద్మశాలీ కులానికి చెందిన యువకుడు, నెమ్మదస్తుడు, శ్రీగురు భక్తుడుండేవాడు. అతనికి శ్రీగురులంటే అపరిమితమైన నమ్మకం. ప్రతిరోజూ ఉషోదయాన మఠానికి వచ్చి ఊడ్చి, కలాపు చల్లి, ముగ్గులు పెట్టేవాడు. అన్నీ సక్రమంగా సర్ది అప్పుడు తన ఇంటికి వెళ్ళి తన స్వంతపని చేసుకునే వాడు.

ఆ గ్రామవాసులు శివరాత్రినాడు శ్రీశైలం వెళ్ళి మల్లికార్జునుని దర్శించే అవకాశం ఆ ఏడు అతనికి ఇవ్వాలని నిశ్చయించుకున్నారు. అన్నారేకానీ ఎవ్వరూ ఏర్పాట్లు చేయలేదు. ఇది తెలిసి శ్రీగురులు నాయనా! **నీవు నా పాదుకలను నీచేత్తో గట్టిగా పట్టుకుని నన్ను స్మరిస్తూ కళ్ళుగట్టిగా మూసుకో** అన్నారు.

అంతే అతనికి శరీరం తేలిపోతున్నట్లు అనిపించింది. కనులు తెరిచే సరికి అతను శ్రీశైలంలో ఉన్నాడు. శ్రీశైలంలో చూడవలసిన స్థలములూ వింతలూ చూసి మల్లిఖార్జునస్వామి దర్శనం చేసుకుంటున్న అతనికి



మల్లిఖార్జునుని స్థానంలో శ్రీగురులే కనిపించారు. గాణ్‌గాపురం నుంచి వచ్చిన కొంతమంది యాత్రీకులు అతనికి కనిపిస్తే వారిని పలుకరించాడు. వారు అతనితో **నీకు శ్రీగురులే శ్రీశైలం అన్నావుకదా! మరి ఎందుకు వచ్చావు? ఎలా వచ్చావు?** అని అడిగారు. దానికాతడు **శ్రీగురు కృపవల్ల వచ్చాను. అంతకుమించి నాకేమీ తెలీదన్నాడు.** వారు అతని మాటలు నమ్మలేదు.

అతను తిరిగి పాదుకల సహాయంతోనే క్షణంలో స్వస్థానానికి వచ్చి శ్రీగురుని సేవిస్తూ ఉండిపోయాడు. కొన్నాళ్ళ తరువాత శ్రీగురునికి సేవ చేస్తూ కనిపించిన తంతకుని చూచి శ్రీశైలం నుంచి గాణ్‌గాపురం వస్తున్న వారు ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టారు. శ్రీగురుని మహత్త్యం తెలుసుకొని దాసోహమన్నారు. పూర్వం నంది శర్మ అనే కుష్ఠురోగి తుల్జాపురంలో గల భవానీదేవిని 'త్వమేవ శరణం' అని నమ్మి కొలుస్తుండేవాడు. ధనానికి కొదవలేదు గనుక అంతకు ముందే పెద్ద పెద్ద వైద్యులందరికీ తన వ్యాధిని చూపించుకున్నాడు. ఎన్ని మందులు మ్రింగినా



వ్యాధి పెరిగిందే కాని తరుగలేదు.

ఒకరోజు అతనికి కలలో భవానీ మాత స్ఫురించి 'చందలా' లో నెలకొన్న 'పరమేశ్వరి' ని ఉపాశించమని చెప్పింది. పరమేశ్వరిని భక్తి శ్రద్ధలతో ఆరాధించాడు నంది శర్మ. కొన్నాళ్ళకు 'పరమేశ్వరీదేవి' కలలో కనిపించి గాణ్‌గాపురం శ్రీగురుని దర్శించమంది.

దేవి పలుకులు నంది శర్మకు నచ్చలేదు. గొప్ప గొప్ప వైద్యులూ ఏమీ చేయలేక పోయారు. మహా మహా దేవతలూ ఏమీ చేయలేక పోయారు. ఇక ఈ మునులూ, బైరాగులూ, గురువులూ మానవ మాత్రులూ రాగద్వేషాలు కల అహంభావులూ ఏం చేస్తారని మిన్నకుండి పోయా డతను.

కాని అతని అదృష్టం కొద్దీ గాణ్‌గాపురం పోవాలనే బుద్ధి పుట్టి శ్రీగురుని సన్నిధికి వచ్చాడు. కానీ అతను 'కుశంక' వదలలేదు. శంక ఉన్నవారంటే ఏ గురువుకిష్టం ఉంటుంది? అతన్ని చూస్తూనే...

**చం॥ ఘనులగు వైద్యులందరును కాదని అంటిరి**
**కుష్ఠువ్యాధికిన్**
**కనుగొనలేదు ఔషధము కావగ దేవుడె దిక్కు**
**నాకు, ఈ**
**మునులును 'దేవు' దంటి గురుమూర్తులు దేనికి**
**వ్యర్థమంటివే**
**నను 'ఇట' జూడవచ్చితివి నవ్వరె ఎల్లరు**
**సిగ్గు లేదాకో!**

సాధారణంగా శాంత స్వరూపులై చిరునవ్వుతో ఉండే శ్రీగురులు అలా పరుషంగా మాట్లాడే సరికి నంది శర్మకు దుఃఖం ఆగక వెక్కి వెక్కి ఏడుస్తూ తన వ్యాధి నసహ్యించుకొని తల్లిదండ్రులూ భార్యాకూడా తనకు దూరమైనారని వైద్యులచుట్టూ దేవతల చుట్టూ తిరిగి వేసారి పోయాననీ తను చేసిన అపరాధం గురువుని గుర్తించలేక పోవటమేననీ, అది కూడా తన దౌర్భాగ్యమే అని దీనంగా విన్నవించు కున్నాడు.



సద్గురులకు కోపం రాదు. ఒకవేళ వచ్చినా అది క్షణం సేపే. శ్రీగురులు కరుణించి ఒకశిష్యుని పిలిచి ఈ నంది శర్మను సంగమం దగ్గరకు తీసుకెళ్ళి స్నానం చేయించి అక్కడున్న రావిచెట్టుకి ప్రదక్షిణ చేయించి తీసుకొని రమ్మని చెప్పారు. అదయ్యాక కమండలంలోని మంత్ర జలం అతనిపై జల్లారు. కుష్టువ్యాధి నయమైంది. అతని నోటిలో విభూతి వేయగానే చదువులేని ఆతడు చక్కటి శ్లోకాలతో కవిత్వం చెప్పాడు. అదీ శ్రీగురు మహిమ అంటే.

తొలుత తనంటే భక్తి విశ్వాసాలు లేనివారిని కూడా శ్రీగురులు తన ప్రియభక్తులను చేసికొన్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. హిప్పగిరి గ్రామానికి చెందిన 'నరకేసరి' అను వానికథ ఆ సత్యాన్నే నిరూపిస్తుంది. ఆ గ్రామంలో శ్రీగురుని భక్తులు కొందరున్నారు. వారంతా శ్రీగురుని భక్తి విశ్వాసాలతో భిక్షకోసం ఆహ్వానించారు. శ్రీగురుని భక్తులు కొందరు నరకేసరికి తారసిల్లి స్వామివారి గురించి చెప్పి వారిని కలుసుకోమన్నారు.



అతడు ఆ వూరిలో వెలసిన కల్లేశ్వర స్వామి భక్తుడు. స్వతహాగా గొప్ప కవి అయిన నరకేసరి కల్లేశ్వర స్వామిపై ఎన్నో పద్యాలు పంచ రత్నాలుగా చెప్పియున్నాడు. శ్రీగురుని భక్తులు వారిపైకూడా పద్యాలు చెప్పమంటే మానవ మాత్రులపై తను కవిత్వం వ్రాయనన్నాడు.

ఆరోజు అతను కల్లేశ్వరుని దర్శించి పూజ చేస్తున్నాడు. ఉన్నట్లుండి మైకం కమ్మింది నరకేసరిని. అతనికి పూజలో లింగము బదులు శ్రీగురులు ఉన్నారు. తను ఆయననే పూజిస్తున్నాడు. నెమ్మదిగా శ్రీగురులే త్రిమూర్తుల రూపంలో కనిపించారు.

అతను మైకం నుంచి కోలుకొని పరుగు పరుగున శ్రీగురు సన్నిధికి చేరుకొని ఆయన కాళ్ళపై బడి కన్నీటితో తనను క్షమించమని ప్రార్థించాడు. స్వామి చిరునవ్వుతో వానిని లేవనెత్తి తన ప్రియ భక్తునిగా స్వీకరించారు. నరకేసరి శ్రీగురులపై అనర్గళంగా కవిత పద్యరత్నాలు చెప్పి ధన్యుడయ్యాడు.



అతను శ్రీగురుల సన్నిధిలోనే తన శేష జీవితమంతా గడిపాడు. ఒకసారి దీపావళి పండుగ వచ్చింది. గాణ్గాపురంలోని భక్తులందరూ స్వామిని దర్శించి వారి ఆశీస్సులు పొందారు. శిష్యులు తోరణాలు కట్టి మఠాన్ని అలంకరించారు. అప్పుడు ఒక వివాదం తలెత్తింది. ధనవంతులైన ఏడుగురు భక్తులు శ్రీగురునకు సాష్టాంగ దండము చేసి **స్వామీ నేడు తమరు మా ఇంట భిక్ష స్వీకరించండి** అని వేడుకున్నారు. అయితే ఏడుగురూ విడివిడిగా అభ్యర్థించారు.

స్వామి ఎవరినీ కాదనలేక అంతా కలిసి ఒకేచోట ఏర్పాటు చేయండి అన్నారు. కాని అందులో తగ్గేవారెవరూ కనిపించలేదు. అందరూ **స్వామి మా ఇంట్లో ఏర్పాట్లు జరిగిపోయాయి. మా చుట్టాలందరూ తమ ఆశీర్వాదానికి విచ్చేశారు. మీరు మా ఇంటికి రాక తప్పదు** అన్నారు. "సందట్లో సడేమియా" అన్నట్లు మఠంలో శిష్యులు కూడఆ **'స్వామీ! ఎక్కడికీ వద్దు మీరు మన మఠంలోనే పూజా మహోత్సవం చేయండి అవసరం ఉన్నవాళ్ళు వస్తారు,**

**లేనివారు పోతారు. మీకు వాళ్ళ ఇళ్ళకి పోవలసిన కర్మేమిటి** అని పట్టుపట్టారు.

పంతాలు పరవళ్ళు త్రొక్కాయి. చివరికి ఒక నిశ్చయానికి వచ్చి శ్రీగురులు ఇలా అన్నారు.

**కం॥ వచ్చెద మీమీ ఇండ్లకు**
**తెచ్చెద శుభకామనలను దీపావళికిన్**
**'ఇచ్చట' తగవులు మానుడు**
**మెచ్చరు 'బుధజనులు' ఎంచి మీ నడవడినిన్.**

అని మెత్తగా చీవాట్లు వేసి ఒక దివ్య మహిమ చూపారు. ఏడుగురు భక్తుల ఇండ్లలోనూ ఒకే సమయంలో ఏడుగురు శ్రీనృసింహ సరస్వతి స్వాములు కనిపించారు. మఠంలో ఉన్న శ్రీగురులు మఠంలో శిష్యులకు ఆనందమిస్తూనే ఉన్నారు.

మరునాడు అందరూ స్వామి పాదసేవకి వచ్చినప్పుడు అసలు విషయం తెలిసి భక్తులంతా ఆనందాశ్చర్యాలతో తలమునకలైనారు.



శ్రీగురులు నిత్యమూ సంగమంలో స్నానం చేసేటప్పుడు పర్వతుడనే భక్తుడు దూరంనుంచే వారికి సాష్టాంగ నమస్కారం చేసేవాడు. స్వామి మౌనంగా చిరునవ్వుతో ఆ వందనం స్వీకరించే వారు. ఒకరోజు ఉన్నట్లుండి **''నాయనా! ఎందుకిలా నాకు నమస్కరిస్తున్నావు నీకేం కావాలి''** అని ప్రశ్నించారు.

అతను **స్వామీ! నాకు మీపైన ఎనలేని విశ్వాసం ఉంది. ఈ ఏడాది మా కామందు నుంచి పొలం కౌలుకు తీసుకున్నను మీ అనుజ్ఞ అయితే పంటను కోసి నూర్పుతాను. మీ ఆజ్ఞకోసం ప్రాధేయపడుతున్నానన్నాడు.**

**అయితే రేపు పౌర్ణమినాడు స్నానానంతరం నీ ధాన్యం దిగుబడి చూస్తాను. పో నీపని త్వరగా కానీ అన్నారు.** వచ్చిన చిక్కేమంటే అతను కౌలు పత్రం వ్రాసిస్తే గాని కామందు పంట కోయనివ్వడు. నూర్పిళ్ళు అయ్యేముందు పంట చూసుకుని కాగితం వ్రాసుకుంటారు. అదంతా ఎప్పుడవుతుంది? పైగా పంట ఇంకా పూర్తిగా కాపు రాలేదు.



అచంచల విశ్వాసమంటేనే పర్యవసానం ఆలోచించని స్థిర నమ్మకం. ఆ రైతు భార్య, బంధువుల మాట వినలేదు. కామందు అడిగినంతకి కౌలు పత్రం వ్రాసిచ్చి అదే రోజు ఎట్లా ఉన్న పొలాన్ని అట్లా కోయించి నూర్పించాడు. పంట బస్తాలకెక్కించారు. కౌలుకు సరిపడే బస్తాలు కూడా రాలేదు. అతని భార్య కన్నీరు మున్నీరుగా విలపించింది. అతను మాత్రం **శ్రీగురులు నాకేమిస్తే అదే వస్తుంది** అన్నాడు.

మరునాడు పౌర్ణమి. అన్నవేళకు శ్రీగురులు అతని ఇంటికి వచ్చారు. **"నాయనా! ఎలా వుంది నీ పొలం దిగుబడి ఆ గదినిండా ఉన్నట్లుందే! తలుపు తెరచి చూపించు"** అన్నారు. దాదాపు కన్నీటితో తలుపు తెరిచాడు పర్వతుడు. ఆశ్చర్యం! గదినిండా ధాన్యం బస్తాలు క్రిక్కిరిసి ఉన్నాయి. అతని భార్య ఏడుస్తూ పశ్చాత్తాపంతో శ్రీగురుల కాళ్ళపై బడింది. పర్వతుని ఆనందానికి అంతేలేదు. శ్రీగురుని కృప ఉంటే సిరికి లోటేమిటి చెప్పండి. శ్రీగురులుండు గాణ్గాపురం దగ్గరలో భీమ, అమరజా



నదుల పవిత్ర సంగమం ఉన్నది. భీమ కృష్ణానదికి ఉపనది. అమరజానది అక్కడ సంగమిస్తుంది. అమరజానది పుట్టుకకు కూడా ఆ ప్రాంతీయులు నమ్మే ఒక పురాణ కథ ఉన్నది.

క్షీర సాగర మధనం తరువాత శ్రీమహావిష్ణువు మోహినీ అవతారంలో దేవతలకు అమృతం ఇచ్చి రాక్షసులకు దాన్ని దక్కకుండా చేశాడు. ఆ సమయంలో అమృత భాండం కోసం సురాసురుల మధ్య జరిగిన పెనుగులాటలో ఒక అమృత బిందువు నేలరాలి ప్రవహించి అమరజానది అయినదని పురాణ కథ. ఆ అమరజానది భీమా నదితో సంగమించే సంగమ స్థలంలో సంగమేశ్వరునిగా పరమేశ్వరుడు వెలిశాడు. ఈ స్వామికి శ్రీశైల మల్లికార్జునుని కున్నంత ప్రఖ్యాతి ఉన్నది. కాశీ క్షేత్రంనుంచి తెచ్చి ప్రతిష్ఠింపబడిన విశ్వనాధుని లింగము కూడా ఇక్కడ భక్తులకు ఎనలేని పుణ్యం ప్రసాదిస్తుంది. ఈ సంగమ క్షేత్ర దివ్యమహిమలను శ్రీగురులు ఎప్పుడూ భక్తులకు కథలుగా చెప్పేవారు.

అటువంటి సంగమానికి ఒకసారి రత్నాదేవి వచ్చింది. ఆమె పూర్వాశ్రమంలో శ్రీనృసింహ సరస్వతికి స్వయాన సోదరి. ఆమె తీవ్రమైన కుష్ఠు వ్యాధితో బాధపడుతూ స్వామిని చూచి రోదించింది. ఆమెతో శ్రీగురులు **తల్లీ! నీ గత జన్మలో తెలియక ఒక కుండలో నీరు నింపి అందులో ఒక పిల్లి తన కూనలను దాచుకుంటే ఆ 5 పిల్లి కూనల మరణానికి కారణమైనావు. ఇది నీకు ఆ పరమేశ్వరుడు విధించిన శిక్ష. తెలియక ముట్టుకున్నా నిప్పు కాలక మానదు కదా!** అన్నారు.

అయితే శ్రీగురులు పరమ దయాళువు గనుక ఆమెకు మూడు రోజులు భక్తి శ్రద్ధలతో సంగమంలో స్నానంచేసి సంగమేశ్వరుని అర్చించి పాపవిముక్తి కలిగించమని **శివాపరాధ క్షమార్పణ స్తోత్రం** చదువమన్నారు. ఆమె ఆ విధంగా పాప విముక్తి పొంది తన కుష్ఠువ్యాధిని పోగొట్టుకొన్నది.

ఒకప్పుడు వైఢూర్య నగరాన్ని (బీదర్) ఒక యవనరాజు పరిపాలిస్తుండేవాడు. అతను పూర్వజన్మలో



శ్రీగురుని భక్తుడైన ఒక రజకుడు. అపరిమిత భోగలాలసుడైన ఆ యవనరాజుకి తొడపై ఒక వ్రణం పుట్టి విపరీతంగా బాధించ సాగింది. ఎన్ని ఔషధములు వాడినా ప్రయోజనం శూన్యమైపోయింది.

అతను అవమానకరమైన ఆ రోగంతో శారీరకంగానూ, మానసికంగానూ క్రుంగిపోయాడీ విధంగా.

**ఉ॥ ఎన్నడు తూలనాడి బ్రతుకిచ్చిన తల్లిని**
**ఏడిపించితో**
**ఎన్నడు తండ్రినిన్ గురుని హేయపు రీతిని**
**తిట్టినాడనో**
**ఎన్నడు నమ్మువారలకు యెంచక ద్రోహము**
**చేసియుంటినో**
**ఎన్నడు చేసినట్టి కడుహీన అకృత్యపు**
**పాపమిద్దియో!**



ఒకరోజు ఒకయోగి ఆ యవనుని చూడవచ్చాడు. అతనికి తన ఆవేదన విన్నవించుకున్నాడు రాజు. అతన్ని ఓదారుస్తూ ఆ సన్న్యాసి ఇలా అన్నాడు. పూర్వం పింగళం అనే వేశ్యతో ఒక బ్రాహ్మణుడు సంసార జీవితం గడిపాడు. ఆ బ్రాహ్మణుడు వృషభ యోగి (ఈయన విష్ణుమూర్తి అవతారం) భక్తుడు. అతను వృషభుని వద్దకు వెళ్ళి పరమ భక్తి శ్రద్ధలతో పూజించాడు. ఆ పుణ్య ఫలితంగా అతను వజ్ర బాహుడనే రాజుగా జన్మించాడు. వేశ్య అతని పెద్ద భార్యగాను, బ్రాహ్మణుని భార్య ఆ వజ్ర బాహుని రెండవ భార్యగానూ జన్మించాడు.

పెద్ద భార్య గర్భవతి అయింది. అది సహించలేక ఆమె సవతి, విషప్రయోగం చేయడంవల్ల బిడ్డకూ ఆమెకు ఒళ్ళంతా కురుపులు చీముతో చాల అసహ్యంగా తయారు అయింది. అది చూచి రాజు భార్యను చీదరించుకుని ఆమెను ఇంట్లోంచి వెళ్ళగొట్టాడు. ఆమె అడవిలో బిడ్డతో పడరాని పాట్లు పడింది. చివరికి ఆమెను ఆమె బిడ్డను పద్మాకరుడనే రాజుకాపాడాడు. వారికి శరణిచ్చాడు.



అయితే ఆ కురుపుల వల్ల ఆమె బిడ్డ చనిపోయాడు. ఆమె కన్నీరు మున్నీరయింది. అప్పుడు వృషభ యోగి అక్కడికేతెంచి ఆమెకు పూర్వపు ఆరోగ్యమివ్వటమే కాక ఆమె బిడ్డను కూడా బ్రతికించారు. మహాత్ములకసాధ్యం అంటూ ఏమీ ఉండదు.

కావున **ఓయవనరాజా! నీవు తక్షణం శ్రీగురుని శరణు పొందుము. గాణ్గాపురంలో ఆయన నీవ్రణం తగ్గిస్తారు** అన్నాడా సన్యాసి. శ్రీగురుని చూడగానే ఆ యవనునికి తను పూర్వజన్మలో ఆయన భక్తుడైన రజకుడు అని గుర్తుకు వచ్చింది. ఆ తరువాత స్వామి దయవల్ల అతని పుండు నయమైంది. అతను భార్యాపిల్లలతో వచ్చి స్వామిని సత్కరించాడు.

కాలమెప్పుడూ మన మనుకున్నట్లు సాగదు. మంచిగాని చెడుగాని కలకాలం ఉండవు. పుట్టిన వాడు మరణించక తప్పదు. కదిలేది ఆగక తప్పదు. మరణించినవాడు మరల పుట్టుటా తప్పదు. అయినప్పటికీ

మనిషి మంచి జరిగితే ఉబ్బి తబ్బిబ్బై పోతాడు. చెడు జరిగితే ప్రపంచమే ఆగిపోయినట్లు దిగులు పడిపోతాడు. కలియుగ మహత్యమే అది.

ఇదివరకు మంచి కోసం గురువుని ఆశ్రయించేవారు. ఇప్పుడు స్వార్ధంతో ఆ మంచి తమ ఒక్కరికే జరగాలని గురువుల నాశ్రయిస్తున్నారు. స్వార్ధం ఎంత పెరిగిందంటే ఎవరన్నా ఈ గురువుగారి వెంట్రుక ఒకటి తావీజులో పెట్టుకుంటే మీ ఇల్లు బంగారం అవుతుందని 'పుకారు' పుట్టిస్తే నేటి శిష్యులు ఆ గురువులపై ఒక్క వెంట్రుక కూడా మిగలకుండా పీకేయగలరు. ఆశ, స్వార్ధం, మూర్ఖత్వం వేళ్ళూనిపోయాయి. ఒకరోజు అనుయాయులను పిలిచి శ్రీగురులిలా అన్నారు.



**సీ॥ మము గూర్చి లోకాన "మాన్వితుండని"**
**కార్చిచ్చు వలె 'వార్త' కమ్ముకొనియె**
**ధర్మంబు గలవారధర్మ పరులు గూడ**
**మఠమున కొచ్చేరు 'మంచి' కొరకు**
**ముస్లిము రాజులు మూగేరు తెలియుచు**
**కీడు తప్పించేటి వాడననుచు**
**సాధు జనులతోటి స్వార్ధపరులు జేరి**
**ఆశీస్సులాసించి ఆత్రపడిరి**

**ఆ॥ వచ్చి చేరి మాకు వ్రతభంగమును జేసి**
**పాడుచేయువారు మా సుకీర్తి**
**చేరి శివుని గొల్వ శ్రీశైలమునకేగి**
**గడుప దలచినాము కాలమచట.**

**ఇకపై వేము మా నివాసమును శ్రీశైలమునకు మార్చదలచాము. కానీ సాధు వర్తనులకు, మనోవాక్కాయ కర్మలా మమ్మే శరణుకోరే వారికి స్వప్న సాక్షాత్కారము**



**లందించి వారి కోరికలు తీర్చి వారికి మేలు చేసెదము.**

**ఇక మేము శ్రీశైల క్షేత్రానికి వెళ్తాము** అని చెప్పి తమ శిష్యులను భక్తులను దీవించారు. తమ పాదాలపై బడి రోదిస్తున్న వారిని ఓదార్చి **"నాయనలారా! నేనెక్కడ వున్నా అదృశ్యరూపుడనై ఈ సంగమానికి నిత్యమూ వస్తుంటాను. ఇక్కడ స్నానం చేసి ఈ మఠం దర్శిస్తాను. నన్ను నమ్మి ఇక్కడికి వచ్చేవారికి నా ఆశీస్సులిస్తుంటాను. నా ఈ పాదుకలను ఇక్కడే ప్రతిష్టిస్తున్నాను.**

**భక్తి విశ్వాసాలతో ఈపాదుకలను పూజించి మమ్ము స్మరించి హారతిచ్చి ఆ హారతి కళ్ళకద్దుకుంటారో, వారి కోరికలు నేను తప్పక తీరుస్తాను. నన్ను నమ్మిన వారిని నేనెన్నడూ విడిచి పెట్టను. ఇది శ్రీనృసింహ సరస్వతి వాగ్దానం** అన్నారు శ్రీగురులు.

ఆ తరువాత వారు శ్రీశైల క్షేత్రం చేరి శ్రీమల్లికార్జున స్వామిని పూజించారు. పాతాళగంగ దగ్గరకు పోయి అచట మారులూ, మాలతి, కల్హార, కమల పుష్పములతో ఒక చిత్రమైన పడవను తయారు చేశారు.



సరిగ్గా 'బహుధాన్య నామ సంవత్సరం (క్రీ.శ. 1459), శిశిరఋతువు, మాఘ బహుళ పాడ్యమి శుక్రవారం నాడు ఆ పూలపడవలో శిష్యులకు మౌనంగా ఆశీర్వాదాలిచ్చి కృష్ణానదిలో ప్రయాణిస్తూ తన నిజధామానికి తరలిపోయారు శ్రీగురులు అని పిలువబడే శ్రీనృసింహ సరస్వతి.

మ్రాన్పడిపోయిన శిష్యులంతా వారి ఆఖరి మాటలు మననం చేసుకుంటున్నారు. **"నాయనలారా! నేను లేనని వ్యధ చెందకండి. నేను మీతోనే ఉంటాను. ఈ గాణ్గాపురంలోని ఈ మఠంలోనే ఉంటాను. శ్రీమహావిష్ణువే తన అవతార పరిసమాప్తి అవుతుందనగా మౌనంగా నిష్క్రమించాడు. మహా భారత యుద్ధాన్ని ఒంటి చేత్తో నిర్వహించిన వాసుదేవుడైన శ్రీకృష్ణ పరమాత్మ బోయవాని బాణం దెబ్బకు ప్రాణత్యాగం చేశాడు. పదివేల సంవత్సరాలు సుస్థిర రామరాజ్యమందించిన శ్రీరామచంద్రమూర్తి సరయూ నదిలో మునిగి దేహత్యాగం చేశాడు.**

**కాని ఏనాటికైనా శ్రీరామ వ్రాయకుండా ఏ కార్యమైనా ఆరంభమవుతుందా? అలాగే శ్రీగురుడు కాలచక్రం ఆగిపోయేదాకా ఉంటాడు. కష్టకాలంలో నన్ను తలుచుకోండి మీముందు ఉంటాను".**

వారందరికీ నవ్యోత్సాహం వచ్చింది. మెల్ల మెల్లగా నదిలో కనుమరుగవుతున్న పూలతెప్ప వారి కళ్ళముందు నిలిచింది. ఈసారి దుఃఖం రాలేదు. ప్రత్యక్షమైన దైవం వరాలిచ్చి అదృశ్యమైతే కలిగే భావన తృప్తి కలిగాయి.

ఆ తరువాత కొంతమంది జాలరులకు శ్రీనరసింహ సరస్వతి పూలనావలో కనబడినట్లు వార్తలొచ్చాయి.

**"నాయనలారా నేనదృశ్యమయ్యాక నాలుగు రకాల పూవులు నదిలో తేలుతూ మీకు కనిపిస్తాయి. వానిని మీ నలుగురూ (నందకవి, సాయందేవుడు, నరహరి, సిద్ధముని) తీసుకోండి అవి మీకు అనంతమైన శుభములు కలుగచేస్తాయి** అన్న ఆయన ఆదేశం వారు పాటించారు. ఆ తరువాత దైహికంగా ఆ శ్రీ నృసింహ సరస్వతి ఎవరికీ కనిపించలేదు. కానీ కష్టాల్లో ఉండి తననే శరణు అనే వారిని ఆయన ఎప్పటికీ కాపాడుతూనే ఉంటారు.



**అవనికః**

ఎట్టకేలకు శ్రీగురుని చరిత్రలో అంతిమ అధ్యాయం వచ్చింది.

సిద్ధుడు ఈ విధంగా శ్రీగురు చరిత్ర ముగించి చిరు నవ్వు నవ్వి **నామధారకా! శ్రీగురుని నమ్ముకో నీకు శుభం జరుగుతుంది** అన్నాడు. ఆయన పద్మ నయనాలు కరుణ వెదజల్లుతూ వెలిగిపోతున్నాయి.

ఆ విధంగా శ్రీగురుచరిత్ర నాలకించిన నామ ధారకునికి ఒడలంతా పులకరించింది.

**చం॥ స్వరమతి గద్గదం బవగ సాగిలి మ్రొక్కెను**
**నామధారకుం**
**దరవిరి సౌరభం బెసగునట్టిది సిద్ధుని**
**ప్రేమ జల్లుగా**
**కురిసెను, శ్రీగురున్ తలచి కోరిక దీరగ**
**తాన్ స్తుతించె నా**
**చరితము నెన్నోమార్లు తను జ్ఞాపకమందున**
**దెచ్చి మేల్గనెన్.**





నామధారకుడు మనసంతా ఆనందం నిండిపోగా సిద్ధమునికి నమస్కరించాడు. ఆయన సంతోషంగా ఆశీర్వదించి ఇలా అన్నాడు....

**శ్రీగురు చరిత్ర తమ దయవలన విని పునీతుడనయ్యాను. శ్రీనృసింహ సరస్వతీ స్వామివారి కథ చెవులకు అమృత గానం వంటిది. అధర్మం పెచ్చుపెరిగి ధర్మం నశిస్తున్నపుడు ఆ శ్రీకృష్ణ పరమాత్మ అవతరిస్తానని గీతావాక్యం చెప్పాడు. ఆ మాట నిజం చేస్తూ ఆయన అవతారమైన దత్తగురుదేవులు ఎంతోమంది గురుపుంగవులవలె అవనిలో అవతరించి జ్ఞానబోధ చేసి భక్తులకు మోక్షమార్గం చూపారు. శ్రీగురులవంటివారు అవతరించబట్టే ఈ కర్మభూమిలో ధర్మం ఇంకా నిలబడగలిగింది.**

**ఇది భక్తి కావ్యం. దీన్ని భక్తి పూర్వకంగా శ్రీగురునికి శరణాగతులై చదివితే మీకోర్కె ధర్మబద్ధమైనదైతే తప్పక నెరవేరుతుంది. ఆ దత్తాత్రేయ స్వామియే దీనికి సాక్షి.**








# ౨. శ్రీ మాణిక్య ప్రభువు



## ప్రార్థన

కం॥ శ్రీ మాణిక్య ప్రభువుల
నీమాదిరి కొల్చినేను ఇంపగు రీతిన్
మీముందు వారి చరితను
సేమముగా నుంచి చదువజేతును వినతిన్.



## శ్రీ మాణిక్య ప్రభువు

శ్రీ దత్తాత్రేయ స్వామియొక్క చతుర్థ అవతారముగా యెంచబడుచున్న శ్రీమాణిక్య ప్రభువుల గురు చరిత్రము సర్వ పాపనివారకము, అఖిలశుభకరము.

వీరి పూర్వపు అవతారము శ్రీనృసింహసరస్వతి. కాని శ్రీగురు చరిత్రలో ఆ విషయము ప్రస్తావించబడలేదు. అయితే దత్తాత్రేయుని అయిదవ అవతారమైన శ్రీఅక్కల్ కోట సమర్థస్వామివారి జీవిత చరిత్రలో మాత్రము ఆ విషయము అనగా శ్రీమాణిక్యప్రభువు దత్తాత్రేయుని నాలుగవ అవతారమని చాలసార్లు పేర్కొనబడినది.

ప్రభువు అని వారిని పిలుచుటకు కారణము వారు ఒక దేశ ప్రభువు వలె 'దర్బారు' నిర్వహించి ప్రజల కష్టాలను విని పరిష్కారము సూచించుచూ వారి వేదన తీర్చేవారు.



వారు నివసించిన ప్రదేశము 'మాణిక్య నగరము' అని పిలువబడినది. నేటి గుల్బర్గా కల్యాణి, బీదరు నగరముల మధ్య బిందువును ఊహించిన అక్కడ ఒక త్రికోణాకారమున ఉన్న ఒక పర్వతము కలదు. ఆ పర్వతముపైన మాణిక్య నగరము కలదు.

మాణిక్య ప్రభువట్లు నివసించునని ప్రసిద్ధి గాంచిన ఒక కర్ణాటక యోగి 300 సంవత్సరముల క్రిందటే జోస్యము చెప్పిరట.

గుల్బర్గా నగర సమీపమున గుల్బర్గా కల్యాణి అను పట్టణమున్నది. అచ్చట మనోహర్ నాయక్ మరియు బయాదేవి దంపతులకు మూడవ సంతానముగా 22-12-1817 లో (ఈశ్వర నామ సంవత్సర మార్గ శిర శుద్ధ చవితి) మంగళవారము నాడు జన్మించారు మాణిక్య ప్రభువు. బాల్యమున వీరిని 'రత్న' అనే ముద్దు పేరుతో పిలిచేవారు. వారి తర్వాత ఒక సోదరి, ఒక సోదరుడు వారి తల్లిదండ్రులకు జన్మించారు.

**ఆ॥ నాలుగేండ్లవాడు నందనుడవగానె**
**చేసినారు 'వడుగు' సేమమెంచి**
**వారి తండ్రియంత పరమపదించిరి**
**పిన్నవయసులోనె కన్నుమూసి.**

బయాదేవి తన చిన్న చిన్న పిల్లలని పెట్టుకుని కళ్యాణి నగరంలోనే జీవితం వెళ్ళబుచ్చింది. అయితే చిన్నారి 'రత్న' అల్లరిగా, విద్యని గాలికి వదలివేసి స్నేహితులతో ఎప్పుడూ తిరుగుతుండేవాడు. ఆ దగ్గరలోగల అడవిలో పక్షుల కువకువలు వింటూ, రకరకాల జంతువులను చూస్తూ, కొండ గుహలలో ఏముందో చూస్తూ కాలం గడిపేవారు.

ఎవరేమన్నా అంటే "ఈ ప్రకృతే నాకుగురువు ఇది నేర్పే విద్య నేర్వడానికే ఒక జీవితకాలం చాలదు' అనే వారు. చిన్ననాటినుంచే 'అవధూత' తత్త్వం ఒంటబట్టింది వారికి. ఆ పిన్న వయసులోనే ఎన్నో లీలలను ప్రదర్శించారు శ్రీమాణిక్య ప్రభువు.



వారితో కలిసి ఆడుకునే చిన్నపిల్లవాడు ఒకరోజు హఠాత్తుగా చనిపోయాడు. తక్కిన పిల్లలంతా ఏడుస్తున్నారు. చిన్నారి మాణిక్ తన స్నేహితుని చెవిలో **"గోవిందా లే ఆడుకుందాం లేచిరా"** అన్నారు. కలగనేవాడు ఉలికి పడి లేచినట్లు అతను బ్రతికి వచ్చాడు. ఆ శవం చుట్టూ కూర్చుని రోదిస్తున్న బంధువులు నివ్వెరపోయి. ఎవరీతను అవతారమెత్తిన పరమాత్ముడా అని అనుకున్నారు. అందరికీ ఈ విషయం తెలిసి ఆ వార్త ప్రచారంలోకొచ్చింది.

మామిడిపండ్లు అమ్మే ఒక స్త్రీని చూచి ఆయన చిన్నతనంలో **ఓ అమ్మీ! నా స్నేహితులకి తియ్యని మామిడిపండ్లు తినటానికివ్వు ఎన్ని పండ్లిస్తే నీకంతమంది పిల్లలు పుడతారు** అన్నాడు. ఆమె పిల్లలు లేక దుఃఖిస్తుండేది. ఆ బాలునితో ఆమె **నీకు కావలసినన్ని తీసుకో** అంది. ఆ బాలుడు పదకొండు పళ్ళు తీసుకొన్నాడు.

ఐదుగురు పిల్లలు కలిగిన తరువాత ఆమె **"నాకిక**



**పిల్లలు వద్దు బాబూ"** అన్నది. 'తథాస్తు' అన్నాడు మాణిక్. విచిత్రమేమంటే కొద్దిరోజులకే ఆమె భర్త విగతజీవుడై ఆమెను వితంతువుగా మిగిల్చి చనిపోయాడు. 'బుద్ధిః కర్మానుసారిణి' అంటే ఇదేనేమో.

మాణిక్య ప్రభువు లీలలు అసంఖ్యాకమైనప్పటికీ కొన్ని ఉదహరించుకుందాం. హైదరాబాద్ నవాబు సైన్యాధికారి ఒకాయనుండేవారు. ఆయనపేరు అప్పారావు. ఆయన భార్య భీమాబాయి సౌశీల్యవతి. వారికి సంతానము లేదన్న చింత మనసున గుచ్చుకున్న ముల్లువలె బాధించుచుండెను. వారినోటా వీరినోటా మాణిక్య ప్రభువు గురించి విని ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలుసు, ఎందుకైనా మంచిది ప్రభువును చూచి ఆశీస్సులు పొందుదామని పతినభ్యర్థించి ఆమె ఒక పల్లకీలో 'మాణిక్య నగరం' బయలుదేరింది.

దారిలో తగవులాడుకొనుచున్న ఇద్దరు బాలురను చూచి ఆమె పల్లకీ నాపించి, దిగి, నాయనలారా!



చిన్నపిల్లలు ఆడుకోవాలి కానీ పోట్లాడుకోరాదు. కావలెనంటే ఈ పైకము తీసుకోండి అని వారికి ధనమివ్వబోయింది. వారిలో ఒక కుర్రవాడు తనకు పైకంతో పనిలేదు 'ఆడుకోటానికి' ఏమయినా ఇమ్మన్నాడు. ఆమె స్త్రీ గనుక అక్కడ ఉన్న సైనికుని పిలిచి ఎనిమిది గవ్వలనిప్పించి వాటితో ఆడుకోమన్నది. ఆ బాలుడు నీకూ ఆడుకోటానికి నేనిస్తాలే అని రివ్వున పారిపోయాడు.

ఆమె ఎట్టకేలకు మాణిక్ తల్లిని వారి ఇంటిలో కలుసుకొన్నది. కానీ మాణిక్ ఇంటిలో లేనందువల్ల ఆమె అక్కడే చాలాసేపు వేచి ఉన్నది.

చాలాసేపయిన తరువాత మాణిక్ వచ్చి ఆమెని చూచి, చూడనట్లు మరల ఆడుకొనుటకు పోబోయినాడు. ఈ కుర్రవాని నెక్కడో చూచినట్లే ఉన్నదని **'నాయనా! నేను నీకోసమే వచ్చాను'** అన్నది. ఆ బాలుడు కొంచెం చిరాకుగా ఇలా అన్నాడు.

**చం॥ ఎనిమిది మంది సంతతిని యిచ్చితినింకను**
**తృప్తి వీడుచున్**
**నను యిటు బాధవెట్టెదవు న్యాయమె ఓ జననీ!**
**యిదేమి? నీ”**
**వనుచు వచించు వాని గని ఆయమ యీతడు**
**గవ్వలన్ గొనెన్**
**మును యొక బాలుడై యనుచు ముందుగ**
**మాణికు గుర్తుబట్టెతాన్**

ఆమె అతనికి సాష్టాంగ నమస్కారం చేసి హైదరాబాద్ వచ్చేసింది. కాలక్రమేణా ఆమెకు ఎనిమిది మంది బిడ్డలు కలిగారు.

మాణిక్యప్రభువు జీవహింసని నిరసించేవారు. తన తోటి పిల్లలకు ఆటల్లోనైనా జీవాలను చంపరాదనేవారు. వారు పిల్లలతో ఆడుకొంటుంటే పిల్లవాడొకడు విసరిన



రాయి తగిలి ఒక రామచిలుక చెట్టుపైనుంచి క్రిందపడి మరణించినది. మాణిక్ దానిని చేతిలోకి తీసుకొని **“ఇక్కడ మనుష్యులున్నచోట తిరిగితే ఇలా రాళ్ళదెబ్బలే తగుల్తాయి. ఇకనైనా హాయిగా నీ అడవిలోకి పో ఆడుకో”** అని దానిని విసిరేశారు. అద్భుతం జరిగిందప్పుడు. అందరూ చూస్తుండంగానే ఆ రామచిలుక ‘రివ్వున’ అడవిలోకెగిరిపోయింది.

అరణ్యంలో ఆడుకొంటూ అకస్మాత్తుగా మాయమై మాణిక్ మూడు నాలుగు రోజుల తరువాత అకస్మాత్తుగా కనిపించేవాడు. ఒకనాడు కళ్యాణి సమీపమున గల కొండలలో ఆడుకొంటూ ఒక గుహలో ప్రవేశించారు. అక్కడ పులిగాండ్రింపు వినబడి తక్కిన పిల్లలంతా పారిపోయారు. కాని మాణిక్ లోపలికెళ్ళి చాలసేపుండి తరువాత నవ్వుతూ బయటకు వచ్చాడు. ఆ తరువాత ఏం జరిగిందని స్నేహితులు నిలదీస్తే ‘గాండ్రు’ మని పెద్దగా నవ్వాడు మాణిక్.



పదినేడు సంవత్సరాల ప్రాయము నాటికే మాణిక్ అసంఖ్యాకమైన ఆర్తులకు బాధలను తీర్చారు. అర్ధ కాములకు కామనలను తీర్చారు. జిజ్ఞాసులకు జ్ఞాలకూ కూడా జ్ఞానబోధ చేశారు.

ఆయన ఒకానొకప్పుడు ఒక గుహలో ఒక బైరాగిని కలిశారు. ఆ బైరాగి **‘నాయనా ఈ నా కుక్కపాలు త్రాగుతావా’** అని అడిగాడు. మాణిక్ స్నేహితులంతా ‘ఛీ! ఛీ!’ అన్నారు. మాణిక్ అలాగేనన్నాడు. అయితే నీకు మంచి ప్రసాదం పెడతాను రా అని ఒక ఎండిపోయిన రొట్టె, అక్కడే చచ్చిపడిఉన్న పాము పిల్లను కుక్కపాలతో కలిపి మెత్తటి ముద్దచేసి ‘తిను నాయనా!’ అని పెట్టాడు. నిస్సంకోచంగా ‘మహాప్రసాదం’ అని తిన్నాడు మాణిక్. వారి స్నేహితులు ముందు అసహ్యపడ్డారు. కానీ ఉన్నట్లుండి ఆ బైరాగి అదృశ్యమయ్యేసరికి నివ్వెరపోయారు.



ఆ బైరాగే శ్రీదత్తాత్రేయ స్వామి అని వారిచ్చిన ప్రసాదమే దివ్యజ్ఞానమని ఆ అమాయకులకేం తెలుసు? కేవలం మాణిక్య ప్రభువులకే తెలుసు. వారి మిత్రులకి త్రిమూర్తులను దర్శించే అదృష్టం లేదంతే మరి.

శ్రీమాణిక్య ప్రభు అన్నగారిపేరు దాదా మహారాజ్. ఆయనకూడ మహిమాన్వితులే. ఉపనయనమయ్యే వరకూ ఆ బాలుడు మౌనంగా మూగనోము పట్టాడు. ఆయన మారుతి అవతారమని భక్తులు విశ్వసిస్తారు. ఆయన మొదటినుంచి ఏకాంత ప్రియులే. ఆయనకు యుక్తవయసున వివాహం చేద్దామనుకుంటే సరిపడే ధనంలేకపోయింది. తల్లి ఎంతో వేదనతో వ్యాకులపడింది. వివాహం కావలసిన వరుడు నిర్వేదనగ ఉన్నాడు. కానీ మాణిక్ ఉత్సాహంగా పెళ్ళి ఏర్పాట్లు చేస్తూనే వున్నాడు. ముహూర్త సమయానికి ‘స్వామీ ఈ సరుకులు తీసుకోండి’ అని ఎవరో వచ్చి కావలసిన వస్తువులతో పాటు కొంత ధనం కూడా ఇచ్చి వెళ్ళారు.

శ్రీమాణిక్య ప్రభువుల తమ్ముని పేరు నృసింహ తాత్యా. అతనంటే వారికి ఎక్కువ అనురాగం. తల్లికి ఆ పిల్లవానికి ఉపనయనం చేయవలెనని సంకల్పం కలిగింది. ధన వస్తు సముదాయములు లేక ఇంట్లో శుభకార్యమెలా జరుగుతుంది. తల్లి బయాదేవి వ్యాకుల పడింది.

**ఉ॥ తమ్ముడు 'తాత్య' కున్ వడుగు తల్లిదలంచేను 'డబ్బు' లేదయెన్**
**అమ్మ విచారమున్ గనుచు అప్పుడె 'మాణికు' ఏకదంతునిన్**
**సొమ్ముకు ప్రార్ధనన్ సలుప సొమ్ములభించెను 'వేంకటప్ప'తో**
**కమ్మని విందు భోజనముకై తను ద్రవ్యము లిచ్చె వారికిన్.**



ఆ విధంగా తల్లి తమ్ముడు వడుగు చేయాలిరా మాణిక్యా! డబ్బెట్లా అనంగానే వేంకటప్పయ్య అనే నిస్సంతు సంతానం కోసం వారి ఆశీర్వాదానికి వచ్చి 400 మందికి భోజనానికి పైకం అడక్కుండానే ఏర్పాటు చేశాడు. మాణిక్య ప్రభువు చేసినదల్లా శ్రీవినాయకుని ప్రార్ధించటం అంతే.

తండ్రిలేని మాణిక్య కుటుంభాన్ని మేనమామే పోషించాడు. ఆయన లౌకికుడు. ఎలాగో మాణిక్‌నకు పన్నులు వసూచేయు శాఖలో ఉద్యోగం వేయించాడు. అయితే తను ఒకచేత్తో పన్నులు వసూలు చేసి ఇంకో చేత్తో బీదా బిక్కీకి దానం చేసేవాడు. దాంతో ఉద్యోగం పోయింది. కోపంతో మేనమామ ఇంట్లోంచి వెళ్ళగొట్టాడు. మాణిక్ విచారించలేదు సరికదా, స్వేచ్ఛ లభించిందని ఆనందించాడు. విశాల విశ్వంలో విఫంచిగా మారాడు మాణిక్య ప్రభువు.



నాలుగు నెలల తరువాత లోకమంతా వారి మహిమలను పొగడుతుంటే అందరూ ఇంటికి రమ్మన్నారు. కుటుంబ నిర్వహణ వంటి చిన్న చిన్న పనులు తమ మిత్రులే చేస్తారనీ భగవంతుడు తనకు నిర్దేసించిన పనులు ఇంకా చాలా ఉన్నాయనీ తనని కుటుంబం 'రొంపి' లోకి లాగవద్దని నిర్మొహమాటంగా చెప్పారు మాణిక్య ప్రభువు.

ఆయన మారుమూల ఏ అడవిలోనో, గుహలోనో ఉన్నా ఆర్తులు ఆయన్ని వెతుక్కుంటూ నానా కష్టాలు పడి వెళ్ళేవారంటే అది అనన్య సాధ్యం కాదు. అలాకొంత కాలం గడిచాక భక్తుల బలవంతం మీద కళ్యాణి నగరం తిరిగి వచ్చారు. భక్తుల సంఖ్య వేలకు పెరిగింది. అయితే వారితో మాట్లాడుతున్నా ఆయనకు సంగత్వం ఉండేదే కాదు. అంతర్ముఖులై యుండేవారు.

నాణానికి బొమ్మా బొరుసూ ఉన్నట్లే మానవుల్లో సన్మార్గులూ, దుర్మార్గులూ వుంటారు. పొత్తిళ్ళలో ఉన్న



ఏ పాపాయియైనా సన్మార్గే. కానీ పెద్దవుతున్నకొద్దీ సంగత్వం పెరిగి దుష్ప్రవర్తనచే ఆకర్షింపబడి దుర్మార్గులౌతారు. కొంతమంది ఆ ఆకర్షణకు లొంగక సన్మార్గంలోనే యుండి సజ్జనులౌతారు. ఇలా ఎందుకు జరుగుతున్నది? భగవంతుడు మనం చేసే మంచికీ చెడుకీ ఫలితంగా మనకు విధించిన కర్మఫలం యొక్క రూపాంతరమే ఆ మంచి చెడులు.

లక్ష్మణరావు అనేవాడు కళ్యాణిలోనున్న ఒక ధన మదాంధుడు. అతనికి మాణిక్య ప్రభువంటే సుతరామూ గిట్టేది కాదు. వారిని వీలు చిక్కినప్పుడల్లా అవమానిస్తుండేవాడు. తన సోదరిని మాణిక్ సోదరుడు నృసింహ తాత్యాకు ఇచ్చి వివాహం చేస్తాననీ కానీ వెయ్యి రూపాయలు సమకూర్చుకొని మాత్రమే తన వద్దకు రావాలని నిష్కర్షగా షరతు పెట్టాడతను. దానికి మాణిక్య ప్రభువంగీకరించారు. ముహూర్తం కూడా నిశ్చయమైనది.

ఆయనకు వెయ్యిరూపాయలు లభ్యం కావని లక్ష్మణరావు ధీమా. అతని కుత్సితం బాగా తెలిసిన మాణిక్

అతను చేసిన వివాహ నిశ్చయం – వెయ్యిరూపాయల మూల్యం, కాగితంపై 'కరారునామా' వ్రాయించారు.

కాని ముహూర్తం రేపుందనగా కూడా పైకం కానీ వస్తువులు కాని ఏర్పాటు కాలేదు. మాణిక్ తప్ప అంతా దిగాలు పడ్డారు. ఇంతలో బసవప్ప అనే షావుకారు పెండ్లికి కావలసిన సమస్తం సమకూర్చి వెయ్యిరూపాయలు రొక్కంకూడా అందించారు. లక్ష్మణరావుకు పెండ్లి చేయక తప్పలేదు. **"డబ్బెలా వచ్చింది అల్లుడూ!"** అని ఏడ్పు మొగంతో నవ్వుతూ అడిగిన లక్ష్మణరావుతో మాణిక్ హాస్యంగానే **"అంతా ఆ 'దత్తాజీ' లీల మామా! అన్నీ ఆయనే చూసుకుంటాడు"** అన్నారాయన.

ఈర్ష్యతో కుతకుతలాడిపోతున్న లక్ష్మణ్‌రావు పెళ్ళికి తనవైపునించి కనబడిన వాళ్ళనల్లా భోజనానికి 400 మంది అనుకుంటే వెయ్యికి పైగా పెళ్ళి విందుకు వచ్చారు. బయాదేవి చాలా కంగారు పడింది. కాని విచిత్రమేమంటే ఎంతమంది తిన్నా ఇంకా వంటకాలు మిగిలిపోయాయి.



అది ఆ మాణిక్య ప్రభువు లీలలని ఆ మూర్ఖుడు గుర్తించలేకపోయాడు.

వెనుకటికి శిశుపాలుడు శ్రీకృష్ణునిపై కత్తికట్టినట్లు లక్ష్మణ్‌రావు ఆయనని ఆడిపోసుకొంటూనే వున్నాడు. అతని మిత్రుడొకడు పదార్థములు చాలలేదనిపించాలని పొట్టలో ఖాళీ లేకుండా తిని విపరీతమైన కడుపు నొప్పితో వాపోతే మళ్ళీ మాణిక్య ప్రభువే దిక్కై తన అమృత హస్తంతో వారి పొట్ట నిమిరి వారిని బాధ తగ్గించారు. ప్రభువు లీల మరికొందరికి తనే తెలిపినట్లయింది.

ఒకసారి మాణిక్య ప్రభువిలా అన్నారు. **"ఈ కళ్యాణి నగరానికి చేటు దాపురించనున్నది. ఇక్కడ నివసించటం క్షేమకరం కాదు".** ఆయన అన్నట్లే ఆ నగరంలో దోపిడీ దొంగల భయం ఎక్కువయింది. అంటువ్యాధులు అంతు లేకుండా పెరిగిపోయాయి. నృసింహ తాత్యాకు అతని భార్యకు కూడా తీవ్రంగా కలరా సోకింది. తల్లి తనను తలుచుకొని రక్షించమంది. అక్కడ ప్రత్యక్షమై తాత్యా ప్రాణాల్ని ఆయన తీర్థం ఇచ్చి కాపాడారు.



అయితే విధి వ్రాతవల్ల అతని భార్య మాత్రం లక్ష్మణ్‌రావు ఇంట్లో ఉండడంవల్ల మరణించింది.

**కం॥ సోదరి మరణము కలచెను**
**సోదరునా లక్షణుండు సొక్కుచు వగచెన్**
**వేదనతో తన తప్పుకు**
**సాదరముగ 'ప్రభు' ను వేడి శరణము నొందెన్**

మాణిక్య ప్రభువు బోధలు హిందువులనే కాక ఎంతోమంది ముసల్మానులు ఆయన బోధలచే ఆకర్షితులై వారినాశ్రయించారు. ఇది మరికొందరు ముస్లిములకు కంటకింపయింది. వారిలో ఒకడు క్షుద్ర విద్యా ప్రవీణుడు. వాడు ప్రభువుపై క్షుద్ర ప్రయోగం చేశాడు. అవతారమూర్తిని ఆ క్షుద్ర విద్యలేం చేయగలవు? అది త్రిప్పి కొట్టి ఆ చేసిన ముసల్మానే చావు బ్రతుకుల్లో



అలమటించాడు. అప్పుడా ముస్లిముయొక్క తమ్ముడు మాణిక్యప్రభువుగారి దగ్గరకు వెళ్ళి ప్రాణ భిక్షపెట్టమని ప్రార్థన చేశాడు.

ప్రభువు వానికి స్వస్థత కలిగించి **"నాయనా! నీవు క్షేమంగా ఉండాలంటే నీవు ఎల్లప్పుడూ ఇతరులకు క్షేమం కోరుకోవాలి. అది భగవానుని శాసనం. ఇకనన్నా జాగ్రత్తగా వుండు. భగవంతునికి కులమత తారతమ్యాలు లేవు.** అని నీతి బోధ చేశారు.

మాణిక్య ప్రభువుల భక్తురాలొకామె పేరు జయమ్మ. ఆమె హైదరాబాద్‌లో తమ ఆప్తులైన యశ్వంతరావుగారి కుమార్తెను నరసింహ తాత్యాకు ఇచ్చి వివాహం చేద్దామని నిశ్చయించి వివాహమును కళ్యాణి నగరమున చేద్దామని ఆలోచించెను. కళ్యాణిని పరిపాలించి నవాబు పెళ్ళికి కావలసిన సామగ్రినంతా ఏర్పాటు చేశాడు. అత్యుత్సాహంగా వివాహ వేడుకల్లో పాల్గొన్నాడు. ప్రజలు ఆనందంగా ఆ వివాహ వేడుకల్లో తామూ పాలు

పంచుకొన్నారు. పట్టణమంతా వివాహ వేడుకతో నిండిపోయింది.

కళ్యాణ్ నగర సమీపమున 'బాలక్‌పురం' అను చిన్న పట్టణమొకటి వున్నది. అక్కడ వీరాంజనేయ స్వామి వారి దేవాలయమొకటి ఉన్నది. ఆ ప్రాంతంలో క్రూరమృగాల బెడద ఎక్కువ ఉండుట చేత ఆ గుడిపూజారి చీకటి పడకుండానే కార్యక్రమాలన్నీ ముగించుకొని ఇంటికి వెళ్ళిపోయాడు.

ఒకరోజు ఉదయం పూజారి ఆలయానికి వచ్చేసరికి స్వామి తలపై ఒక మూట ఉన్నది. తీరాచూస్తే అందులో పాతగుడ్డలూ, ఒక చెప్పుల జత ఉన్నాయి. దొంగల భయంనుంచి కాపాడే మారుతి ఒళ్ళో చెప్పుల జతా! పూజారి కోపంతో కంపించిపోయాడు. అక్కడే నిద్రపోతున్న ఒకతనిపై పడింది అతని చూపు. నిద్రపోతున్న అతనిని కర్రతో కొట్టిలేపి అతను చెప్పేది వినిపించుకోకుండా కర్రతో బాదడం మొదలెట్టాడు.



కొంతమంది అక్కడ గుమిగూడి పూజారి చేతుల్లోనుంచి అతన్ని విడిపించారు. అతను **"నేనూ దొంగల భయానికే గుళ్ళో దూరాను. నామూట భద్రంగా ఉంటుందని అదిగో ఆయన ఒళ్ళో పెట్టాను"** అన్నాడు. అప్పుడు అక్కడ చేరిన వారంతా గమనిస్తే ఆంజనేయస్వామి విగ్రహంపై కర్రదెబ్బల వాతలున్నాయి. అందరూ అవాక్కయ్యారు. కొందరా వ్యక్తిని గుర్తించారు. అతనెవరో కాదు మాణిక్య ప్రభువు. దానితో ఆయన ఆంజనేయ స్వామేనని అందరూ నమ్మారు.

ఆ ఆలయంకూడా ఎంతో ప్రసిద్ధి చెంది గుడి ఆదాయం పెరిగింది. కొత్త కొత్త దుకాణాలు వెలిసి జనాభా పెరిగి వ్యాపారమూ పెరిగింది. ఒక పట్టణమే వెలిసింది. హైదరాబాద్ నుంచి వచ్చిన రాజారావ్ అనే సంపన్నుడు ఇక్కడే ప్రభువుని కలిసి తన సంతానలేమి కొరతను చెప్పుకొని, అర్థించి వారి దయను పొందాడు. మాణిక్ ఇచ్చిన విభూతి గుళిక వల్ల అతని భార్య అతనికి పుత్రుని కన్నది. ముద్దులొలికే ఆ బాలునికి శంకరరావు అని



నామకరణం చేశారు. మాణిక్య ప్రభువు భక్తులైన శ్రీశంకర రావుగారి ముని మనుమల సంతానం ఈనాటికీ ప్రభువు భక్తులై వారి పూర్వీకుల భక్తికి సాక్ష్యంగా జీవించి ఉన్నారు.

మారుతిపై మాణిక్ వ్రాసిన ఒక స్తోత్రాన్ని ఈనాటికీ ప్రతి శనివారం మాణిక్య నగరంలో ప్రభువు ఆలయంలో చదువుతారు.

'బాలకి' అనే గ్రామంలో ఒక శివాలయం ఉంది. దాని పూజారిపేరు అరుణప్ప. అతని కడుపు నొప్పి వ్యాధిని శ్రీమాణిక్య ప్రభువు కేవలం కరస్పర్శ మరియు నువ్వులు కలిపిన పెరుగన్నం తినిపించి సరిగ్గా మూడు రోజులలో తగ్గించారు. అతని కోరికపై వారు అక్కడ ఒక 'గాది' (పీఠం) కూడా స్థాపించారు.

ఆ ఊరు 'బాలకి' లో ఇంకొక అరుదైన వింత జరిగింది. శ్రీమాణిక్య ప్రభువు భక్తుడొక బ్రాహ్మణుడున్నాడు. ఆయన కుటుంబంతో పాటు ఒకసారి మాణిక్య నగరం వెళుతున్నాడు.



**చం॥ అరుగుచు బ్రాహ్మణోత్తముడు ఆగెను 'బాలకి' గ్రామమందునన్**
**మరణమునొందె పుత్రుడని బావురుమంచని వేడె మాణికా**
**గురువును, కావగా తనదు కూరిమి పుత్రుని అంత వింతగా**
**తిరిగి తనొందె ప్రాణముల దీవెనలీయగ సద్గురుండు తాన్.**

ఆ సంఘటన వల్ల భక్తులందరూ తెలుసుకున్న సత్యమేమంటే శ్రీమాణిక్య ప్రభువుల సమక్షంలో ఆయన నిజభక్తులకి 'అకాల మృత్యువు' రాదు గాక రాదు.

నూట ఎనిమిది దివ్య తీర్థ కుండములున్న గ్రామము 'మైలారు'. అక్కడి ఖండోబా ఆలయం చాలా ప్రసిద్ధి పొందింది. తండోపతండాలుగా జనం వచ్చేవారక్కడికి. దురదృష్టం కొద్దీ అక్కడ ఒకసారి శీతల జ్వరం ప్రబలిపోయి

విపరీతమైన జననష్టం జరిగింది. దానివల్ల ఆ వూరు పాడుబడి నిర్మానుష్యం అయిపోయింది.

మాణిక్య ప్రభువు పూనుకుని ఆ ఖండోబా ఆలయాన్ని పునరుద్ధరించారు. వారిని దర్శించుటకు ప్రజలు తిరిగి రాసాగారు. నివాసాలు తిరిగి ఏర్పడినవి. మాణిక్‌ప్రభువు నుండి తీర్థము స్వీకరించి ప్రజలు తిరిగి ఉత్సాహంగా నివాసాలు ఏర్పరచుకొన్నారు. సుఖంగా జీవించారు. మైలారులో ప్రభువులు స్వయంగా తన చేత్తో మట్టి తీయగా ఒకచోట చక్కటి జల ఉబికుబికొచ్చింది. అది ఒక పెద్ద జలాశయమై 'మాణిక్య కుండ్' అని విఖ్యాతి గాంచినది.

అక్కడి ఖండోబాపై మాణిక్య ప్రభువు చాలా గీతములు రచించారు. నేటికీ ప్రతి ఆదివారంనాడు మాణిక్య నగరమున ప్రభువు సమాధి మందిరమున ప్రజలు భక్తితో ఆ ఖండోబా గీతములను భక్తితో పాడుతారు, సంకీర్తన చేస్తారు.



ఆరోజుల్లో 'సంగ్రామ రావుడు' అనే పేరుగల ఒక గొప్ప ధనికుడు 'చిటిగొప్ప' అనే గ్రామంలో నివసిస్తూ ఉండేవాడు. అతడు ఏదో తెలియని వ్యాధిగ్రస్తుడై శివకృపకోసం మహారుద్రాభిషేకం చేయించాడు. అతనికి కలలో శంకరుడు **'నీవు మాణిక్య ప్రభువు యొక్క పాద తీర్థము తీసుకో'** అని చెప్పాడు. అప్పుడు ప్రభువులు 'బాలకి' లో నుండిరి. అతనా గ్రామము చేరి ప్రభువును దర్శించగానే ఆయన **'నీకొరకే ఎదురు చూస్తున్నాను 'సంగ్రామా' శంకరుడు నీకొరకు వేచియుండమన్నాడు'** అన్నారాయన. ఆ వెంటనే తన పాదతీర్థమిచ్చి వానిని ఆరోగ్యవంతునిగా చేశారు.

ఆ తరువాత అతడు మాణిక్య ప్రభువులను సమస్త రాజలాంఛనాలతో 'చిటిగొప్ప' కు తీసుకొని పోయి తమ ఊరిలో 'అఖండేశ్వరు'ని ప్రతిష్ఠింపచేసి ధన్యుడయ్యాడు. అక్కడి లింగాయతులు బసవేశ్వరుని మాత్రమే కొలుస్తారు. వారుకూడా మాణిక్య ప్రభువులో బసవేశ్వరునే దర్శించారు.



ఆ సమయంలో 'సంగ్రామరావు' ఎంతో 'జమీ' ని (పొలంను) ప్రభువుకర్పించాడు. ఈనాటికి ఆ భూములు మాణిక్య ప్రభువుల సంస్థానము పేరునే ఉన్నాయి.

ఒక వైశ్య పరివారము కైలాస శిఖర యాత్రకు పోవుచుండగా దారిలో వారికి ఒక కపట భక్తుడు తారసిల్లెను. వారికి ఒక 'కుండమును' చూపించి ఇది శివుడే వెలయించిన 'రుద్రకుండము' ఇందులో దూకి తనువు త్యాగం చేసిన నేరుగా కైలాసవాసము సిద్ధించును కదా వేరే కైలాస శిఖరమునకు శ్రమపడి పోవటం ఎందుకని నమ్మించి వారిని ఆ కుండంలో దూకేట్లు చేసి వారి ధనం సంగ్రహించాడు.

కాని ఆ గుంపులోంచి ఒక వితంతు యువతి తప్పించుకొని పారిపోయి దారిలో మాణిక్ ప్రభువును చూచి వారిని గుర్తించి **"స్వామీ! నేను కూడా మావాళ్ళతో పాటు రుద్ర కుండములో దూకబోతుంటే" వద్దు, ఇక్కడి నుంచి పారిపో నీవు చేయవలసిన భగవత్కార్యాలెన్నో**



**ఉన్నాయి** అని ఒక దివ్య పురుషులు మందలించారు. ఆ దివ్య పురుషులు వేరెవరో కాదు. తమరే అని వారి పాదాలపై బడింది. ఆ తరువాత ఆమె సన్యాసినియై ఒక ఏడాది కఠోర సమాధిలో ఉండి ఎన్నో దివ్య శక్తులు పొందింది. ప్రభువులకు ప్రముఖ శిష్యురాలయింది.

శ్రీమాణిక్య ప్రభువులు పెక్కు తీర్థయాత్రలు చేసి ఆయా దేవతామూర్తులపై ఆయా చోట్ల ఎన్నో కీర్తనలు రచించారు.

వైద్యనాథ్ క్షేత్రములో వైద్యనాథేశ్వరునిపై ఆయన రచించిన స్తోత్రాన్ని నేటికీ మాణిక్యపురంలో ప్రభువుల సమాధి వద్ద ప్రతి సోమవారం భక్తులు గానం చేస్తారు. అదే సంప్రదాయం ప్రకారం నేటికీ అదేవిధంగా తుల్జాపురం భవానీ మాతపై ఆయన రచించిన కీర్తనలు ప్రతి మంగళవారమూ పఠిస్తారు.

ఒకసారి మాణిక్య ప్రభువులు పండరీపురం పాండురంగ విఠలుని సందర్శన కోసం బయలుదేరారు.

చంద్రభాగానది ఊటుగా ప్రవహిస్తూ ఒళ్ళు జలదరించేలా వున్నది. దరిదాపుల్లో ఒక్క పడవకూడాలేదు.

**చం॥ ఉరకలు పెట్టి పారినది ఉత్సుకతన్ నది**
**చంద్రభాగ, ఏ**
**తెరవు కనంగ రాదు నది దీటుగ దాటుట**
**కొక్క నావయున్**
**అరయక దైవప్రార్థనము నాగురు మాణికు చేసి**
**నంతనే**
**తరణకు నొక్క నావ తమ దాపుకు చేరెను**
**సంభ్రమంబుగా**

ఆ పడవ నడిపేవాడు మాట్లాడకుండా వారినీ వారి శిష్యులనూ నదిదాటించాడు. విచిత్రంగా ఆ నావ ఆ తరువాత కనిపించలేదు. ఏది ఏమయితేనేం మాణిక్య ప్రభువు పాండురంగ విఠలుని కోసం ఆ నది ఇసుక



తిన్నెలపై ఐదురోజులు గడిపి భజనలు చేసి ఆ స్వామిని కీర్తించారు.

తీరా ఆయన పాండురంగని దర్శించేసమయానికి ప్రభువులు మట్టికొట్టుకుపోయిన చింకి దుస్తులతో రోత పుట్టించేట్లున్నారు. ఆ గుడి అర్చకులు వారిని ఏవగించుకొని పోపొమ్మని కసిరి ఆయనని కొట్టి తోసేసారు. అప్పుడు ఒక అద్భుతం జరిగింది. విఠలుని కలంకరించిన నగలు చిందరవందర అయి కొన్ని తెగిపోయాయి కూడా. పాండురంగని విగ్రహం గజగజవణకటం అందరికీ స్పష్టంగా కనిపించింది. అర్చకులంతా అదిరిపోయి మాణిక్య ప్రభువు కాళ్ళపై బడి ప్రార్థించారు.

ఆ తరువాత ప్రభువులు దత్తాత్రేయుని దివ్యక్షేత్రం గిరినార్‌తో పాటు, కాశీ, ప్రయాగ, గయ, హరిద్వార్, గంగోత్రి, కేదారనాథ్, బదరీనాథ్, మమహాలీ, పూరీ జగన్నాథ్ దర్శించారు. అంత విస్తృత యాత్ర తదనంతరం



ఆయన తిరుపతి సందర్శించి ఏడుకొండలూ ఎక్కి తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని కనులారా వీక్షించారు. ఆయన శ్రీనివాసునిపై స్తోత్రములు కూడా రచించారు. ఆ కీర్తనలు ఈనాటికీ ప్రభువుల సమాధి దగ్గర ప్రతి శుక్రవారం భక్తులు సంకీర్తన జరుపుతారు.

తదనంతరం మాణిక్య ప్రభువులు గాణ్‌గాపురం, కొల్హాపురం, నరసింహవాడి, దర్శించారు.

శ్రీమాణిక్య ప్రభువులు ఆ తరువాత కేతకీ సంగమము దర్శించారు. అక్కడ ఒక అశ్వత్థ వృక్షం క్రింద తవ్వించి అంతవరకూ ఎవరికీ గోచరం కాని ఒక శివలింగాన్ని భూమిలోంచి త్రవ్వించి బయటకు తీయించారు. దాన్ని ప్రతిష్ఠించారు. దాన్ని పూజించటానికి కేతకీ పుష్పాలు కావాలన్నారు. అయితే ఎక్కడా శివుని కేతకీ పుష్పాలతో పూజించరు. పైగా ఆ ఋతువులో కేతకీ వృక్షాలు పుష్పించవు. కానీ మాణిక్య ప్రభువుల కసాధ్యం ఏముంటుంది?



ఎవరో పంపినట్లు ఒక లింగాయతుడు అక్కడకు వచ్చి ఒక మూటనిండా కేతకీ పూలను ఆయనకు సమర్పించి తన వివరాలే చెప్పకుండా వెళ్ళిపోయాడు. శివార్చన కేతకీ పూలతోనే జరిగింది.

కాశీలో వేదవిద్య బోధించే ఒక గురువర్యునకు తలలో నాల్కవలె ఒక శిష్యుడు ఉండేవాడు. దురదృష్టవశాత్తూ గురువు గారికి కుష్ఠువ్యాధి సోకి ఎన్ని వైద్యములు చేయించినా లాభం లేకపోయింది. కాశీవిశ్వనాథుడు ఆ శిష్యుని కలలో కనిపించి **నీకు గురువు ఋణం తీర్చుకునే అవకాశం లభిస్తుంది. పోయి కేతకీ సంగమంలో మాణిక్య ప్రభువు ఇచ్చే పాదాదక తీర్థం ఇవ్వు నీ గురువుకి నయమవుతుందని** చెప్పాడు.

ఆ బ్రహ్మచారి కేతకీ సంగమం వెళ్ళాడు. కాని చూడటానికి పిచ్చివానివలె ఉన్న మాణిక్ ఏం బాగుచేస్తాడని భావించి సమయం వృధా చేస్తూ అక్కడే గడిపాడు. కానీ ప్రభువును చూడలేదు. అతనికి ఆలయ శివలింగంలో మాణిక్ ప్రభువు కనిపించినా

ఊరకున్నాడేగాని ఆయన మహిమను తెలుసుకోనేలేదు. చివరికి ఒకరోజు అతనికి శివాలయంలో అశరీర వాణి వినిపించి **"ఓ మూర్ఖుడా! అక్కడ నీ గురువు ప్రమాదంలో ఉంటే ఇక్కడ నీవు మీనమేషాలు లెక్కపెడుతున్నా వన్నమాట. ఇప్పటికన్నా మాణిక్య ప్రభువుని చూస్తావా లేదా"** అని హెచ్చరించింది.

వెంటనే అతను లేచి ప్రభువు దగ్గరకు వెళ్ళాడు. మాణిక్ ప్రభువు అతన్ని చూసి కోపంతో చీదరించుకొని....

**కం॥ వచ్చితివేలర నువ్వీ**
**పిచ్చాడిని చూచి పొందు విత్తము గలదా?**
**మెచ్చువు నా ఈ వేషము**
**నచ్చుని నాకాళ్ళు బట్ట నయమగునటరా?**

అని ఎద్దేవా చేశారు. అది తన అలక్ష్యానికి తగిన శిక్షే అని గ్రహించి కన్నీటితో చెంపలు వేసుకొని తనను క్షమించమని తన గురువును రక్షించమని లేనిచో శిక్షగా తను ప్రాణత్యాగం చేస్తాననీ ఎలాగైనా వారిని రక్షించమని



కోరాడు. సజ్జనుల కోపం క్షణకాలమే నన్నట్లు, ఆయన శాంతించి అతనికి తీర్థమిచ్చి పంపారు. ఈలోపుగా ఇక్కడ గురువుగారిని ప్రమాద స్థితిని తప్పించారు ప్రభువు.

శ్రీమాణిక్య ప్రభువు కేతకీ సంగమం విడిచి స్వస్థలం చేరే ముందు అక్కడ ఒక 'గాదీ' ఏర్పాటు చేశారు.

ఒకసారి బీదర్ లోని ప్రభువుల శిష్యుడు వారిని మేనాలో తన పల్లెటూరునకు వారి నాహ్వానించి తెప్పించుచుండెను. సంజెవెలుగులో బోయీలు దారి తప్పారు. ఎక్కడినుంచి వచ్చిందోగాని ఒక పొడవాటి సర్పము తనతోకపై నిలబడి మాణిక్ ప్రభువులకు నమస్కరించింది. తరువాత బోయీలకు దారి చూపిస్తున్నట్లు వారి ముందుపోయింది. వారు ఆ సర్పాన్ని అనుసరించారు. వారు ఆపాము ఒక మహాత్ముడని భావించారు. ఆ సర్పము వారిని 'ఝరీ నృసింహ' మనే పర్వతం గుహదగ్గరకు తీసుకెళ్ళి అదృశ్యమైంది. ఆ గుహ చీకటిగా ఉంది. మొలలోతు నీళ్ళతో నిండి ఉంది. నీటి



గుంట పొడవు '700' అడుగు. ఆ గుహ చివర నరసింహస్వామి విగ్రహం ఉంది.

ఇంతకీ మాణిక్ ప్రభువు అక్కడికి ఎందుకెళ్ళారంటే ఆ నరసింహ స్వామిని అక్కడ ప్రతిష్ఠించినది వారి ముత్తాతగారే. ఆ ముత్తాతగారు అక్కడ తపస్సు చేసేవారుట. ప్రభువు ఆ స్వామిని భక్తితో అర్చించారు.

బీదరుకు చెందిన పలువురు వ్యాపారస్థులు మాణిక్ ప్రభువును విందు భోజనమునకు పిలిచిరి. అందరూ తమ ఇంటికే రావలెనని పట్టుబట్టిరి. అట్లాగేనని చెప్పి ప్రభువులు ఎవ్వరి ఇంటికినీ పోక హాయిగా నిద్రబోయిరి. విందు సమయమైనది. శిష్యులకు కంగారు హెచ్చినది. కాని వారిని నిద్రలేపుటకు జంకిరి. మరునాడు విందు కాహ్వానించినవారందరూ వచ్చి ప్రత్యేకముగా తమ ఇంటికి విందుకు వచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపి పాదాబివందనం చేశారు. ఆ వింత ఏమిటో అర్థం గాక అందరూ తెల్లబోయారు. వారి మహిమ తెలిసిన వారు మాత్రం వారి విభూతికి (మహిమకు) జేజేలు పలికారు.



బీదరుకు చెందిన ముస్లిములు వారిని విందుకు పిలిచి లోన మాంస భక్ష్యములుంచి పైన వస్త్రము కప్పి ఒక పళ్ళెమును ప్రభువులకు అర్పించిరి. భుజించు సమయమాసన్నమవగా మాణిక్య ప్రభువు శిష్యులను పిలిచి **'నాయనలారా! ఆ వస్త్రము తీయండి ఈ నా ముస్లిము భక్తులు పెట్టిన ఆహారము భుజింతము** అనిరి. శిష్యులా వస్త్రమును తీసివేయగానే పళ్ళెరములో రకరకములైన తాజా ఫలములున్నాయి.

అవమానింప దలచిన తుంటరులు వారికాళ్ళపై బడి క్షమాభిక్ష వేడిరి. "పిరాన్ పీర్ దస్తగిర్" అనే బిరుదునిచ్చి ఆయనను కీర్తించారు. బీదర్‌లో ముస్లింలు ఎక్కువగా నివసించు స్థానముననే ప్రభువులు తమ "గాదీ" ని నెలకొలిపారు. దైవాంశ సంభూతులైన వారికి జాతిమత పట్టింపులుండవు. మిడి మిడి జ్ఞానంగల వారే అర్థంలేని మత విద్వేషం కలిగియుంటారు. దివ్యపురుషులకు మానవులంతా ఒకటే. ఆయన అందరికీ దివ్య బోధచేసేవారు.

**ఆ॥ మతము మతము అనుచు మతిలేని మాటేల?**
**నీతిలేని మతము జేతువేమి?**
**జ్ఞానమీయలేని చదువు వ్యర్థము కదా!**
**పేరు వేరుకాని 'పరమ' మొకటె.**

మతం మతం అంటూ మతిలేకుండా మాట్లాడవద్దు. నీతిలేనప్పుడు (సత్ప్రవర్తన లేకుండా) మతాన్ని ఏం చేసుకుంటావు? చదువు అంటే జ్ఞానం ఇవ్వాలి. భగవంతుని తత్త్వం చెప్పాలి. లేకపోతే ఆ చదువు నిరుపయోగం కదా. మోక్షం ముస్లింకైనా, హిందువుకైనా (క్రిష్టియనుకైనా) ఒకటే కాని పేరు మాత్రం వేరు అంతే. హిందువు స్వర్గం అంటాడు. ముస్లిం దాన్నే జన్నత్ అంటాడు. కాని వేరు వేరు చోట్లు ఉంటాయా? ఉండవు. ఎందుకంటే అల్లా అన్నా 'హరి' అన్నా ఒక్కరే కనుక.

తదుపరి కొంతకాలమునకు 'మాణిక్య ప్రభువు' లు బీదర్ నుంచి తన నివాసము మాణిక్య పురమునకు మార్చారు. తన పరివారమును ముందుగా ఆ చోటుకు పంపివేశారు. వారు 'మేనా' లో ప్రయాణం చేస్తుండగా



హుస్నాబాద్ సమీపించగానే దట్టమైన అడవి ప్రాంతం తారసపడింది. అడవి చెట్ల తీగెలలో మేనా చిక్కుకు పోయి ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడింది.

ప్రభువులు మేనా దిగి సమీపంలో గల ఒక బిల్వవృక్షం క్రింద సేదతీరుతున్నారు. విచిత్రముగా మేనా ఆగిన ప్రదేశంలో ప్రభువులు ఒక నగరం నిర్మింపచేసి అది తన నెలవుగా ప్రకటించారు. ఆ నగరము పేరే మాణిక్య పురము అని నిశ్చయించిరి. ఇది త్రికోణాకారమున గుల్బర్గ కళ్యాణి బీదర్‌ల మధ్యనున్న మణిమాల అను రమణీయమైన పర్వతముపై ఉన్నది. ఆ పర్వతమునే కొందరు వృషభాద్రి అని కూడా అంటారు.

ఈ ప్రాంతంలో మూడు భాషలు మాట్లాడే ప్రజలు నివసిస్తుంటారు. మరాఠీ, కన్నడ మరియు తెలుగు భాషలు ఈ ప్రాంతంలో మాట్లాడతారు. "నానాగోత్రేభ్యః" అన్నట్లు ఎక్కడయితే విభిన్న సంస్కృతులూ కలుస్తాయో అక్కడ సంస్కృతి సంకరమవుతుంది. వారు ఏ ఆచారము పాటించని నాస్తికులవుతారు. ఒక ముస్లిం, హిందూ



వనితను వివాహం చేసుకుంటే జరిగే నష్టం ఏమిటి? వారిద్దరికీ ఒకరి సంస్కృతిని ఇంకొకరు గౌరవించగల ఔదార్యం ఉంటే (కలకాలం ఉండాలి) ఏ నష్టమూ లేదు.

కానీ సంస్కృతి ఒకనాటితో వచ్చేది కాదు. ఒకనాటితో పోయేది కాదు. అందుకనే ఎవరి సంస్కృతి వారికి గొప్ప. అదే ఇంకొక సంస్కృతిని కించపరచి మత ద్వేషానికి పునాదులు వేస్తుంది. అటువంటప్పుడే మాణిక్య ప్రభువులాంటివారు, ఆవిర్భవించి, జ్ఞానబోధ చేసిమత సామరస్యం ఏర్పరుస్తారు. లేనిచో మానవ జాతి ఏనాడో అంతరించిపోయేది.

శ్రీ మాణిక్య ప్రభువుల తల్లి, సోదరుడు, సోదరి కూడా వారికి సహకరించిరి. మొదట మాణిక్య నగర నిర్మాణము ఒక కుటీరంతో ప్రారంభమైనది. గురువులు ఒక 'గాదీ' నక్కడ నిర్మించి 'దత్తాజీ గాదీ' అని దానికి పేరు పెట్టారు. అందులోనే మాణిక్య ప్రభువులు తమ దర్బారు నిర్వహించేవారు.



ఇంకొక కుటీరము "బండారు ఖానా" (పాకశాల లేక వంటగది) అందులో కాలాంతరమున భక్తులు వేల సంఖ్యలో భుజించు వసతులేర్పడినవి. ప్రభువులు మాత్రం 'హుస్నాబాద్' లో 'మధుకర' వృత్తితో లభించిన పదార్థములనే 'గాదీ' కి నివేదన చేసి భక్తులకు పెట్టేవారు. ఒక చిన్న రొట్టెముక్క మూడు రోజులకొక పర్యాయం తినేవారు. భక్తులు ఎన్ని మధురాన్నము లిచ్చినా తాము తినక భక్తులకే ఇచ్చేవారు.

ఆయన గాదీపై కూర్చొని ఎన్నో దివ్య బోధలు చేసేవారు. ఆత్మానంద స్థితిలో ఆయన మాట్లాడుతుంటే కర్ణపేయంగా ఉండేది. బంగారు జరీవున్న దుస్తులు ధరించి, బంగారు నగలు ధరించి, బంగారు ఛాయతో మెరిసి పోతున్న వారిని చూడటానికి రెండు కన్నులు చాలేవికావు. ఒక్కొక్కప్పుడు ఫకీరు వేషము ధరించి ముస్లిం భక్తుల ఆవేదన వినేవారు. భర్తలు తోడులేని వైవాహిత స్త్రీలను చూచేవారు కాదు. వారి భక్తురాలు 'వెంకమ్మ' అను నామె ఆ వనితల కష్టాలు విని స్వామికి నివేదిస్తే

ఆమె ద్వారానే పరిష్కారాలు సూచించేవారు. కానీ నేరుగా స్త్రీలను దర్శించేవారు కాదు.

ఆయన గాదీపై కూర్చొని ఎన్నో దివ్యబోధలు చేసేవారు. ఆత్మానంద స్థితిలో ఆయన మాట్లాడుతుంటే కర్ణపేయంగా ఉండేది. బంగారు జరీవున్న దుస్తులు ధరించి బంగారు నగలు ధరించి బంగారు ఛాయతో మెరిసిపోతున్న వారిని చూడటానికి రెండు కన్నులు చాలేవి కావు. ఒక్కొక్కప్పుడు ఫకీరు వేషము ధరించి ముస్లిం భక్తుల ఆవేదన వినేవారు.

భర్తలు తోడులేని వైవాహిత స్త్రీలను చూచేవారు కాదు. వారి భక్తురాలు 'వెంకమ్మ' అను నామె ఆ వనితల కష్టాలు విని స్వామికి నివేదిస్తే ఆమె ద్వారానే పరిష్కారాలు సూచించే వారు కానీ నేరుగా స్త్రీలను దర్శించేవారు కాదు.

వారు దర్బారు నిర్వహిస్తుంటే స్వయంగా శ్రీదత్తాత్రేయులే నిర్వహిస్తున్నట్లుండేది. ఒకే సమయమున అటువేదపండితుల వేద ఘోష వినేవారు, ఇటు శాస్త్ర



చర్చలలో సలహా లిచ్చేవారు, ఇంకొక చోట నృత్య సంగీత కచేరీలలో పాల్గొనేవారు.

వెండి పొన్నుకర్రలు ధరించిన సైనికులు పహారీ చేసేవారు. సిపాయిలుండేవారు. దర్బారున ఉపన్యాసకులు ఎందరెందరో వేదాంత చర్చలు చేసేవారు. హరిదాసులు హరి కథలు గానం చేసేవారు. గృహస్థులు, గోసాయిలూ, ఫకీర్లు సాధువులు అసంఖ్యాకంగా వారిని దర్శిస్తుండేవారు.

**చ॥ తనువును వీడు వారు 'చని' దైవము జేరిన**
**ఆ విశాలమౌ**
**ఘనమగు స్వర్గధామమున గాంతురె ఎక్కుడ**
**తక్కుడంచు, వే**
**దన కలిగించు భేదములు! తప్పు, ఇవన్నియు**
**అల్పయోచనల్**
**మనమున 'ప్రేమ', ఈశ్వరునిపై తగు నమ్మిక**
**చాలు ముక్తికిన్**



అయితే ఇలా తత్త్వ బోధ చేస్తున్నా జరుగుతున్నా ఎక్కడ ఏదన్నా చిన్న పొరపాటు జరిగితే ఇది తప్పు సరిదిద్దుకోండి అని వారిని సరిదిద్దేవారు. ఆయన దర్బారులో ఏ కులస్థుడైనా ఏ మతస్థుడైనా ఏజాతివాడైనా ఏ వయస్సు వాడైనా ఏ స్థితిగతులున్నవాడైనా అందరూ సమానమే. అందరికీ ఆయన అనుగ్రహం సమానంగా కలిగింది.

అన్ని మతముల పరమార్థము ఆ పరమాత్మ ప్రాప్తే అయినప్పుడు దారి ఏదైనా పరమాత్మను చేరటమే ముఖ్యం కదా అనేవారు. శుద్ధ చైతన్య స్వరూపమే ఆత్మ రూపుడైన దైవము. ఎవరి నమ్మకం కొద్దీ వారు ఆ దైవాన్ని తమకి నచ్చిన పేరుతో ధ్యానించవచ్చును. ఏమంత్రం జపించినా చివరికి పొందేది ఆ సర్వేశ్వరునే. శ్రీదత్తాత్రేయుడుగా భావించి ప్రభువును కొలిచినా దొరికే సన్ముక్తి ఒక్కటే.

ఆ స్ఫూర్తితో ఆయన 'ఆత్మరూప ప్రతీతి' అనే గ్రంధాన్ని రచించారు. ఒకనాడు తుకారా అనే గొల్లవాడు



'స్వామీ! నా బోటి వాడు ఆ గ్రంథం చదువలేడు కదా! మరి నాకు ఆత్మ సాక్షాత్కారం ఎలా? అని సూటిగా ప్రశ్నించాడు. నాయనా! అటువంటి వారు గురువునే శరణంటే చాలు అన్నారు. వాడు వెంటనే స్వామి! శరణు నాకు ఆత్మ సాక్షాత్కారం కలిగించండి అన్నాడు. ప్రభువు వానికి తనజోలెలోని ఆహారాన్ని ప్రసాదంగా ఇచ్చి వాడి కంబళిని కప్పుకోమని చెప్పి అతనిని నాశీర్వదించగానే వానికి బ్రహ్మానంద ప్రాప్తి కలిగెను. అదే గురుకృప అంటే.

మాణిక్య ప్రభువు తండ్రిగారి మిత్రుడొకరు తనకు మోక్షమిప్పింపమని ప్రాధేయపడగా దానికి ఆశ కోరికలను త్యజించాలి. నీకున్న సర్వస్వం బీదవారైన నీ బంధువులకిచ్చి వేయగలిగిన తరువాత తనకు కనిపించమన్నారు. అతడట్లే చేసి 'ఇప్పుడు నాకే బంధమూ లేదు ఇకముక్తి నిప్పించండి' అన్నాడు. ఓ విశ్వ బ్రాహ్మణుడా! ఏ బంధము మీదా అనురక్తిలేక ధ్యానంలో ఉండటమే మోక్షమంటే. వాడినే జీవన్ముక్తుడంటారు.

"ఇక నువ్వు కోరేరి శారీరకమైన ముక్తి. అది నీవు నేను ముక్తుడను నాకు ఈ దేహం అనవసరం అని తీవ్రంగా అనుకో గలుగుతుంది" అన్నారు. అతడట్లే చేయగా బ్రహ్మరంధ్రం నుండి ప్రాణం వెలువడి మరణించి మోక్షం పొందాడతడు.

శ్రీమాణిక్ ఇంకొక అసాధ్యమైన మహిమ జూపారు. అరువది సంవత్సరములున్న ఒక స్త్రీ ఋతు క్రమం ఆగిపోయి భర్త అనుమతితో, తననెలాగైన పుత్రవతిని చేయమని ప్రభువును ప్రార్థించింది. కాని గురువు ఏ స్త్రీ అయినా తన ఋతుక్రమం ఆమెకు దానం చేస్తే ఆమె కోరిక నెరవేరుతుందన్నారు. కాని అటువంటి దానం చేయటానికి ఎవరు అంగీకరిస్తారు. ప్రభువుల శిష్యురాలు వెంకమ్మ ముందుకు వచ్చారు. అప్పుడు ఆమె ఋతుక్రమం ఆవృద్ధురాలికి బదిలీ చేయించి ఆమె గర్భవతి అయ్యే అదృష్టం కల్పించారు. పుత్ర సంతానం పొందిన ఆమె ఆనందం వర్ణనాతీతం. ఆమె ప్రభువుల కాళ్ళు ఆనంద భాష్పాలతో కడిగింది.



హైదరాబాద్ నవాబు ఒకసారి ప్రభువుకి లేఖ పంపాడు. మీరు నన్ను దర్శించిన మీకు ఒక జాగీరు నిచ్చి సత్కరించెదమని దాని సారాంశము. దానికా ప్రభువులు ఈ విధంగా తన తిరస్కృతి నెరిగించారు. నేను ఫకీరును. జాగీర్లేమి చేసుకుంటాను. నేను మీ రాజ్యంలో ఉండుటయే మీ రాజ్యమునకు రక్ష. ఈ బ్రహ్మాండమంతయూ నా ప్రభుని జాగీరు. ఇక మీరు నాకిచ్చేదేమిటి? మీకు ఆ సర్వాంతర్యామి నుంచి ఏమన్నా కావాలంటే నన్నడగండి ఇప్పిస్తాను. ఆ తిరస్కారంతో నవాబు ఆయననెన్నడూ కలువలేదు. ఆయన జోలికే పోలేదు.

అందరికీ అనుభవమే అయినా ఎన్నడూ ఎవరికీ అర్థం కానీ ఒక అద్భుతం మాణిక్య ప్రభువు చేసేవారు. తనదగ్గరికి వచ్చి ధన సహాయం కోరేవారికి, తను ఆనుకుని కూర్చునే 'దిండు' క్రింద చెయ్యిపెట్టి ఎంత అవసరముంటుంది నీకు అని అడిగి వారు అడిగినంత డబ్బు తీసి ఇచ్చేవారు. ఎవ్వరూ ఆయన్ని అత్యాశతో



అడగరు. అడిగితే ఆయన ఇవ్వరు. అన్నిటికంటే వింతేమిటంటే ఆ దిండు క్రింద ఇతరులెవరికి ఒక్క రూపాయి కూడా దొరికేది కాదు.

భద్రాచలం రామదాసుగారిలాంటి అనుభవం నవాబుగారి పాలనలో ఇంకొకటి జరిగేదే కానీ మాణిక్య ప్రభువుల దయవల్ల నవాబు గారికి తనకు రావలసిన పైకం దక్కింది. ఒకసారి ప్రభువుల భక్తుడైన అప్పారావు అనే బాలకి తహసిల్దారు నవాబుకు 'జమ' చేయాలిసిన ధనము పదివేల రొక్కమును మాణిక్ గారి భక్తులైన పేద ఫకీర్లకు పంచిపెట్టాడు.

తహసీల్దార్ కటకటాల వెనక్కి వెళ్ళేవాడే కానీ ఎక్కడి నుంచి వచ్చిందో పదివేల రూపాయలకి 'హుండీ' హుస్నాబాద్ నవాబ్ పేరున వచ్చింది. అదెలా వచ్చిందో అచ్చారావు గారికి తెలియదు. కానీ 'ప్రభువు' దయవల్ల అతని ఉద్యోగం నిలబడటమే కాక ఆయనకి ఉద్యోగంలో ప్రశంశ కూడా దక్కింది.

ఆ కాలంలో మాణిక్య ప్రభువుల భక్తులంతా



ఆయనని ముక్త కంఠంతో ఇలా ప్రార్థించేవారంటే ఆశ్చర్యమేముంది?

**కం॥ నీవే శరణము నాకిక**
**రావా మాణిక్య ప్రభువ రక్షింపంగన్**
**నీ వారమనుచు వేడిన**
**నీవే 'కరిగాచు హరిగ' నిలుతువు దేవా!**

ఒకనాడు ఒక బ్రాహ్మణుడు మాణిక్య ప్రభువులను కలిసి తనకు 400 రూపాయలిప్పించిన వివాహము చేసికొందునని అర్థించెను. దానికి ప్రభువులు తలవూపి మౌనం వహించారు. అయ్యో! ప్రభువు ఔననలేదని ఆతడు చాల విచారించి ఏమీ అనలేక మౌనంగా బాధపడ్డాడు.

కొన్నాళ్ళకు ఆ బ్రాహ్మణుని ఒక సర్పం కాటు వేయగా అతను మరణించాడు. ప్రభువు శిష్యులతని శవాన్ని ప్రభువు దగ్గరకు తెచ్చి 'స్వామీ! ఇతను మీరు ధనమీయలేదని ఎంతో దుఃఖించాడు. పాపం ఇలా దిక్కులేని చావు చచ్చాడని సానుభూతి చూపించారు. ప్రభువు ఆ సర్పాన్ని ఇదేంపని? నువ్వు నాముందుకు

రా! అని గద్దించారు. ఎక్కడినుండి వచ్చిందో గాని ఆ సర్పం ప్రభువుముందు దోషిలా నిలబడింది, ఆయన దర్బారులో మాణిక్య ప్రభువు ఆ సర్పాన్ని ఇలా మందలించారు.

**మ॥ తగునే! ఇవ్విధి హాని జేయనగునే దాక్షిణ్య**
**మున్ వీడి, ప**
**న్నగ రాజేంద్ర! ధరిత్రి మానవులు నిన్ నాగేంద్రు**
**గా గొల్తురే!**
**పగతో కాటును వేసి చంపితివి యీ బాపండు**
**నిర్దోషి, ఈ**
**నగుబాటైన ప్రయత్నమాపు మికపై నా భక్తులన్**
**వీడుమా.**

సిగ్గుతో తలదించుకుని నేరస్తునివలె ఆ సర్పం వెళ్ళిపోయింది. అప్పుడు ప్రభువులు ఖర్జూరపు కాయ నొకదానిని తెప్పించి తమరి నోటికి తాకించి ఒక శిష్యుని చేత ఆ ఖర్జూరపు గంధం తీయించి మృతుని నోటిలో



పోయమన్నారు. అతనా విధంగా చేయగానే ఆ బ్రాహ్మణుడు బ్రతికాడు.

ప్రభువాతనితో "నాయనా! వివాహం గురించి నిన్ను ప్రోత్సహించనిదిందుకే. నీ భార్యకు ఒకవేళ వైధవ్యము ఆ సర్వేశ్వరుడు నిశ్చయించి యుంటే నేనేం చేసినా నువ్వు బ్రతికే వాడివి కాదు. ఆయన త్రికాలజ్ఞులని గుర్తించి ఆయన కాళ్ళపైబడి మన్నింపు కోరి ఆయనిచ్చిన ధనంతో ఒక ఇంటివాడయ్యాడతను.

తుల్జాపురం భవానీదేవి భక్తుడొకడు ఆ మాతకు చీరె రవిక ముడుపుగా చదివిస్తానని మ్రొక్కుకున్నాడు. ఆ దేవి అతని కలలో కనబడి ఆ ముడుపు మాణిక్య ప్రభువుకు సమర్పించమని చెప్పెను. ఆ గ్రామీణుడు అది అర్థంలేని కల అని పట్టించుకోలేదు. ఆ దేవి తనమందిరంలో ఒక పూజారికి కలలో కనిపించి నీవు పోయి ఆ గ్రామీణుని మందలించమని చెప్పెను. అతనట్లా చేయగా ఆ గ్రామీణుడు ప్రభువులను దర్శించెను. కాని పురుషుడు



ఈ చీరెతో ఏమి చేయును భవానీమాత ఉద్దేశ్యమేమో బోధపడుటలేదు అనుకొనెను.

అయితే మాణిక్య ప్రభువును దర్శించిన ఆ గ్రామీణుడు అవాక్కయినాడు. ఎందుకంటే అతని కనులకు ప్రభువులు మందస్మితయైన భవానీ మాతలాగా గోచరించారు.

'పుట్టి'నది ఏదయినా 'గిట్ట'క మానదు. జన్మ ఎత్తిన వానికి చావు తప్పదు. ఇది సృష్టిధర్మం. ఆ సర్వేశ్వరుడొక్కడే చావుపుట్టుకలు లేనివాడు. క్రీ.శ॥ 1861వ సంవత్సరం వచ్చింది. శ్రీమాణిక్య ప్రభువు సోదరులలో అన్నగారైన దాదా మహరాజ్ సన్న్యాసము స్వీకరించారు. ప్రభువు ఆయనకు ఆయన నిర్యాణం గురించి హెచ్చరించారు. ఒకరోజు దాదాకి భగవదనుభవమైంది. ఆ తరువాత ఆయన బ్రహ్మరంధ్రము ద్వారా తన ప్రాణములను విడనాడి కైవల్యపదము నొందారు.

తదుపరి వారి మాతృమూర్తి బయాదేవి 1862లో



పరమపదించారు. మాణిక్ తమ్ముడైన తాత్యామహరాజ్ ఉత్తర క్రియలు శాస్త్రోక్తంగా నిర్వహించి పుత్రధర్మం నిర్వర్తించారు. ఆయనకు యోగ రహస్యాల నెన్నింటినో చెప్పారు ప్రభువులు. ఒకరోజు ఆయన తన శిష్యులతో నేడు తాత్యాకు ముక్తి లభిస్తుంది అన్నారు. ప్రభువులన్నట్లే తాత్యామహరాజ్ వారి సన్నిధిలోనే తన జీవయాత్ర చాలించారు. ఆ విధంగా 1862 లో ప్రభువు తల్లినీ సోదరునీ ఇహబంధ విముక్తులను చేశారు.

మాణిక్య ప్రభువులక శిష్యురాలైన వెంకమ్మగారు కూడా అదే సంవత్సరం రెండురోజులు నిర్విరామంగా 'భజన' నిర్వహించి ధ్యానసమాధిలో గడిపి మూడవదినం స్మృతిని గోల్పోయి తనువును విడనాడారు. భక్తులు ఆమె శరీరాన్ని కదిలిస్తే ఓంకార నాదం స్పష్టంగా వినపడిందట. ప్రభువులు ఆమె దేహమును సమాధియందు ప్రతిష్ఠింపించి దానిపై ఒక ఆలయాన్ని నిర్మింపజేశారు.

**కం॥ కర్తవ్యమట్లు తముస**
**ద్వర్తనులై చేతురిలను పనులన్ యోగుల్**
**కీర్తియు నిందయు ఒకటే**
**ఆర్తుల కాపాడుటొకటె ఆలోచనయా.**

దైవాంశ సంభూతులైన గురువులు (శ్రీరాఘవేంద్రుల వంటివారు) శరీర త్యాగం చేయాల్సిన సమయం ఆసన్నమైనపుడు భీష్మునివలె స్వచ్ఛందంగా దేహత్యాగం చేస్తారు. మహానుభావులు మనందరివలె కాక ముందే వారు 'వెడలిపోయే' సమయం తెలిసి ఉంటారు.

మాణిక్య ప్రభువులకు ఆరు నెలలముందే తన నిర్యాణం గురించి తెలుసు. క్రీ.శ. 1865లో తన అంతరంగిక శిష్యులకా విషయమెరింగించి రహస్యంగా తన కుటీరంలో సమాధిని నిర్మింపజేసుకున్నారు.

మార్గశిర శుద్ధ దశమినాడు ఆఖరి సారిగా దర్బారు నిర్వహించారు. ఆరోజు చేతికి ఎముకలేనట్లు విరివిగా దానాలు చేశారు. ఆ రాత్రి కుటీరమున ప్రవేశించిరి.



మరునాడు తన సోదరుడు తాత్యా కుమారులైన మనోహర్ మార్తాండ్‌లను ఇద్దరు చిన్నారి బాలురను పిలిపించుకుని ఆశీర్వదించి తనయొడిలో కూర్చుండబెట్టుకుని రెండు పుష్పమాలికలను వారి మెడలో వేసిరి.

(వారు తదుపరి కాలంలో మనోహర్ మాణిక్య ప్రభువుగా ఒకరు వాని తరువాత మార్తాండ్ మాణిక్య ప్రభువుగా మరియొకరు ప్రభువుల 'గాదీ' నే అలంకరించి ధర్మబోధ దర్బారు నిర్వర్తించారు)

ఆ తరువాత శ్రీ మాణిక్య ప్రభువు తన సమాధియందు ప్రవేశించి పైనున్న మూత కప్పించి వేశారు. ఇదంతా బహు రహస్యంగా జరిగింది.

మార్గశిర శుద్ధ పౌర్ణమినాడు శ్రీదత్తాత్రేయ స్వామివారి జయంతి వచ్చింది. భక్తులు తండోప తండాలుగా వచ్చారు. ప్రభువులేరి ఏరి అని అడిగారు. ఇంకా నిద్ర లేవలేదా? ఆరోగ్యం బాగా లేదా? తీర్థం



ఎవరిస్తారు. శిష్యులెందుకు అలా వున్నారు? ఇలా ప్రశ్నల వర్షం కురిపించి విషయం రాబట్టారు. ఏమిటీ ఘోరం....

**కం॥ హాహాకారములెగసెను**
**బాహాటముగానె ఏడ్చి భక్తులు వ్యథతో**
**ఆహా! విధి దుర్బలమని**
**మోహావేశముల క్రుంది మూర్ఛిల్లిరిగా.**

ఎవరెంత ఏడ్చినా పోయినవారు రారు అని పెద్దలంటారు. ప్రభువులు ఎందరినో పునర్జీవితుల్ని చేశారు కానీ వారిని మళ్ళీ సశరీరంగా ఎవరు తేగలరు. దత్తావతారులంతా అంతే. వస్తారు-జనులను ఉద్ధరిస్తారు - కనుమరుగవుతారు. అయితే మనబోటివాళ్ళం చేయాల్సిందేమిటంటే వారు దేన్ని ప్రబోధించారో ఆ మార్గంలో నడుస్తూ ధర్మాన్ని కాపాడాలి.


శ్రీమాణిక్య ప్రభువులు ఎచ్చట కూర్చునే వారో, నిద్రించేవారో అక్కడ దివ్యమైన దేవాలయం అనేక లక్షల వ్యయంతో నిర్మింపబడింది. 5 మణుగుల బంగారు రేకుతో



చేయబడిన 5 కలశములు దేవాలయముపై ప్రతిష్ఠించబడినవి.

ఈనాటికీ మాణిక్య పురమున శ్రీదత్త జయంతి అతి వైభవంగా జరుగుతుంది. అటువంటి పర్వదినాలలో 'గాదీ' ని పూజించి విరివిగా సంతర్పణలు చేస్తారు. విద్వాంసులు సంగీత కచేరీలు, విద్వత్సభలూ నిర్వహిస్తారు.

కొసమెరుపేమిటంటే భగవదవతారులను పూజించి భక్తితో మ్రొక్కటానికి కుత్సితమైన కులమత పట్టింపులుండవు. అవి అల్ప బుద్ధులకే. ఎంతోమంది హిందువులు అజ్మీర్ దర్గాలాంటి ముస్లిం ప్రార్థనా స్థలాలకి వెళ్తారు. అదేవిధంగా వారూ మన పండుగలు జరుపుకుంటారు. మొహరం పండుగ నాడు ముస్లింలు, ప్రభువులు స్వయంగా ధరించి ఇచ్చిన వారి టోపీని పూజించి ప్రార్థనలు జరుపుతారు.




# 3. శ్రీ అక్కల్‌కోట మహారాజ్



## ప్రార్థన

ఆ.వె॥ శ్రీ సమర్థ గురులు చేరి అక్కల్ కోట
స్థిరనివాసమయిరి వరదులైరి
భాగ్యవశముచేత వారి చరిత్రంబు
పద్యరచన వోలె వ్రాయుచుంటి.



## శ్రీ అక్కల్ కోట మహారాజ్

శ్రీ దత్తాత్రేయ స్వామియొక్క నాలుగవ అవతారము శ్రీ సమర్థ గురు అక్కల్ కోటమహారాజ్ అని దత్త భక్తులందరూ భావించెదరు.

వీరి జననమెక్కడ జరిగిందో, తలిదండ్రులెవరో కులగోత్రములేవో ఎవరికీ ఇదమిత్థంగా తెలియదు. ఆయన ఒకసారి నేను 'కదళీవనం' నుండి వచ్చాననేవారు. ఒకసారి శ్రీశైలం నాఊరు అనేవారు. తన కులం ఒకసారి బ్రాహ్మణుడననీ, ఒకసారి చర్మకారుడననీ అనేవారు. ఒక్కొక్కసారి నాపేరు నరసింహ భాను అనేవారు.

ఒక్కొక్కసారి యోగివలె నిర్వికారంగా చూస్తూ ఇలా అనేవారు...



ఉ॥ ఎక్కడనుండి వచ్చితిమొ యెవ్వడెరుంగును,
పోవసిద్ధమై
ఎక్కడ జేరువారమిటు లెందుకు యోచన
విశ్వమందునన్
ఎక్కడనైన దత్తగురుడిష్టత నున్నను
నేను అక్కడే
నిక్కము నేనె దత్తుడను నేను వసింతును
యెచ్చటైననున్.

ఇక ఆయన గురించి ఊహాగానాలు మానివేసి ఆయన శ్రీనృసింహ సరస్వతియే తిరిగి అవతరించారని భక్తులు విశ్వసించేవారు.

ఒకసారి ఒక దత్తాత్రేయ భక్తునికి ఆ స్వామి స్వప్నమున నేను రేపు మీ ఇంటికి వస్తానని చెప్పారట.

అతను మరునాడు వేచిచూస్తె ఎక్కడినుంచి వచ్చిందో ఒక పెద్ద పులి వచ్చిందట. అతను భయంతో వణికిపోతూ ఆ పులికి నమస్కరించగానే అది ఒక యోగి పుంగవునిగా మారిపోయిందట. ఆ యోగి సమర్థ గురుదేవులే. అప్పటినుండి సమర్థ గురులు శ్రీదత్తాత్రేయుడనే విశ్వాసం బలపడింది. ఇంకొక భక్తునికి ఆయన పాండురంగనివలె కన్పించారు. ఆయన క్రీ.శ. 1836లో అవతరించి ఉంటారని కొందరి అభిప్రాయం.

ఏది ఏమయినా ఆయన దర్శన భార్యం పొందినవారంతా ఏకగ్రీవంగా అంగీకరించే విషయమేమంటే ఆయన ఆజానుబాహుడు, స్ఫురద్రూపి, పొడగరి, పెద్దపాదములు, విశాలమైన నెన్నుదురు, పెద్దపెద్ద చెవులు, రత్నకుండలములు గల పలుచని చెవి తమ్మలు, వస్త్రమేమియు లేని కౌపీన (గోచీ) ధారణ, మెడలో తులసి మాల, రుద్రాక్షమాల స్ఫటికము తావళము చేసి మెడలో ప్రకాశిస్తుండేది. ఆయన పలువరస



ముత్యముల వలె ఉండేది. నుదుటి మధ్య చుక్కగల తిరు నామము శోభాయమానంగా ఉండేది. గులాబి దేహచ్ఛాయ, పెద్ద ఉదరముగల ఆయన చూపులు తీక్షణంగా ఉండేవి.

ఎప్పుడూ తనలో తనే మాట్లాడుకునే వారు. సంస్కృత శ్లోకాలు పఠిస్తుండేవారు. వేద మంత్రాలు వల్లిస్తుండేవారు. (వేదం వల్ల వేసే వారింట్లోంచి వచ్చిన ఈ రచయిత ఒక్క విషయం నిర్ద్వందంగా చెప్పగలడు. మానవ మాత్రులకు వేదం గురు ముఖతః గానీ రాదు. నిరంతరం వల్లెవేయకుండా వేదం నేర్చుకోవటం అసాధ్యం. వేదం చదివే వాని గురువెవరో తెలుసుకోవడం క్షణాల మీద పని. తన శిష్యుని ప్రవర అంటే పుట్టుక వివరాలు తెలియకుండా ఏ గురువు వేదం నేర్పడు) అలా వేదం వల్లిస్తున్న ఆయన ఆది గురువైన దత్తాత్రేయుడే అనటంలో ఇంకా సందేహాలున్నాయా? ఆయన ఎప్పుడూ సచ్చిదానంద మూర్తిగానే ఉండేవారు.



ఆయన ఎప్పుడూ ఒకచోట స్థిర నివాసంగా ఉండేవారు కాదు.

అందుకేనేమో ఆయనను భక్తులు 'చంచల భారతీ స్వామి' అని పిలిచేవారు. నడయాడే దైవం అనేవారు కొందరు. ఆయన తన భక్తులకు తన పాదుకలనిచ్చి నిస్సంకోచంగా వీని నర్చించండి మీకు శుభమౌతుంది అన్నారుట.

నైజాం నవాబంతటివాడు ఆ పాదుకలకు ఒక ఆలయం నిర్మింపచేసి దాని పోషణకి కొన్ని గ్రామాలు 'ఈనా' మిచ్చాడంటే సామాన్యమైన విషయం కాదు. స్వామివారు 'మంగళ వేఢ' లో క్రీ.శ. 1836 నుండి ఉన్నట్లు చరిత్రాధారాలున్నాయి.

ఒకరోజు ఆయన ఒక పేద బ్రాహ్మణుని ఇంటికి భిక్షకెళ్ళారు. ఆ ఇంట్లో ఒక గొడ్డుబోతు ఆవు తప్ప ఇంకేమీ లేదు. కరుణాత్ములైన స్వామి ఆ గోమాతనిలా ప్రార్థించారు.



**కం॥ గాయత్రీ గోమాతా!**
**ఈయవె యీ బ్రాహ్మణునకు ఇకపై రోజూ**
**తీయటి పాలు సమృద్ధిగ**
**నాయీ ప్రార్థనను యెంచి నయముగ తల్లీ!**

ఆ గృహిణిని సంతోషంతో పాలు పితకమని ఆదేసించారు. ఆమె అత్యాశ్చర్యకరంగా పాలు పితికి రొట్టె, పాలతో ఆయనకు భిక్ష పెట్టింది. ఆయన వారిని సకలైశ్వర్య ప్రాప్తిరస్తు అని దీవించారు.

యోగుల ప్రవర్తననర్థం చేసుకోవటం చాల కష్టం. సమర్థ గురువులూ అంతే. వారు ముళ్ళ పొదలలోనూ అడవులలో తిరుగుతుండేవారు. అయితే బసవప్ప అను ఒక భక్తుడు ఆయనను అవధూతగా గుర్తించెను. త్వమేవ శరణం అని అతను తన పనిపాటల నలక్ష్యంచేసి వారితోనే అడవిలో కూడా వేచి ఉండేవాడు. సంసారం పట్టించుకోకుండ తన మొగుడు ఈ దిగంబరి వెంట

తిరగటం ఆమెకి సుతరామూ ఇష్టంలేదు. తినటానికేదన్నా సంపాదించవయ్యా అని బాధించేది.

గురువునకన్నీ తెలుసు. అడవిలో హఠాత్తుగా ఆయన బసవప్పతో మనం కొన్ని పాముల్ని పట్టుకోవాలి. నాతోరా అని ఒక చోటికి తీసుకెళ్ళారు. అక్కడ గుట్టలు గుట్టలుగా పాములు పడిఉన్నాయి. బసవప్ప గడగడ వణికిపోయాడు. భయపడకు ఎన్ని వీలయితే అన్ని పట్టుకో అన్నారు. అతి ప్రయత్నం మీద బసవప్పకు ఒక్క పాము మాత్రమే దొరికింది. దాన్ని ఒక మూటలో కట్టించి....

**నాయనా! మూటగట్టిగా పట్టుకో ఇంటికి వెళ్ళి విప్పి చూడు** అన్నారు. బసవప్ప ఎంత వినమ్రుడంటే స్వామి అతన్ని ఆ మూటలో చేయిపెట్టి పాముతోకాటు వేయించుకో అంటే అతను అన్నంతపని చేస్తాడు.

అటువంటి బసవప్ప ఇంటికెళ్ళి మూట విప్పిచూస్తే ఒక బంగారం ముద్ద ఉన్నది. దానితో అతను ఆర్థికంగా కష్టాలనధిగమించాడు. అయితే ఇక్కడ ముఖ్య



విషయమేమంటే అతనికి గురువుపై భక్తి ఉన్నా మనస్సులో కించిత్ సంశయముంది. అందుకనే అతను ఒక్క పామునే పట్టుకోగలిగాడు. అదే నిస్సంకోచంగా గురువే చూసుకుంటారు అనుకుంటే ఇంకా ఎక్కువ పాములు పట్టుకొని ఇంకా ఎక్కువ ధనవంతుడయ్యేవాడు. అందుకే "చేసుకున్నవారికి చేసుకొన్నంత మహాదేవా!" అన్నారు. పెద్దలు.

అనాదిగా మనిషికి ఆధ్యాత్మిక జ్ఞానంపైన ఆసక్తి ఉన్నది. అది కొందరిలో పూర్వ జన్మవాసన వల్ల పిన్న వయసులోనే మనస్సులో నాటుకుని స్థిరపడుతుంది. వృద్ధిపొందుతుంది. భగవదనుభవం అయ్యేదాకా ఆ తృష్ణ విజృంభిస్తూనే ఉంటుంది. మరికొందరిలో ఆ ఆసక్తి జన్మాంతర వాసనల వల్ల కలిగినా వారి పాపకర్మ ఫలం కూడా ఉధృతంగా వుండుట చేత వారికి ఆధ్యాత్మిక జ్ఞానం నేర్చుకోవాలనున్నా, సానుకూలపడదు.

అటువంటి భక్త శిఖామణి ఒకడు సమర్థ గురుల దగ్గరకు వచ్చి దయచేసి బ్రహ్మజ్ఞానం కలిగించమని



వేడుకున్నాడు. ఆయన ఎంత నచ్చజెప్పినా అతడు వినలేదు. **సరే నీకర్మ అని స్వామి వానిని 'నాగనాథ్' దేవాలయం తీసుకొనిపోయి, అదిగో 'బ్రహ్మము' చూడు** అన్నారు. అతనక్కడ పడగ విప్పి తననే చూస్తున్న నల్లని సర్పాన్ని చూశాడు. భయంకరమైన దాని 'బుస' విని ఆతడు గజగజ వణికి నిశ్చేష్టుడై పిచ్చివాడైపోయాడు.

కొన్ని దినములు అతను అందరి హేళనకు గురై బాధే తెలియక అవమానాలనుభవించాడు. చివరికి సమర్థులకే ఆతనిపై కరుణ కలిగి అతని నాశీర్వదించి మామూలు మనిషిని చేశారు. వానితో ఇట్లా అన్నారు. **భయము, శంక, బాధ, ఆశ, మొండి మంకుతనం విడనాడకుండా అనన్యభక్తి కలుగదు. అనన్య భక్తిలేక పరమాత్మ కృపరాదు. పరమాత్మ కృపలేక బ్రహ్మజ్ఞానం కలుగుట అసాధ్యం కదా! కనుక ముందు సద్బుద్ధిని అలవాటు చేసుకో అప్పుడు నీ అంతట నీకే బ్రహ్మజ్ఞానం కలుగుతుంది.**



ఒక మహమ్మదీయ సాధువును ఆయన ఆదరించి ఆయననే శరణంటే సమర్థ గురువు అతని తలపై తన అమృత హస్తం ఉంచి అతనికి సమాధి స్థితిని అనుగ్రహించారు.

''మంగళవేఢ'' నొదలి స్వామి 'చలంబే' లో కొన్నాళ్ళున్నారు. అక్కడకూడా తన దివ్య మహిమలనెన్నో ప్రదర్శించారు. రామదాసు అనే ఒక సాధువు అభ్యర్థనతో అతని గదిలో ఉన్నారాయన. ఒకరోజు స్వామినిద్రిస్తుంటే గదికి తాళం వేసి అతను తనపని మీద బయటకు వెళ్ళాడు. నిద్రలేచిన స్వామి అవలీలగా తలుపుల్లోంచి బయటకు వచ్చి తనదారిన తను పోయారు. తమాషా ఏమంటే పోతూ పోతూ ఆయన రామదాసును కలిసి **'వెళ్ళొస్తాను నాయనా!'** అని చెప్పి మరీ వెళ్ళారు.

ఆ తరువాత 'చలంబే' నుండి 'మోహోల్' గ్రామం చేరారు సమర్థ. అక్కడ ఒకయోగి తనకు యోగాభ్యాసముచే కలిగిన శక్తులు ప్రదర్శిస్తుంటే వానికాపని తప్పు అని యోగ

శక్తిచే ఆధ్యాత్మికత పెంపొందించుకొని ఆత్మానందంలో ఉండాలి గానీ, ప్రదర్శించి వాటి శక్తిని తగ్గించుకోవద్దని జ్ఞానబోధ చేశారు. ఆ గ్రామంలో గణేశ్వరుని ఆరాధనా మహోత్సవాలకు నాంది పలికారు. మోహాల్‌లో స్వామి ఐదు సంవత్సరాలున్నారు. తరువాత 'షోలాపూర్' చేరారు సమర్థ.

షోలాపూర్‌లో దత్తాత్రేయుని ఆలయమే వారి బస అయింది. ఆయనను సిద్ధ పురుషునిగా గుర్తించి 'చింతోపంత్' అనే భక్తుడు తన గృహానికాహ్వానిస్తే వారి ఇంట కొన్నాళ్ళున్నారు స్వామి.

ఆయనకి మనోభావాలు చదివే దివ్యశక్తి ఉండేది. 'చింతోపంత్' ఒకరోజు స్వామిని భిక్షకాహ్వానించాడు. అతను కలెక్టర్ కార్యాలయమున పనిచేయుచుండెడి వాడు. స్వామి పూజవలన ఆలస్యమగుచున్నది. ఎలాగో పూర్తిచేసుకుని పరుగు పరుగున కార్యాలయానికి వెళ్లి తన ఆలశ్యానికి క్షమార్పణ అడిగాడు. కలెక్టరు గారు నివ్వెరపోయాడు. 'పంత్' ఇట్లా అంటున్నాడు.



**చం॥ కలిగెను అంతరాయములు కాదనకుంటిని**

**జాగు అయె, నా**

**పలుకులు సత్యమే అనుచు మన్నన వేడుచు**

**"హాజరేయ"గా**

**తలచుచు 'పట్టికన్‌ష తెరచి తానొనరించిన**

**సంతకంబటన్**

**వెలయుట జూచి మ్రాన్పడియె పెట్టెను భక్తితో**

**వందనంబులన్**

కలెక్టరు గారి పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. మరి తను చూస్తుండగా హాజరు పట్టిలో సంతకం చేసినదెవరు? దానివల్ల స్వతహాగా సునిసిత బుద్ధి అయిన కలెక్టరు అది సమర్థ గురువుల మహిమ అనీ, తన మూలంగా తన శిష్యునికి చెడ్డ పేరు రాకూడదని తన అద్భుత శక్తిచే తనే 'చింతో పంత్' వలె వచ్చారని గ్రహించి ఆ విషయం పైకి పొక్కకుండా తన మనసులో వారికి నమస్కరించాడు.



ఆ తరువాత సమర్థ గురుదేవులు షోలాపూర్ వదిలిపెట్టి 'అక్కల్ కోట' అనే చిన్న రాజ సంస్థానం చేరి రాజప్రాసాదం దగ్గరలోనే మకాం చేయాలని భావించారు. అక్కల్ కోటకు వెళ్ళు దారిలో ఆయన రామపూర్ అనే గ్రామం చేరారు. **'రాజు పటేల్'** అనే భక్తుని గృహమును సందర్శించారు ఆయన. 'రాజు పటేల్' వారికి భిక్షనిచ్చే అభిప్రాయంతో నలుబది మందికి విందు ఏర్పాటు చేశాడు. అయితే అప్పటికే స్వామి మహిమలు విన్న భక్తులు తండోపతండాలుగా వచ్చారు. వండిన పదార్థములు సరిపోవు. యజమాని కంగారు పడ్డాడు. సమర్థుని 'స్వామీ! ఇప్పుడేమిటి దారి అని అడిగాడు.

**విచారించకు నాయనా! వీరంతా నా చుట్టాలు వారి బాధ్యతనాది** అని ఆ గృహములోని పూజింపబడే దేవతా విగ్రహములను తెప్పించి ఒక బుట్టయందుంచి వాటిపై యజమాని చేయించిన రొట్టెలను దొంతరలాగ పెట్టించి **ఇక వడ్డనను ప్రారంభించండి భక్తులందరూ భుజించాక**



**నేను తింటాను** అన్నారు. ఇంతలో మరికొంతమంది భక్తులు వచ్చారు. వారు కూడా సుష్టుగా తిన్నాక స్వామి భిక్ష స్వీకరించారు.

అయితే ఈ సంఘటనకి కొసమెరుపు ఏమిటంటే యజమాని తయారు చేయించిన వంట పదార్థములలాగే చేసినవి చేసినట్లే ఉన్నాయి.

శ్రీ సమర్థుల ఆహారపుటలవాట్లు కడు వింతగా ఉండేవి. వారు ఎవరినీ ఆహారము కావలెనని అర్థించరు. ఆయన తన చేతులతో తను తినక ఎవరన్నా భక్తులు ఆప్యాయంగా తినిపిస్తే (నోటికందిస్తే) మాత్రమే తినెడివారు. నేను తినాలని అనుకుంటే ఆ దేవుడే తినిపిస్తాడు అనే వారు ఆయన. ఎందరో భక్తులు ఆయనకు ఎన్నో మధుర పదార్థములను సమర్పించేవారు. ఇంద్రియములను జయించిన ఆయన వాటిని తాకేవారు కూడా కాదు.

శ్రీసమర్థ గురుపుంగవులు ఎట్టకేలకు నివాసంగా అక్కల్ కోటకు చేరారు. అది ఒక రాజసంస్థానము ఆ రాజప్రాసాదము దాపున నిరాహారిగా మూడు రోజులు గడిపారు స్వామి. ఆయన వాలకం చూస్తే దారిన బోయే పిచ్చివానివలె ఉన్నది. అహ్మద్ ఆలీఖాన్ అనువాడు ఆయన నట్లే భావించి ఎగతాళిగా చిలుము పీలుస్తావా గురూ, అని ఎగతాళిచేసి ఖాళీ చిలుము గొట్టాన్ని ఆయన కిచ్చాడు.

ఆయన ఆ ఖాళీ చిలువము గొట్టాన్ని నోటిలో ఉంచుకుని పీల్చారు. అప్పుడు ఖాన్ గారి కళ్ళు తిరిగేటంత పని జరిగింది. ఆ చిలుము గొట్టము నుండి నిప్పు రవ్వలు పైకెగసి ఆయననోటినుండి దట్టమైన పొగ వచ్చింది. ఆశ్చర్యంతో భయకంపితుడైన అహమ్మద్ ఆలీఖాన్ ఆయనకు పాదాక్రాంతుడై తన అపరాధం మన్నించమని వేడుకున్నాడు.



వెంటనే చోళప్ప అనే బ్రాహ్మణుని ఇంట స్వామికి భోజనం ఏర్పాటుచేసి, స్వామివారు భుజించిన తరువాత మాత్రమే తను తిన్నాడా మహమ్మదీయుడు. కులమతములకు అతీతులైన స్వామివాని చెంతనే తనూ భుజించారు. శ్రీ చోళప్ప స్వామి ఆంతరంగిక భక్తులై పోయారు.

గాణ్గాపురమనే శ్రీగురువు క్షేత్రములో వెయ్యిమంది బ్రాహ్మణులకు సంతర్పణ చేస్తామని బొంబాయి నగరానికి చెందిన వ్యాపారస్తుడు, ఆయన భార్యా సంతానార్థులై మ్రొక్కుకున్నారు. సంతానం కలిగింది కానీ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులొచ్చి ఆ యజమాని కన్నుమూశాడు. అతి కష్టంమీద పిల్లవానిని సాకింది ఆమె. కొన్నాళ్ళకి కుదుటపడి తన మ్రొక్కు గుర్తుకు తెచ్చుకుంది.



**ఉ॥ ఎవ్విధి 'మ్రొక్కు' దీర్చెదను యేను పడంతుక**
**పేదరాలనే**
**నెవ్విధి వేయి బ్రాహ్మణుల కిత్తును భోజన**
**మేమి చేతునా**
**కెవ్వరు తోడు నిల్చెదరు ఇంతికి తోచక**
**కంటనీరిడెన్**
**నవ్వులు జిల్కుచున్ తెలిపె నాతికి 'దత్తుడు'**
**స్వప్న మందునన్**

**"తల్లీ నీవు విచారించకు నేనే శ్రీగురువును, నేను ఇప్పుడు అక్కల్‌కోటలో సమర్థగురువుగా ఉన్నాను. ఆయన ఒక్కడికి కడుపార భోజనం పెట్టు. వేయి మందికి భోజనం పెట్టి నీమ్రొక్కు తీర్చుకున్నట్లు అవుతుంది. విచారించకు"** అన్నారు. దత్తాత్రేయ స్వామి.

ఆ గృహిణి అక్కల్‌కోట చేరి ఆహార పదార్థములతో వీధి వీధి తిరిగింది. ఒక వీధిలో చిన్న పిల్లలతో ఆడుకుంటున్న సమర్థుని చూచి పోల్చుకోలేక పోయింది.



నవ్వుతూ ఆయనే ఆమెను సమీపించి **'మ్రొక్కు తీర్చుకోటానికి వచ్చి నాకోసం ఆహారం తెచ్చి ఇంకా ఎవరిని వెతుకుతున్నావు?'** అని అడిగారు.

వెంటనే ఆమె క్షణం కూడా ఆలోచించక సాష్టాంగ పడి వారికి భోజనం పెట్టింది. అప్పుడాయనన్నారు **'భయపడకు, నీ మ్రొక్కు తీరిపోయింది. నీకు శుభమౌతుంది'.**

ఒకసారి అక్కల్‌కోట రాజావారు తన జన్మదిన సందర్భముగా స్వామివారి ఆశీర్వచనం పొందాలనుకున్నాడు. అనుకోవడమే తడవుగా మందీ మార్బలంతోనూ, వాహనాలూ వైభవంతో స్వామివారి దగ్గరకు వచ్చి ఆయనెదుట పడ్డాడు. చాచి ఒక్కదెబ్బ చెంపపై వేశారు స్వామి. **'ఓయీ! నీవు నీ భృత్యులకు దేవుడవవుగాక! నాకేమి. సర్వసంగ పరిత్యాగులకు మట్టిబెడ్డయినా బంగారం ముద్ద అయినా ఒకటేనని ఎరుగవా? పో నీ ఈ వేషంతో నా కళ్ళబడకు** అని ఛీత్కరించారు.

మారు మాటలేక రాజుగారు వెనుదిరిగాడు. అదే మహారాజు వేరొక పర్యాయం సాధారణ దుస్తులలో కాలి నడకను వారి దగ్గరకు వస్తే ఆయన కరుణార్ద్ర హృదయులై **'బిడ్డకోసం ఎన్ని అగచాట్లు పడుతున్నా వయ్యా రాజా! విచారించకు నీకు పుత్ర సంతానం కలిగి నీ వంశం నిలబడుతుంది'** అని ఆశీర్వదించారు. శ్రీ సమర్ధుల కృపవల్ల ఆ రాజ్య సంస్థానానికి వారసుడు జన్మించాడు.

యోగాభ్యాసము చేయుచున్నప్పుడు 'విఠల స్వామి' అను ఒక సాధకుడు ఒక వింత సమస్యతో బాధపడేవాడు. అతను పండరిపురం నుండి స్వామిని చూచుటకు వచ్చెను. కానీ సమస్యేమిటో చెప్పడు. స్వామి 'మనస్సు' ద్వారా ఆ సమస్య నర్ధంచేసుకొని మనస్సుద్వారా తీర్చారు. ఆ సాధకుడు శ్రీసమర్ధులకు దాసుడయ్యాడని వేరే చెప్పవలెనా!

ఒకసారి శ్రీదత్తాత్రేయ స్వామి సంతానహీనులైన తన ప్రియ భక్త దంపతులకు స్వప్న దర్శనమొసగి **నేను మీకు జన్మించెదను నన్ను అక్కల్ కోటలోని సమర్ధులకు**



**జూపుడు** అని సలహానిచ్చెను. వారు తమకు కలిగిన బిడ్డను స్వామివారి వద్దకు కొనిపోగా ఆ బాలుడు పది దినములు స్వామివారి ప్రోద్బలమున ఆయన శిక్షణలో ఒకే పట్టున సమాధి స్థితిలో నుండి పలువురను అబ్బుర పరచెను. అతనికి **'శ్రీకృష్ణ సరస్వతి'** అను నామధేయము నొసంగి కొల్హాపురమున నుండుమని ఆదేశించిరి.

తన వద్దకేతెంచిన ఒక కుష్ఠు రోగిని దత్తాత్రేయ స్వామి, అక్కల్‌కోట స్వామి వద్దకు పంపగా వారు ఈ పని మన **'కృష్ణ సరస్వతి'** చేస్తాడని ఆయన వద్దకు కొల్హాపూర్ పంపారు. విచిత్రంగా శ్రీకృష్ణ సరస్వతి అతనిని రోగమునుండి విముక్తుని జేసిరి.

శ్రీ సమర్ధుల నాశ్రయించిన వారిలో ఒక రైల్వే ఉద్యోగి ఉండేవారు. ఆయనకు ఐదు సంవత్సరముల కుమారుడు గలడు. ఆ పిల్లవాడు భరించలేని కడుపు నొప్పితో వేదన ననుభవించు చుండెను. తండ్రి అతనిని అక్కల్ కోట మహారాజ్ సమర్ధుల వద్దకు తెచ్చెను. ఆ



కుర్రవాడు స్వామితో తను ఆ వ్యాధినుండి విముక్తుడనయినచో జీవితాంతము భగవంతుని సేవ చేసెదనని ప్రతిన పూనెను. స్వామి అనుగ్రహంతో అతను వ్యాధినుండి విముక్తుడైనాడు.

స్వామి అతనికి తమ వెండి పాదుకలనిచ్చి తమ దండమును ప్రసాదించిరి. బొంబాయి యందు నివసించుచు 'కేల్కర్ మహారాజ్' అనే పేరుతో ధర్మబోధ చేయమని ఆదేశించిరి. అతడట్లే చేసి ప్రఖ్యాతి నొందెను.

సమర్ధులు సిద్ధి పొందిన అనంతరం 'కేల్కర్ మహరాజ్' వియోగమును భరించలేక ఆమరణ నిరాహార దీక్ష నారంభించెను. అప్పుడు స్వామివారు కలలో అతనికి దర్శనమిచ్చి **నేనెక్కడికీ పోను. మీతోనే ఉన్నాను. నీ పట్టుదల మాను. నీవల్ల ఇంకా ఎంతో మేలు ప్రజలకు జరగాలి. నిరాహార దీక్ష విరమించు** అన్నారు. ఆయన ఆజ్ఞను తిరస్కరించలేక 'కేల్కర్' జీవితాంతం వరకూ ఒక్క గురువారం మాత్రమే భిక్ష తీసుకొని జీవించారు.



'సతారా' నివాసియైన ఒక బాలుడు తన సవతి తల్లి పెట్టే యాతనలు భరించలేక సమర్ధుల నాశ్రయించాడు. అతని పేరు 'సీతారామ్', వయస్సు కేవలం పన్నెండేళ్ళే. స్వామివారు అతనిని సిద్ధ పురుషునిగా మార్చారు. మంగళవేధలో నివాసం ఏర్పాటుచేసుకొని సీతారామ్ శ్మశాన వాసిగా తపమాచరించి జీవించెను. ఆయన సిద్ధాంతమే జ్ఞానదాయకంగా ఉండేది. భగవంతుడు సర్వాంతర్యామి ఆయన ఎక్కడలేడు. నేను స్మశానవాసినని అభ్యంతరమెందుకు. సదాశివుడు నివసించేది అక్కడేకదా! అందరూ చేరేది అక్కడికే అనే వారాయన. ఆ మహానుభావుడు పండరిపురం సమీపంలో సిద్ధి పొందారు.

'మునుగోడు' అనే గ్రామం కర్ణాటకలో ఉన్నది. అక్కడ ఒకసారి పెద్ద కరువు వచ్చింది. ఇది చాలాకాలం క్రింద సమర్ధ గురువుల కాలంలో జరిగింది.

**తే॥ మును 'చిదంబర దీక్షితు'లనెడి వాడు**
**తాను కరువు పీడితులను పూని కావ**
**అన్న సంతర్పణలు చేసె, నా 'సమర్థ'**
**సహకరించిరి చేసిరి సాయమెంతొ**

ఆ సంగతి స్వామివారే స్వయంగా తమ శిష్యులకు చెప్పేవారు.

మూలికా వైద్యం చేసే ఒక వ్యాపారి దత్తాత్రేయ స్వామి భక్తుడు. అతను అక్కల్ కోట స్వామి దర్శనార్థం బయలుదేరి అక్కల్ కోట సమీపంలో వచ్చాడు. ఒక చెఱువు దగ్గర ఆ వైద్యుడు కాళ్ళు కడుక్కొంటూ తనపై ఒక చెట్టు రెమ్మపడే సరికి ఉలిక్కిపడి పైకి చూశాడు. ఆ చెట్టుపై ఒక దిగంబర స్వామి కూర్చుని ఉన్నాడు. ఆయన ఎవరో కాదు అక్కల్‌కోట సమర్థ గురుదేవులే. చెట్టుదిగివచ్చి ఆయన ఆ వ్యాపారిని ఆశీర్వదించారు.

ఆ తరువాత ఆ వ్యాపారి జీవితం పూర్తిగ మారిపోయింది. అతను వైరాగ్యంతో వ్యాపారం మానివేసి తనూ దిగంబరియై నిరంతరం ఈశ్వర ధ్యానంలో



గడిపాడు. స్వామి అతనికి తన వెండిపాదులకనిచ్చి 'ధావదే' అనే చోట ప్రతిష్టింప చేశారు. అతను దివ్య శక్తులనెన్నో పొందాడు. అతనే ఆనందనాథ్ యోగిగా పేరు పొందాడు. మరికొన్ని చోట్ల మఠములు నెలకొల్పిన ఆ యోగి ప్రఖ్యాత కవియై 1904 వరకూ జీవించాడు. ఒకసారి ఎనిమిది సంవత్సరముల కంసాలి కుఱ్ఱవాడు తన బంధువులతో పాటు స్వామిని చూడవచ్చాడు. అతనిని చూస్తూనే స్వామివారు 'రంగోలీ మహారాజా! రావయ్యా' అని ఆహ్వానించి ఆ బాలుని ఆశీర్వదించారు. ఆ బాలుడు గొప్ప మారుతీ ఉపాసకుడై ఆ స్వామిని సేవించి పరివ్రాజకుడై విస్తృతంగా దేశాటన జేసి గొప్ప దత్త భక్తుడని ప్రఖ్యాతి వహించాడు.

'బౌరాడ్‌కర్' అనో ఒక బొంబాయి వాస్తవ్యుడు గొప్ప శివభక్తుడు. శంకరుడాతనికి స్వప్న సాక్షాత్కార మొసగి ధన్యుని చేసెను. ఆ శివుడు సాక్షాత్ సమర్థ వలెనే గోచరించెను. ఆ తరువాత 'బౌరాడ్‌కర్' కు స్వామిని సేవించి కొన్ని దివ్య శక్తులను పొంది అతను కూడా తన



నర్థించిన వారికి వ్యాధులను నయము చేయుచూ 'తాతామహారాజ్' అని పేరు పొందెను. సమర్థగురులు కాలం చేసిన తరువాత కూడా ఆయనకు సజీవంగా కనిపించేవారట.

శ్రీసమర్థ గురువులకు హిందువులే కాక అన్యమతస్థులు కూడా పాదదాసులైన సందర్భాలెన్నో ఉన్నాయి. ఒక ముస్లిం జైలు అధికారి ఉండేవాడు. ఒకసారి అతని అధీనంలో వున్న ఒక జైలులోంచి ఒక ఖైదీ పారిపోయాడు. తిరిగి వానిని బంధించనిచో తన ఉద్యోగము పోవుటేకాక తనూ జైలు పాలయే దుస్థితి దాపురించింది. అతను సమర్థ స్వామికిలా మ్రొక్కుకున్నాడు.

**కం॥ విడనాడెదనుద్యోగము**
**విడనాడెద బంధములను మిము గొల్చెదనే**
**విడువను మీ పాదంబుల**
**గడచిన ఈ 'గండ' మొకటి గౌరవమొప్పన్.**



అప్పుడొక అద్భుతం జరిగింది. ఆరోజే ఆ ఖైదీ పట్టుబడ్డాడు. తననెవరో సాధువు నిర్వీర్యుడిని చేసి కదలకుండా పట్టుకున్నాడని బలవంతంగా ఆ జైలు అధికారి దగ్గరకు లాక్కొచ్చాడని ఆ ఖైదీ అధికారులకు చెప్పాడు.

ఆ తరువాత ఆ జైలు అధికారి తనమాట ప్రకారం ఉద్యోగ విరమణ చేసి, స్వామి సమర్థులను సేవించాడు. స్వామి అతనిపై తన పాదుకల విసిరివేసి చిరునవ్వు నవ్వారు. అచంచల భక్తికల ఆ మహమ్మదీయుడు వానిని తన గృహమున ప్రతిష్టించుకొని పూజించెను. ఆ పాదుకల క్రింద మట్టినే స్వామి విభూతిగా రోగ పీడితులకిచ్చి ఆ మహమ్మదీయుడు ఎందరో రోగులకు స్వస్థత కలిగించాడు. వానిపై ఒక గొప్పదేవాలయమునే నిర్మింపజేశాడు. అతడు 'పీర్ సాహెబ్ మహారాజ్' అని ప్రసిద్ధుడైనాడు.

శ్రీదత్తాత్రేయుని భక్తుడైన ఒకడు తీవ్రమైన అనారోగ్యంతో పీడింపబడుతుండేవాడు. అతనిపేరు

'వామన్‌బువా' అతను సమర్ధ గురువుల గురించి విని తన అనారోగ్యమూ మనోవేదన గురించి వివరిస్తూ సుదీర్ఘమైన లేఖ స్వామివారికి వ్రాశాడు. ఈ లేఖలు వ్రాసే వారికి ఒక మనోజాడ్యముంటుంది. వారు జవాబుకూడా అంత సుదీర్ఘంగానూ ఓదార్పుగానూ ఉండాలని భావిస్తుంటారు. ఈ బువాగారు కూడా అలాగే స్వామినుంచి ఓదార్పు ఉత్తరము నాసించాడు.

అతని ఆశ నిరాశే అయింది. స్వామినుంచి సమాధానం రాలేదు. అతను విసిగిపోయి బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుందామని నిశ్చయించుకున్నాడు. ఒక పెద్ద చెఱువు దగ్గరకు వెళ్ళి అందులో దూకుదామని నిశ్చయించుకున్నాడు. అప్పుడొక విచిత్రం జరిగింది. అతను దూకబోతుంటే ఎవరో పట్టుకొని ఆపుతున్నారు చూస్తే ముందర ఎవరూ కనబడరు. వెనుదిరిగితే స్వామి కనుపించారు. అక్కల్ కోట గురువర్యులు **'నాయనా! ఏమిటీ వెర్రిపని? తప్పు చేస్తున్నావు'** అని మందలించారు.



దానికాతడు **'నేనేం చేయను స్వామీ! ఈ బాధ భరించలేను. దిక్కు, దైవం అనుకున్నమీరు నన్ను మరిచిపోయారు. సహాయం చేసేవారు లేరు. నాకు మరణమే శరణ్యం** అన్నాడు.

అప్పుడు శ్రీ సమర్ధ ఆ అభాగ్యునితో మందలింపుగా ఇలా అన్నారు.

**ఉ॥ చేసిన కర్మ 'జిడ్డు' వలె జీవితమంతయు**
**వీడ దేమియున్**
**చేసినగాని, మాన్పుటకు చేతయు కాదుర,**
**ఆత్మహత్యచే**
**తీసి పడేయ వీలవదు, ధీరతతోనిక**
**కర్మసైచినన్**
**మాసిన మచ్చయై మరల బాధలు పెట్టదు**
**అంతమౌనురా.**



**కనుక ఆ కాస్త కర్మఫలమూ అనుభవించు. ఇంతటితో పోతుంది** అని నీతి బోధ చేశారు. తీరా పరీక్షగా చూస్తే అక్కడెవ్వరూ లేరు. బువా తిన్నగా అక్కల్‌కోట దారిపట్టాడు.

దారిలో ఒక వాగు అడ్డమొచ్చింది. ఉప్పొంగి ప్రవహిస్తోంది అది. దాన్ని దాటటం అసాధ్యమని చింతిస్తూ కూర్చున్నాడు.

అవతలి ఒడ్డున స్వామి కనుపించారు బువాకి. ఆయన అవలీలగా నీటిని దాటి ఇద్దరి కొచ్చి ఆశీర్వదించారు. ఆ తరువాత 'బువా' వ్యాధినయమై స్వామి కృపవల్ల ఆధ్యాత్మిక జీవితం అలవడి సన్యాస దీక్ష స్వీకరించాడు.

బువా ఒకసారి పండరీ పురం దర్శిస్తే పాండురంగని స్థానంలో ఆయనకు అక్కల్ కోట మహారాజ్ శ్రీ సమర్ధే కనిపించారు. అదీ భక్తి పరాకాష్ట అంటే.



'బాబాసబ్నవీస్' అను ఒక భక్తుడు సమర్ధ గురువులను కలిసి ప్రణమిల్లి స్వామివారు ఎవరో బహుమతిగ నిచ్చిన పట్టు పరుపుపై సుఖ నిద్రజెందుట చూచి **'ఆహా! సన్యాసుల కేల యీ భోగలాలస'** అని అనుకొనెను. మనో భావాలను క్షణంలో పసిగట్టగల స్వామివారు ఒకనాడు సాయంత్రము తనతో రమ్మని సమీపమున గల అరణ్యమునకు దారి తీశారు. శిష్యుడు ఆయనని అనుసరించాడు. ఇంతలో చిన్న రాతిగుట్ట వచ్చింది.

**నాయనా! చీకటి పడింది ఈ పూటకి ఈ గుట్టపైనే గడుపుదాం** అన్నారు. దైవ ప్రార్ధన చేసుకొని ఆ కటిక బండపైనే శయనించారు స్వామి. క్షణంలో పెద్దగా గుర్రుపెట్టి నిద్రించసాగారు. ఇక భక్తుడి పాట్లు వర్ణనాతీతం. నిద్రరాదు. ఒకపక్క పెద్ద గురక రివ్వున చలిగాలి వీచింది. అది మార్గశిర మాసం కూడ. చలి ఎముకల్ని కొరికి వేయసాగింది. కటిక బండరాతిపై తను

కూర్చోలేక పోతుంటే ఈ స్వామి గుర్రుపెట్టి ఎలా నిద్రిస్తున్నారు? అప్పుడతనికి గీతావాక్యం స్ఫురించింది. రాగద్వేషాలకు సుఖదుఃఖాలకు శీతోష్ణాలకు చలించని సమదర్శిని యోగి అంటారు. వారు సుఖాలకి పొంగరు, దుఃఖాలకి క్రుంగరు. అయ్యో! తనెంత అల్పత్వంతో ఆలోచించాడు. శ్రీస్వామి జితేంద్రియులు. వెంటనే అతడు ఆయన కాళ్ళపైబడి కన్నీటితో మన్నించమని వేడుకున్నాడు.

అదే విధంగా స్వామి నిద్రిస్తుంటే ఇంకొక భక్తుడు మనసులోనే **పేరుకి సిద్ధపురుషులు కానీ నిజానికి నిద్రపురుషులు** అనుకున్నాడు. నిద్రపోతున్న స్వామి చటుక్కున లేచి **"నిద్రకు యోగ నిద్రకు తేడా తెలియని అర్భకుడా! మేం పోయేది యోగ నిద్రరా వెర్రివాడా',** అని బిత్తర పోయిన ఆ భక్తుని చూచి అసలు యోగ నిద్ర అంటే ఏమిటో చెబుతానని విపులీకరించారు. ఆ శిష్యుడు క్షమా భిక్ష వేడాడు.



ఒక కుటుంబంలో పుట్టిన పిల్లలందరూ మానసిక రోగులై మరణించసాగిరి. ఆ తల్లిదండ్రుల ఆవేదన కంతులేదు. తల్లి ఒక బిడ్డను కని మరణించగా తండ్రి కష్టపడి పెంచెను. ఆ పిల్లవాడు కూడా మానసిక రోగే కాని ఎలాగో బ్రతికి బట్టకట్టాడు. ఒకరోజు ఆ తండ్రికూడా కాలం చేశాడు. ఆ పిల్లవాడు యువకుడయ్యాడు కాని మేధకుడు.

తెలిసిన వారెవరో జాలి దలచి ఆ యువకుని సమర్థ స్వామి వద్దకు తెచ్చారు. పదునైదు దినములు స్వామివారు ఆ యువకుని జూచి రోజూ ఆశీర్వదించుచుండిరి కానీ ఏమియూ మాట్లాడలేదు. చివరికి ఒకరోజున ఉన్నట్లుండి **"నాయనా! నీవిక నీ గ్రామమునకు పోవచ్చును"** అన్నారు.

ఆ యువకుడు నీతి వర్తనుడై బ్రతుకు తెరువు కోసం సరిపడు తెలివితేటలు మాత్రం కలిగి వ్యవహరించసాగెను. అదే చాలు అని అతనిని ఆ వూరివారే పోషించారు. గౌరవంగా జీవించాడతను.



**ఆ॥ సత్ప్రవర్తనుండు సద్గురు కృపచేత**
**బ్రతుకగలడు ఎట్టి బాధలేక**
**నీతిమంతుడైన నిలిచి తోడ్పడెదరు**
**ప్రజలు జాలి దలచి బాసటవగ.**

స్వామి సమర్థ తన భక్తులకు జ్ఞాన బోధ రకరకాలుగా చేసేవారు. ఒకసారి నేరుగా మందలించేవారు. ఒకసారి పరోక్షంగా సూచించేవారు. ఆయన బోధనలు విని ఎంతటి కఠినాత్ములైనా మనసు మార్చుకుండేవారు. తనగురించి చెపుతూ ఒకసారి **'నాయనలారా! నా దేవూరు అంటే ఏం చెప్పమంటారు. దత్తాత్రేయుడెక్కడ ఉంటే అదే నాది కూడా. కాశీ, కరవీరపురం, ఔదుంబరము, గాణ్గాపురం, గిరినార్, కొల్హాపురం మొదలైన క్షేత్రాలన్నీ నావే. అవన్నీ నా ప్రియమైన విహార స్థలాలే** అనేవారు స్వామి.

ఒకసారి చోళప్ప అనే భక్తుని ఇంట కొన్ని దినములుండిరి. వానికో విచిత్రమైన ఆలోచన వచ్చింది.



అది స్వామి మరణించిన పిదప వారి సమాధి తన ఇంటి ఆవరణలో నిర్మించవలెనని. దానికోసం ఒక పెద్ద గొయ్యి త్రవ్వించాడు. పొడుగాటి స్వామి 'ఖననానికి' ఆ మాత్రం 'గుంట' ఉండాలని వాడి ఉద్దేశ్యం. స్వామి వాడితో **'నాయనా! ఎందుకింత పెద్ద గుంట త్రవ్విస్తున్నావు'** అని అడిగారు. అతడు తన ఆలోచన బయట పెట్టాడు. దానికి స్వామి **'ఓయీ! నేను నీ ఇంట స్థిర నివాసముంటానని ఎందుకనుకుంటున్నావు? ఈ గొయ్యి నాకు ఉపయోగించదు. నీకు పెద్దదవుతుంది. అయినా ఇంకొంచెం మట్టి ఎక్కువ పడుతుంది అంతేకదా. పర్వాలేదు. నా కార్యక్రమం నీ దానితర్వాతే కదా!** అన్నారు. ఆ తరువాత చోళప్ప మరణించటం వానిని ఆ గోతిలోనే సమాధి చేయటం జరిగింది. పెద్దలు చెప్పిన సామెత గుర్తుకు వస్తోందా? అవునండీ, ఎవరు తీసుకున్న గోతిలో వారే పడతారు అంటే ఇదే.

'బాలప్ప' అను ఒక ధన్యజీవి ఉదంతం ఇంకా రమణీయంగా ఉంటుంది. అతను శ్రీదత్తాత్రేయ స్వామి

భక్తుడు. విరక్తుడై అన్నీ త్యజించి తన సుఖమయ సంసారానికి భరత వాక్యం పలికిన ఆ బ్రాహ్మణుడు బాలప్ప గాణ్‌గాపురం చేరి భీమ, అమరజా సంగమమున భిక్షా వృత్తితో జపతపములతో జీవించుచుండెను.

కొన్ని మాసముల తరువాత దత్తాత్రేయు లాతనికి స్వప్న దర్శనమొసగి **'నాయనా అక్కల్ కోటలో నేనున్నాను. అక్కడికి పో** అన్నారు. అతను అక్కల్ కోటకు పోలేదు. నదీ సంగమంలో ఉన్న ప్రశాంతత ఇంకెక్కడా ఉండదని అక్కడే ఉన్నాడు. ఇంతలో అక్కల్‌కోట సమర్ధ కూడా కలలో కనిపించి, **ఏమిటీ జాగు? నీవెందుకు ఇక్కడికి రావటం లేదు'** అన్నారు.

వెంటనే బాలప్ప పరుగు పరుగున అక్కల్ కోట చేరాడు. స్వామినాశ్రయించి శుశ్రూష చేయనారంభించాడు. ధ్యాన సమాధియందు అతని మనస్సు నిలకడ లేక గాలిలోని దీపమువలె రెపరెపలాడుచుండెను. దిక్కు తోచక సమర్ధులనే శరణుని వేడెను.



సమర్ధ చిరునవ్వుతో అతని వీపుపై గట్టిగా చరిచి **ఇక నీకు స్థిమితం దక్కుతుంది** అన్నారు. అట్లే జరిగింది కూడా. అతనెంత స్థిర చిత్తుడైనాడంటే సమర్ధ అతనికి వారి శరీర త్యాగానికి ముందే తన ఉంగరము, రుద్రాక్షమాలలు, పాదుకలు ప్రసాదించి **నాయనా! నా ఈ పాదుకల నర్చించుకో** అని వాని శిరస్సుపై తన అమృత హస్తాన్ని ఉంచి ఆయన తన శక్తులను ఉత్తరాధికారమును వానికి ప్రసాదించిరి. బాలప్ప ఒక మఠమును స్థాపించి స్వామి పాదుకలు ప్రతిష్ఠించి సేవించెను.

శ్రీ స్వామి సమర్ధ తమ దేహత్యాగం ఎప్పుడు చేస్తారో ముందే చూచాయగా తెలిపారు.

**'చాలా దూరంపోయే రోజులొస్తున్నాయ్'** అన్నారు ఆయన ఒకసారి నవ్వుతూ. ఇంకా ఎనిమిది రోజుల్లో తన దేహత్యాగం జరుగుతుందనగా భక్తులందరినీ సామూహికంగా భగవన్నామ సంకీర్తనలో పాల్గొన్నారు.



**సీ॥ హే శివా! పురహరా! ఈవయ్య శరణమ్ము**
**శంభో! మహాదేవ! సాంబమూర్తి!**
**హే గిరిజాపతే! ఇంద్రాది సురనుతా!**
**గంగాధరా! హరా! కావరార**
**హేపినాకీ! భవా! హే రాజశేఖరా!**
**అర్ధనారీశ్వరా! ఆగమనుత!**
**హేముకుందప్రియా! ఎల్లలోకములేలు**
**ఈశ్వరా! గౌరీశ! హే త్రినయన!**

**తే॥ వ్యోమకేశా! మహేశ్వరా! బ్రోవరార**
**పన్నగాభరణా! వీరభద్ర వినుత!**
**నీలకంధరా! మృగధరా! నిగమవేద్య!**
**పాహిమాం పాహిమాం పాహి ఫాలనేత్ర!**

ఆ విధంగా శివనామ సంకీర్తనతో దిక్కులు పిక్కటిల్లాయి.

వారు చిన్న చిన్న రాళ్ళతో గోరీల మాదిరి కట్టడం చూసి భక్తులు ఆశ్చర్యపోయారు. 'తాత్యా సుబేదార్' అను వాని ఇంటికి నడచి వెళ్ళి అక్కడనుండి ఒక బండను



చెరువు వరకు వోయించి దానినా చెరువులో పడవేయించారు. భక్తులందరి చేత 'భంభం' అని జపింప చేశారు. ఒక గోవును దాని దూడను కట్టుత్రాళ్ళను తెంపించి స్వేచ్ఛనొసగారు.

పుట్టిన ప్రతి ప్రాణీ గిట్టక తప్పదని కదా భగవానుని ఆదేశం. ఆ నియమాన్ని ఉల్లంఘించటం సాధ్యం కాదు. అయితే మహాయోగులకు వెళ్ళే సమయం ముందే తెలుస్తుంది. నిర్మల హృదయంతో వారు ఏ వేదనా లేకుండానే శరీర త్యాగం చేస్తారు. అలనాటి యోగీశ్వరులనుంచి నేటి నవీన సమాజంలోని గురుపుంగవుల దాకా అందరిదీ ఒకటే దారి. 'నిందలేనిదే బొంది పోదు అను రీతిని అందరికీ జ్వరమో ఒక వ్యాధో వస్తుంది కాని అది కేవలం ఒక ప్రకృతి నియమం. అంతేకాని వారి దేహత్యాగానికి రోగానికి సంబంధం ఉండదు.

స్వామి వారికి జ్వరం రాగానే తన పడక మామిడి తోపులోకి మార్పించుకున్నారు. ఆహారం త్యజించారు.

జ్వర తీవ్రత ఎక్కువైనందువల్ల వైద్యులు ఔషధము లీయ యత్నించిననూ ఆయన తిరస్కరించి **'నామానాన నన్ను వదిలివేయండి'** అన్నారు. బలవంతం చేసి నోటిలో పోసినా మ్రింగక నిగ్రహించి బయటకు ఉమ్మివేసిరి. తనకి ఎంతో ఇష్టమైన మఱ్ఱిచెట్టు నీడకు తనను చేర్చమనిరి. అక్కడ ప్రశాంతత బొందుచుండగా భక్తులు విలపించిరి. వారిని ఓదార్చి **'నన్ను మీరు ధ్యానిస్తే మీ కళ్ళముందుంటాను. నన్ను మీ కనులతో మీరు చూడలేక పోవచ్చు కానీ నా రక్షణ నా భక్తులకెప్పుడూ ఉంటుంది. సశరీరుడనై మీ వేదనలు తీరుస్తాను** అన్నారు.

**'మీ పూర్వీకులు ఏ దేవతల నర్చించారో మీరూ వారినే అర్చించండి'** అని ఇంకొందరిని ఆశీర్వదించారు. ఆయన్ని చూచి వారు కన్నీరు మున్నీరుగా రోదించ నారంభించారు. ఆయన ఇలా మందలించారు.



**చం॥ తగదిటు కంటనీరమిడి తామిటు రోదనజేయ రాదు మీ**
**కగు పడుచుందు నేను మనమందున నన్ స్మరియుంచినంతనే**
**వగచుట వ్యర్థమైన పని మానవకోట్లకు జావు నిత్యమౌ**
**తగునని ఆ సదాశివుని తప్పక గొల్వుడు జన్మ ధన్యమౌ**

అని చిరునవ్వు పెదవులపై చెదరకనే ప్రశాంతంగా శరీరాన్ని త్యజించారు.

స్వామి మరొక్కమారు కళ్ళు తెరచి తమని చూస్తారని అంతా ఆశపడ్డారు. కానీ 8-5-1876 లో అంటే చైత్ర బహుళ త్రయోదశి నాడు సచ్చిదానంద పరబ్రహ్మమున లీనమయ్యారు.

అక్కల్‌కోట మహారాజా సంస్థానాధీశుడు సమస్త రాజలాంఛనాలతో వారికి ఆ మర్రిచెట్టు మూలముననే దివ్యమైన సమాధిని కట్టించారు.



శ్రీసమర్థ పరమపదించిన పిదప కృష్ణాజీ అను భక్తుడు అక్కల్‌కోట పోదామని యత్నించుచుండగా ఆ రాత్రి స్వామి అతని కలలో కనిపించి **శ్రమపడి ఇంతదూరం రావద్దు. నేను ప్రస్తుతం షిర్డీలో సాయిబాబా పేరుతో నెలకొని యున్నాను. వారిని దర్శించు. నన్ను దర్శించినట్లే భావిస్తాను** అన్నారు.

దత్తాత్రేయ అవతార పరంపరలో సాయిబాబా అవతారంలో విచిత్రమేమంటే అక్కల్‌కోట స్వామి మరియు సాయిబాబా ఒకేసారి జీవించి యుంటారు. ఇద్దరూ దత్త అవతారమైతే ఒకేసారి ఇద్దరు జీవించి ఉండడం ఎలా సాధ్యం? అక్కల్‌కోట స్వామి సాయిబాబా కంటే ముందు వారే కాని ఆయన సిద్ధి పొందాక సాయిబాబా అవతరించలేదు. ఆయన సజీవులై యున్నప్పుడే సాయికూడా జీవించి ఉన్నారు. ఇదెలా సాధ్యం?

సాధ్యమే. అవతార పురుషులు ఒకేసారి అవతరించవచ్చు. పరశురాముడు శ్రీహరి అవతారమే.



శ్రీరామచంద్రుడూ, శ్రీకృష్ణుడూ ఇద్దరూ శ్రీహరి అవతారమే. పరశురాముడు శ్రీరామచంద్రునీ శ్రీకృష్ణునీ కలుసుకున్నాడు కదా! అదే విధంగా స్వామి సమర్థ మరియు సాయిబాబా ఇద్దరూ శ్రీదత్త అవతారులైనా సమకాలీకులే.

ఇక చివరిగా ఒకమాట.

ఈ ముగ్గురు గురువుల గురు చరిత్ర పద్య గద్య రూపంలో ఇట్లా వ్రాసి శ్రీనృసింహ సరస్వతి, శ్రీమాణిక్య ప్రభువు, శ్రీఅక్కల్ కోట మహారాజ్ (సమర్థ గురువులు) అనే ఈ మహాత్ముల దివ్య చరిత్ర చెప్పి నేను ధన్యుడినయ్యాను.

దీనిని చదివి గురుకృప పొందినందుకు మీకు వినయ పూర్వక శుభాభినందనలు. ఇందులోని తప్పులేమున్నా అవన్నీ నావే, ఒప్పులు అన్నీ శ్రీదత్తాత్రేయ స్వామివే.

## మంగళము

ఉ॥ దత్తుని మూడు మూర్తులగు దైవ సముల్
గురులైన వీరిదౌ
ఉత్తమ శ్రీ చరిత్రములు యుల్లము సంతస మంద
దెల్పితిన్
ఇత్తరి, మీకు గల్గునిల ఎల్లపుడున్ సిరి,
మంగళంబులున్
కొత్త దనంపు యత్నమిది కోరిక దీరుటకై
పఠింపుడీ

**సర్వేజనాః సుఖినోభవంతు**

217



218




219




220